RNI No.TELTEL/2016/68720




ప్రజల కోసం పోలీస్

# పోలీస్ నిఘా

— POLICE NIGAH TELUGU DAILY — తెలుగు దినపత్రిక

Published from Rangareddy, (Circulated) by Hyderabad, Rangareddy, Nalgonda, Mahabubnagar, Sangareddy, Vikarabad, Medak, Siddipet, Karimnagar, Sirisilla (Vemulawada),Nizamabad, Warangal, Yadadri Bhonagiri, Nirmal, Adilabad

రంగారెడ్డి | సంపుటి : 10 | సంచిక : 248 | ఎడిటర్: కేమోజు శ్రీనివాస్ | బుధవారం 24-06-2026 | వెల: రూ.5/- | పేజీలు: 10

### కొత్త పథకం.. ఉత్తమ పేరు సూచిస్తే రూ.లక్ష బహుమతి

హైదరాబాద్, జూన్ 23 (పోలీస్ నిఘా) : నగరంలో 'క్యూర్' పరిధి (ఓఆర్ఆర్ లోపలి ప్రాంతం)లో లక్ష ఇళ్ల నిర్మాణానికి హౌసింగ్ బోర్డు కసరత్తు చేస్తోంది. ఈ కొత్త పథకానికి పేరు కోసం ప్రజల నుంచి సూచనలు ఆహ్వానిస్తోంది. ఉత్తమ పేరు సూచించిన వారికి రూ.లక్ష బహుమతి ఇవ్వనున్నట్లు ప్రకటించింది. ఈనెల 28 వరకు పేరు సూచించవచ్చని హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ గౌతమ్ తెలిపారు. tghd.official ఇన్‌స్టాగ్రామ్ పేజీ ద్వారా పోటీలో పాల్గొనవచ్చన్నారు.

## ధాన్యం కొనుగోలు లక్ష్యాన్ని పెంచాలి

**సీఎంఆర్ గడువునూ పొడిగించాలి**

**రైతుల పక్షాన కేంద్ర మంత్రిని కలసిన రాష్ట్ర ప్రతినిధి బృందం**

**మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి**



హైదరాబాద్, జూన్ 23 (పోలీస్ నిఘా) : తెలంగాణ రైతుల ప్రయోజనాల పరిరక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో రబీ 2025-26 సీజన్‌లో రికార్డు స్థాయిలో జరిగిన వరి కొనుగోళ్ల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన సేకరణ లక్ష్యాలను వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా పెంచాలని, కస్టమ్ మిల్డ్ రైస్ (సీఎంఆర్) సరఫరా గడువులను పొడిగించాలని కోరుతూ కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి ఉత్తమ్ కుమార్ రెడ్డి లేఖ వినతిపత్రం అందజేశారు. సహచర మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి మంగళవారం ఉదయం ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిశారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల పక్షాన నిలబడి కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ)కు ఒక్క గింజ కూడా నష్టపోకుండా కొనుగోలు చేసినట్లు మంత్రి వివరించారు. దేశంలోనే అత్యధికంగా తెలంగాణ ప్రభుత్వం ఇప్పటివరకు 80.09 లక్షల మెట్రిక్ టన్నుల వరిని సేకరించిందని, కొనుగోలు ప్రక్రియ ఇంకా కొనసాగుతోందని చెప్పారు. ఖరీఫ్, రబీ కలిపి 2025-26 మార్కెటింగ్ సీజన్‌లో 152 లక్షల మెట్రిక్ టన్నుల కుపైగా వరి సేకరణ జరిగి రిత్రాత్మక రికార్డు నమోదవగా రాష్ట్రం పంపిన ఉత్పత్తి అంచనాలకు విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం వరి సేకరణ లక్ష్యాలను తక్కువగా నిర్ధారించడం వల్ల రాష్ట్రంపై భారీ ఆర్థిక భారం పడిందని ఆయన వివరించారు. రబీ 2025-26 సీజన్‌కు రాష్ట్ర ప్రభుత్వం 90 లక్షల మెట్రిక్ టన్నుల వరి సేకరణ అంచనాలు సమర్పించినప్పటికీ కేంద్రం 35 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం (51.47 లక్షల మెట్రిక్ టన్నుల వరికి సమానం) మాత్రమే లక్ష్యంగా నిర్ణయించిందని మంత్రి తెలిపారు. అయితే రైతుల ప్రయోజనాల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర లక్ష్యాలను మించి కొనుగోళ్లు నిర్వహించిందన్నారు. గత మూడు సీజన్లలో కేంద్రం నిర్దేశించిన లక్ష్యాలకు మించి రాష్ట్రం 69.50 లక్షల మెట్రిక్ టన్నుల వరిని అదనంగా కొనుగోలు చేయాల్సి వచ్చిందని, దీనివల్ల రాష్ట్ర ఖజానాపై రూ.16,446 కోట్ల అదనపు ఎంఎస్‌పీ భారం పడిందని ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. తీవ్ర ఎండలు, హమాలీల కొరత, నిల్వ సామర్థ్య సమస్యలు, భారీగా వరి రాక, అకాల వర్షాలు వంటి ప్రతికూల పరిస్థితుల మధ్య కూడా రైతుల ప్రయోజనాల కోసం ప్రభుత్వం వెనుకడుగు వేయలేదని స్పష్టం చేశారు. రైతుల నుంచి వచ్చిన ప్రతీ గింజను కొనుగోలు చేసి వారి ఆదాయాన్ని కాపాడటంలో తమ ప్రభుత్వం విజయం సాధించిందన్నారు.

## మెట్రోపై చర్చలు ఫలప్రదం

**ఫేజ్-1 వాల్యుయేషన్, ఫేజ్-2 విస్తరణకు కన్సల్టెంట్‌గా 'ఎస్‌బీఐక్యాప్స్'**

**కన్సల్టెంట్ నివేదిక ఆధారంగా భవిష్యత్ కార్యాచరణ**

**సమన్వయ సభ్యులుగా కేంద్ర అధికారి, ఎంఏయూడీ స్పెషల్ సెక్రటరీ**

**ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రుల సంయుక్త సమావేశంలో నిర్ణయం**



న్యూఢిల్లీ, జూన్ 23 : హైదరాబాద్ మెట్రో రైలు స్వాధీనం, విస్తరణపై కేంద్ర మంత్రులతో ముఖ్యమంత్రి జరిపిన చర్చలు ఫలప్రదమయ్యాయి. హైదరాబాద్ మెట్రో ఫేజ్-1 స్వాధీనం, ఫేజ్-2 విస్తరణపై ఉన్న ఆటంకాలను తొలగించేందుకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రులతో వరుసగా రెండు రోజులు సమావేశమయ్యారు. తొలుత సోమవారం రాత్రి రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డితో సుదీర్ఘంగా చర్చించారు. కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం ఉదయం ఖట్టర్ నివాసంలో ఈ అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ మెట్రో ఫేజ్- 1 వాల్యుయేషన్, ఫేజ్-1 స్వాధీనానికి అవసరమైన రుణ సేకరణ, రుణ సంస్థ ఎంపిక, మెట్రో ఫేజ్-2 విస్తరణ, నిర్మాణ వ్యయం, అందుకు అవసరమైన రుణ సేకరణ అంశాలను అధ్యయనం చేసేందుకు కన్సల్టెంట్‌ను నియమించాలని కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రి ఏకాభిప్రాయానికి వచ్చారు. కన్సల్టెంట్‌గా 'ఎస్‌బీఐక్యాప్స్' ని ఎంపిక చేశారు. మెట్రో ఫేజ్-1 వాల్యుయేషన్, ఫేజ్-2 విస్తరణ, ఇతర అంశాలపై ఈ సంస్థ సమగ్రంగా అధ్యయనం చేయనుంది. ఆ సంస్థ ఇచ్చే నివేదిక ఆధారంగా భవిష్యత్తు కార్యాచరణ చేపట్టనున్నారు. అధ్యయనం సమయంలో కన్సల్టెంట్ సంస్థతో సమన్వయానికి ప్రతినిధులుగా కేంద్ర ప్రభుత్వం నుంచి ఒక అధికారి, రాష్ట్ర ప్రభుత్వం తరఫున రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి(ఎంఏ అండ్ యూడీ) శాఖ ప్రత్యేక కార్యదర్శి ఉండాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ అధికారులు ఇద్దరూ సమన్వయం చేసుకుంటూ ఈ ప్రక్రియ వేగంగా సాగేందుకు కృషి చేస్తారు.

## మల్లారెడ్డి నివాసాల్లో ఏసీబీ సోదాలు

**8 ప్లాట్లు, 10 ఎకరాల భూమి గుర్తింపు**



హైదరాబాద్, జూన్ 23 (పోలీస్ నిఘా) : నిజామాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కొమ్ముగిరి మల్లారెడ్డిపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసును ఏసీబీ నమోదు చేసింది. అనంతరం ఆయన్ను అరెస్ట్ చేసి నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరు పరిచింది. అక్రమాలకు పాల్పడి ఆస్తులు సంపాదించినట్లు మల్లారెడ్డిపై ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం హైదరాబాద్‌లోని మచ్చబొల్లారం, నిజామాబాద్‌లోని ప్రగతినగర్‌లోని మల్లారెడ్డి నివాసాలతో పాటు ఆయన బంధువుల ఇళ్లలో ఏకకాలంలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఏసీబీ తనిఖీల్లో మల్లారెడ్డికి చెందిన పలు ఆస్తులను గుర్తించారు. 4 ఇళ్లు, ఒక వాణిజ్య భవనం, 8 ఖాళీ ప్లాట్లు, 10.23 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నట్లు తేల్చారు. ఆయన వద్ద సుమారు రూ.3.31లక్షల నగదు, రూ.50లక్షల బ్యాంకు నిల్వలు, మల్లారెడ్డి భార్య, కుటుంబ సభ్యుల పేర్లపై 3 బ్యాంకు లాకర్లు ఉన్నట్లు గుర్తించారు. విచారణలో భాగంగా వీటిని త్వరలో తెరవనున్నారు. సోదాల్లో గుర్తించిన మొత్తం ఆస్తుల విలువ ప్రభుత్వ లెక్కల ప్రకారం సుమారు రూ.3కోట్లుగా అంచనా వేశారు. మార్కెట్ విలువ ప్రకారం అనేక రెట్లు అధికంగా ఉండే అవకాశముందని అధికారులు పేర్కొన్నారు. మల్లారెడ్డిని నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరు పరిచిన అనంతరం రిమాండ్‌కు పంపారు.

## బాసర మహంకాళి ఆలయంలో దొంగతనం

**అమ్మవారి వెండి కిరీటం, హుండీ నగదు అపహరణ**

**మహంకాళి ఆలయ గేటు పగలగొట్టి చోరీ.. వ్యాసగుడి సమీపంలో ఖాళీ హుండీ లభ్యం**

**ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ జానకి షర్మిల**



నిర్మల్, జూన్ 23 (పోలీస్ నిఘా) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాసర సరస్వతీ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో అర్ధరాత్రి గుర్తుతెలియని దొంగలు హల్‌చల్ చేశారు. ఆలయ పైఅంతస్తులో ఉన్న మహంకాళి అమ్మవారి గుడి గేటు తాళాలు పగలగొట్టి, అమ్మవారి వెండి కిరీటంతో పాటు హుండీని ఎత్తుకెళ్లారు. హుండీలోని నగదును కాజేసి, అనంతరం ఖాళీ హుండీని వ్యాసగుడి సమీపంలో పడేసి పరారయ్యారు. మంగళవారం తెల్లవారుజామున అర్చకులు పూజా కార్యక్రమాల నిమిత్తం ఆలయానికి చేరుకోగా ఈ చోరీ ఘటన వెలుగులోకి వచ్చింది. ఆలయ సిబ్బంది సమాచారం మేరకు నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఐపీఎస్ సంఘటనా స్థలానికి చేరుకుని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ క్లూస్ టీమ్ సేకరించిన ప్రాథమిక ఆధారాలు, ఆలయ పరిసరాల్లోని సీసీటీవీ ఫుటేజీలను అధికారులతో కలిసి పరిశీలించారు. నిందితులను పట్టుకునేందుకు ప్రతి కోణంలోనూ దర్యాప్తును ముమ్మరం చేయాలని,

▶▶మిగతా 7లో

## అట్టహాసంగా పద్మ పురస్కారాల ప్రదానోత్సవం

**'పద్మశ్రీ' అందుకున్న రాజేంద్రప్రసాద్, మురళీమోహన్**



న్యూఢిల్లీ, జూన్ 23 : రాజధాని ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ వేదికగా పద్మ పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా జరుగుతోంది. వివిధ రంగాలలో విశేష సేవలు అందించిన ప్రముఖులకు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దేశ అత్యున్నత పౌర పురస్కారాలను అందజేస్తున్నారు. పద్మ అవార్డుల ప్రదానోత్సవంలో భాగంగా మంగళవారం జరిగిన రెండో విడత కార్యక్రమంలో

▶▶మిగతా 7లో

## ట్రాఫిక్ విధులను సమర్థవంతంగా నిర్వహించాలి

**ట్రాఫిక్ విధులకు శిక్షణ పొందిన పోలీసు సిబ్బందితో సైబరాబాద్ సీపీ సమావేశం**



హైదరాబాద్, జూన్ 23 (పోలీస్ నిఘా) : సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ విధుల నిర్వహణ కోసం ప్రత్యేక శిక్షణ పొందిన 150 మంది గ్రేహౌండ్స్ పోలీసు సిబ్బందితో ఈరోజు సైబరాబాద్ సీపీ కార్యాలయం ఆడిటోరియంలో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్, ఐపీఎస్., సమావేశమయ్యారు. వారం రోజుల పాటు నిర్వహించిన ప్రత్యేక శిక్షణ పూర్తి చేసుకున్న సిబ్బందితో సీపీ మాట్లాడి, శిక్షణలో నేర్చుకున్న అంశాల గురించి తెలుసుకున్నారు. ట్రాఫిక్ విధులను సమర్థవంతంగా నిర్వహించడం, ప్రజలతో మర్యాదగా వ్యవహరించడం, ట్రాఫిక్ నియంత్రణలో పాటించాల్సిన విధానాలపై సూచనలు చేశారు. శిక్షణలో ట్రాఫిక్ నిర్వహణ, ట్రాఫిక్ ఇంజనీరింగ్, చట్టపరమైన అంశాలు వంటి విషయాలపై ఇండోర్, అవుట్‌డోర్ తరగతుల ద్వారా అవగాహన కల్పించినట్లు తెలిపారు. అలాగే హెల్మెట్ వినియోగం, లేన్ క్రమశిక్షణ, రాంగ్‌సైడ్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి ఉల్లంఘనలపై తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ట్రాఫిక్ విధులకు ఆటంకం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు



తీసుకోవాలని సూచించిన సీపీ, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచాలని చెప్పారు. ప్రమాదాల వల్ల కుటుంబాలు తీవ్రంగా నష్టపోతు న్నాయని, ప్రతి పోలీసు సిబ్బంది ప్రజల్లో బాధ్యతాయుతమైన డ్రైవింగ్‌పై చైతన్యం కల్పించాలని సూచించారు. ఐటీ కారిడార్ ప్రాంతాల్లో ట్రాఫిక్ ఒత్తిడి ఎక్కువగా ఉంటుందని, అక్కడ అప్రమత్తంగా విధులు నిర్వహించాలని తెలిపారు. ఈ వర్షాకాలంలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండి, ప్రజలకు ఎటు వంటి ఇబ్బందులు కలగకుండా తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. సేవాభావంతో, బాధ్యతా యుతంగా వ్యవహరిస్తూ ప్రజలకు తక్షణ సహాయం అందించాలని, తద్వారా పోలీసు శాఖపై ప్రజల విశ్వాసం మరింత పెరిగేలా కృషి చేయాలని పేర్కొన్నారు. తమ ప్రవర్తన, పనితీరుతో పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ డీసీపీ టి. అన్నపూర్ణ, ఎస్‌బీ డీసీపీ సుధీంద్ర, ట్రాఫిక్ డీసీపీ శేషాద్రిని రెడ్డి, సైబర్ క్రైమ్ డీసీపీ సాయి మనోహర్, సీఏఆర్ & హెడ్‌క్వార్టర్స్ డీసీపీ సంజీవ్, శేరిలింగంపల్లి ట్రాఫిక్ ఏడీసీపీ హనుమంతరావు, ట్రాఫిక్ అడ్మిన్ ఏడీసీపీ నరేందర్ తదితర అధికారులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే దొంతిని కలిసిన చెన్నారావుపేట మండల సర్పంచుల ఫోరమ్ మండల కమిటీ



చెన్నారావుపేట, జూన్ 23 (పోలీస్ నిఘా) : మండలం నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి గారిని సర్పంచుల ఫోరమ్ మండల అధ్యక్షుడు చెరువు కొమ్మూ తండా సర్పంచ్ భూక్య మైబు సింగ్ రాథోడ్ ఆధ్వ ర్యంలో నేడు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసారు.. ఈ సందర్భం గా ఎమ్మెల్యే దొంతి సర్పంచ్ ల ఫోరమ్ మండల అధ్యక్షుడు మైబు సింగ్ రాథోడ్ ని శాలువ తో సన్మానించి కమిటీ కి శుభాకాంక్షలు తెలిపారు.. ఈ సంద ర్భంగా ఫోరమ్ అధ్యక్షు డు మైబు సింగ్ మాట్లా డుతూ ఎమ్మెల్యే దొంతి ఆశీర్వదంతో సర్పంచు ల సమస్యల ను ప్రభు త్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారా నికి కృషి చేస్తానని అన్నారు..ఈ కార్యక్ర మంలో మండల అధ్య క్షుడు సిద్దన రమేష్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మొగిలి వెంకట్ రెడ్డి జిల్లా కార్య దర్శి కంది శ్వేతాకృష్ణ చైతన్య రెడ్డి మైనారిటీ సెల్ మండల అధ్యక్షు డు అమీరొద్దీన్ సర్పంచుల ఫోరమ్ ఉపాధ్యక్షులు మైదాం రాకేష్ ప్రధాన కార్యదర్శి కుసుమ సతీష్ సంధ్య మహేందర్ ఫోరమ్ సలహాదారు పురం అనిత రాంబాబు ఫోరమ్ కార్యవర్గ సభ్యులు కనకమల్లు బాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## నైపుణ్య శిక్షణతో ఆర్థిక ప్రగతి

### -మాజీ మంత్రి ఎమ్మెల్సీ బసవరాజ్ సారయ్య-



వరంగల్, జూన్ 23 (పోలీస్ నిఘా) : మంగళవారం వరంగల్ మండి బజార్ లో డాక్టర్ పర్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎఫ్,ఎం,ఎం సోషల్ సర్వీస్ సొసైటీ సహకారంతో నిరుపేద మహిళలకు ఉచిత టైలరింగ్,మగ్గం శిక్షణ కార్యక్రమాన్ని ఫౌండేషన్ వ్యవస్థాపకులు జన్ను అహరోను అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ మంత్రి ఎమ్మెల్సీ బసవరాజ్ సారయ్య హాజరై మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు అవకాశాలు కల్పించినట్లయితే వారి ప్రగతి సాధిస్తారనే ఉద్దేశంతో మహిళా సంఘాలకు రేషన్ షాపులు ,బస్సు రవాణా ,పెట్రోల్ బంకులు ,మహిళలను కోటీశ్వరులుగా చేయాలనే సదుద్దేశంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని ఇటువంటి స్వచ్ఛంద సంస్థల సహకారంతో మహిళలకు కూడా ఆర్థిక అవకాశాలు ఎంతగానో లభిస్తాయని మహిళలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ప్రభుత్వ పథకాల అనుగుణంగా తగిన ప్రోత్సాహకాలను కూడా అందిస్తామని తెలిపారు .అనంతరం ఉచిత హోమియోపతి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సిస్టర్ సహాయ, కోఆర్డినేటర్లు బత్తుల కరుణ, ఎర్ర శ్రీకాంత్ ,పర్లి ఫౌండేషన్ నిర్వాహకులు జన్ను క్రాంతి, ఏ ,హెచ్,టి,యు ఇన్స్పెక్టర్ ఓ రమేష్, ఎస్సై సుధాకర్ తదితరులతోపాటు ఎంజీఎం బ్లడ్ డొనేషన్ క్యాంపు వైద్య సిబ్బంది మహిళలు పాల్గొన్నారు.

## కమిషనరేట్‌లో పోలీస్ డ్యూటీ మీట్





వరంగల్ , జూన్ 23 (పోలీస్ నిఘా) : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సోమవారం ప్రారంభమైన పోలీస్ డ్యూటీ మీట్ రెండవ రోజు కూడా ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. మూడు రోజుల పాటు జరగనున్నాయి. సోమవారం అదనపు డీసీపీ బాలస్వామి ప్రారంభించగా పోలీస్ డ్యూటీ మీట్ పోటీల్లో అధికారులు, సిబ్బంది కంప్యూటర్ పరిజ్ఞానం, ఫోరెన్సిక్ సైన్స్, ఫింగర్ ప్రింట్స్ లిఫ్టింగ్ అండ్ ప్యాకింగ్, బాంబ్ డిస్పోజల్, డాగ్ స్క్వాడ్, ప్రొఫెషనల్ ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ విభాగాల్లో నైపుణ్యాన్ని ప్రదర్శించనున్నారు.




# రైతులు విత్తన మేళాలను సద్వినియోగం చేసుకోవాలి

### జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పిలుపు



మెదక్, జూన్ 23 (పోలీస్ నిఘా) : రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం జూన్ 23 నుంచి 30వ తేదీ వరకు ప్రతి మండలంలో నిర్వహి స్తున్న విత్తన మేళాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పిలు పునిచ్చారు. మంగళవారం జిల్లాలోని మనోహరాబాద్ మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన విత్తన మేళాను కలెక్టర్ ప్రారంభించి, విత్తన మేళాలో గల ఉత్పత్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులకు అవసరమైన అన్ని రకాల ధ్రువీకరించిన నాణ్యమైన విత్తనాలను ఒకే వేదికపై సరసమైన ధరలకు అందించేందుకు వ్యవసాయ శాఖ విస్తృత ఏర్పాట్లు చేసిందన్నారు.రైతు వేదికలలో నిర్వహిస్తున్న ఈ విత్తన మేళాల్లో సన్న వడ్లు, పప్పు దినుసులు, నూనె గింజలు, కూరగాయల విత్తనాలతో పాటు నానో యూరియా, నానో డిఏపి వంటి ఆధునిక వ్యవసాయ ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. రైతులందరూ ఈ అవకాశాన్ని వినియో గించుకుని నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయాలని సూచించారు.వర్షాభావ పరిస్థితులు నెలకొన్న సమ యంలో యూరియాను అధిక మోతాదులో వినియో గించడం వల్ల భూసారం దెబ్బతింటుందని, శాస్త్రీయ పద్ధతుల్లో ఎరువులను వినియోగించాలని రైతులకు సూచించారు. ప్రతి గ్రామంలో రైతులకు అవసరమైన మేరకు యూరియా అందుబాటులో ఉండేలా తగిన నిల్వలు ఉంచాలని అధికారులను ఆదేశించారు.ప్రస్తుత సీజన్‌లో జిల్లాలో సుమారు 4.18 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. గత సంవత్సరంతో పోలిస్తే సుమారు 1 లక్ష మెట్రిక్ టన్నుల అధిక ధాన్యం కొనుగోలు జరిగిందని పేర్కొన్నారు. రైతులందరూ తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.వ్యవసాయంలో అధిక దిగు బడులు సాధించడానికి నాణ్యమైన విత్తనం అత్యంత కీలకమని, మంచి పంటకు విత్తనమే పునాది అని పేర్కొన్నారు.రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ అనధికార విక్రయ కేంద్రాల నుంచి విత్తనాలు కొనుగోలు చేయకుండా, ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థలు, ధృవీకరించిన డీలర్ల నుంచి మాత్రమే విత్తనాలు సేకరించాలని సూచించారు. విత్తనాల కొనుగోలు సమయంలో తప్పనిసరిగా బిల్లులు, ధృవీకరణ పత్రాలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఏవైనా సమస్యలు తలెత్తినప్పుడు ఇవి ఉపయోగపడతాయని తెలిపారు. విత్తన మేళాల్లో రైతులకు అందుబాటులో ఉన్న వివిధ రకాల పంట వంగడాలు, వాటి ప్రత్యేకతలు, దిగుబడి సామర్థ్యం, తెగుళ్ల నిరోధకత వంటి అంశాలపై వ్యవసాయ అధికారులు పూర్తి వివరాలు అందించాలని ఆదేశించారు. రైతులు తమ భూమి స్వభావం, నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. వాతావరణ మార్పులు, అస్థిర వర్షపాతం పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తక్కువ కాలంలో దిగుబడి ఇచ్చే, వర్షాభావాన్ని తట్టుకునే వంగడాలపై రైతులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. పంటల వైవిధ్యీ కరణ ద్వారా రైతులు ఆర్థికంగా మరింత స్థిరత్వాన్ని పొందగలరని తెలిపారు. వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం, ఆధునిక సాగు పద్ధతులు, పంటల యాజమాన్యం, ఎరువుల వినియోగం, పురుగు మందుల నిర్వహణ వంటి అంశాలపై శిక్షణా కేంద్రాలుగా తీర్చిదిద్దాలని సూచించారు. రైతుల ప్రయోజనాలే ప్రభుత్వ ప్రాధాన్యత అని, నాణ్యమైన విత్తనాల సరఫరాలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని అన్నారు. ప్రతి రైతు శాస్త్రీయ సాగు విధానాలను అనుసరిస్తూ, వ్యవసాయ శాఖ సూచనల మేరకు పంటల సాగు చేపడితే దిగుబడులు పెరగడంతో పాటు వ్యవసాయ వ్యయాలు తగ్గుతాయని కలెక్టర్ తెలిపారు. నాణ్యమైన విత్తనం, సరైన సాగు పద్ధతులు, సమయానుకూల వ్యవసాయ సలహాలతో రైతులు అధిక దిగుబడులు సాధించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఉద్యానవన పంటల సాగు ద్వారా రైతులకు అధిక ఆదాయం లభిస్తుందని, వాటి ప్రయో జనాలపై గ్రామస్థాయి రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచిం చారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ ఆర్డీవో బావయ్య, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి దేవ్ కుమార్ సర్పంచ్ అనూష భాస్కర్ యాదవ్, ఏఎంసి చైర్ పర్సన్ కీర్తన విటల్ రెడ్డి, ఏడిఏ టెక్నికల్ వినయ్, ఏడిఏ నర్సాపూర్ సంధ్య, మండల వ్యవసాయ అధికారి ఇతర సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# విబి జీ రాం జీ పథకాన్ని రద్దు చేయాలి

### మోడీది పేదల వ్యతిరేక ప్రభుత్వం

### సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్

### వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా






ఖమ్మం , జూన్ 23 (పోలీస్ నిఘా) : వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్ గర్ అండ్ అజీవిక మిషన్ (విబిజి రాంజీ) పథకం గ్రామీణ పేదల ఉపాధిని దెబ్బ తీసేవిధంగా రూపొందించారని ఈ పథకాన్ని వెంటనే రద్దు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ డిమాండ్ చేశారు. గతంలో ఉన్న జాతీయ ఉపాధి హామీ పథకాన్ని సవరించి నూతనంగా పలు నిబంధనలను చేర్చారని ఈ నిబం ధనలతో ఉపాధి కరువవుతుందని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం భారతీయ కేత్ మద్దూర్ యూనియన్ పిలుపు -మేరకు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో విబిజీ రాంజీ పథకాన్ని రద్దు చేయాలని దాని స్థానంలో తిరిగి -మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలని, పని దినా లను పెంచాలని, దినసరి కూలీ రూ.700 గిట్టుబాటు అయ్యేవిధంగా తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. “ఆందోళన కారులను ఉద్దేశించి సురేష్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం పేదల వ్యతిరేక ప్రభు త్వమని పేదలను గుర్తించి సంక్షేమ పథకాలను అమలు చేయకపోగా ఉన్న పథకాలకు తూట్లు పొడుస్తుందన్నారు. దశాబ్దాల కమ్యూనిస్టుల పోరాట ఫలితంగా -వచ్చిన జాతీయ ఉపాధి హామీ పథకానికి పేరు మార్చడంతో పాటు ఉపాధిని దెబ్బ తీయడం, గ్రామీణ పేదలను ఇబ్బంది పెట్టే రీతిగా నిబంధనలు రూపొందించి నూతన పథకాన్ని జూలై ఒకటి నుంచి అమలు చేస్తున్నారని ఆయన తెలిపారు. రెండుసార్లు ఫోటో తీసే పద్దతిని తక్షణం రద్దు చేయా లని, గతంలో ఉన్న జాతీయ ఉపాధి హామీ పథకాన్ని యథాతదంగా అమలు చేయా లన్నారు. గతంలో కేంద్రం 90 శాతం భరిస్తే రాష్ట్రాలు పది శాతం భరించేవని ఇప్పుడు రాష్ట్రాల వాటా 40 శాతానికి పెంచి కేంద్రం భారాన్ని రాష్ట్రాలపై మోపుతుందని ఆరోపించారు. డీజిల్, గ్యాస్, పెట్రో ధరలను పెంచడం ద్వారా నిత్యావసర వస్తువుల -ధరలు పెరిగి సామాన్యులు బతకలేని పరిస్థితి ఏర్పడిం దన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో సైతం వైఫల్యం చెందిందని, కొత్త పింఛన్లు జూన్ రెండు నుంచి ఇస్తామని చెప్పిన ఇంత వరకు ఆ ఊసు లేదని సురేష్ తెలిపారు. నెలకు రూ.2,500 మహిళలకు ఇస్తామని చెప్పి ఇవ్వలేదని పింఛన్ల పెంపు జరగలేదని, రైతు రుణమాఫీ, రైతు భరోసా, పంటల -బీమా సరైన రీతిలో అమలు కాలేదని సురేష్ తెలిపారు. పేదల గుడిసెల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశంగా -వ్యవహరిస్తుందని దశాబ్దాల పాటు ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకుంటున్న వారి పట్ల నిర్దాక్షిణ్యంగా వ్యవహరిస్తూ అమానుష చర్యలకు పాల్పడుతుందని ఆయన తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం జాతీయ ఉపాధి హామీ పరిరక్షణ కోసం -పోరాడతామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తాటి వెంకటేశ్వరరావు, సిద్దినేని కర్ణకుమార్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, -ఆదినారాయణ, మిడికంటి చిన్నవెంకటరెడ్డి, ఏనుగు గాంధీ, యంగళ ఆనందరావు, ప్రజా సంఘాల నాయకులు తాటి నిర్మల, -పగిళ్ల వీరభద్రం, సత్యనారయణ, వీరబాబు, సుధాకర్, గోపాలరావు, మహేష్, ఈశ్వరమ్మ, రంజాన్బీ పాల్గొన్నారు. ధర్నా అనంతరం డిమాండ్స్ కూడిన వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్కు అందజేశారు.

### జర్నలిస్టులకు శిక్షణా తరగతులు

# ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించాలి



ఖమ్మం, జూన్ 23 (పోలీస్ నిఘా) : స్థానిక ఖమ్మం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం లో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ హెచ్ 2843 జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ దివాకర్ టీ.ఎస్ ను కలిసి జర్నలిస్టులకు శిక్షణ తరగతులు ప్రభుత్వం తరఫున ఏర్పాటు చేయాలని, వినతి పత్రం ద్వారా కలెక్టర్ ను కలవడం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ, ప్రస్తుతం జర్నలిజం ప్రాథమిక సూత్రాలు మారుతున్న టెక్నాలజీ మరియు నైతిక విలువలు చుట్టూ ఉంటుంది. కాబట్టి జర్నలిస్టులకు అత్యంత ముఖ్యమైన ఆయుధం నిజ సత్యాలు నిర్ధారణ సోషల్ మీడియా యుగంలో ఒక వార్త నిజమో కాదో తేల్చుకోవడం, ఎంత ముఖ్యమో చెప్పాలి. వార్తలను ఒకే కోణంలో కాకుండా నాణానికి రెండువైపులా ఏ విధంగా చూడగలుగుతామొ బాధ్యతను గుర్తు చేయాలి, అదే సమయంలో మూలాధారాల గోప్య సమాచారం ఇచ్చే నమ్మకమైన వ్యక్తులను కాపాడుకోవాల్సిన బాధ్యత ఉ ంటుంది. ఈ డిజిటల్ యుగంలో కొత్త సవాళ్లు ఇప్పుడు ప్రింట్, టీవీ కంటే డిజిటల్ మీడియా వేగంగా దూసుకుపోతుంది, కాబట్టి కొత్తతరం జర్నలిస్టులు వీటిపై పట్టు సాధించాలి. కావున ప్రభుత్వం తరపున కేవలం ఒక స్మార్ట్ ఫోన్ తోటే నాణ్యమైన వార్తలు ఇంటర్వ్యూలు వీడియోలు ఎలా రికార్డ్ చేయాలో, శిక్షణ తరగతుల ద్వారా నేర్పించాలి. కాబట్టి ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ వాడకం వార్తల విశ్లేషణకు రీసెర్చ్ కు ఏ.ఐ టూల్స్ ని ఎలా వాడాలి, అలాగే ఫేక్ న్యూస్ ను ఎలా గుర్తించాలో, చెప్పే విధంగా డేటా జర్నలిజం పెద్ద డేటా గణాంకాలను చదివి, వాటి వెనక ఉన్న అసలు కథను ప్రజలకు అర్థమయ్యే విధంగా గ్రాఫిక్స్ రూపంలో కూడా ఎలా వివరించాలో, శిక్షణా తరగతులు ద్వారా అవగాహన కల్పించాలని, వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి వేములకొండ రమేష్, ఉపాధ్యక్షులు కందరబోయిన నాగ కృష్ణ ,మామిడాల వీరబాబు, టీబీజేఏ జిల్లా అధ్యక్ష కార్యదర్శి వందనపు సామ్రాట్ గుప్తా,కాసోజు శ్రీధర్, వీడియో గ్రాఫర్ అసోసియేషన్ అధ్యక్షులు అమరబోయిన ఉపేందర్, వీడియో గ్రాఫర్ అసోసియేషన్ జిల్లా సంయుక్త కార్యదర్శి కరుణాకర్ సుదగాని, టిడబ్ల్యూజేఎఫ్ నగర అధ్యక్షులు గంటేల కుమార్, టీబీజేఏ నగర అధ్యక్షులు ఎలుగోటి వెంకట్, సహాయ కార్యదర్శి చిన్నంశెట్టి రాంబాబు, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అంతోటి శ్రీనివాస్, కప్పల మధు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్‌గా ఎనికైనా తోకల శ్రీనివాస్ రెడ్డి



నర్సంపేట, జూన్ 23 (పోలీస్ నిఘా) : నర్సంపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ గా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దుగ్గొండి మండలం చాపల బండ గ్రామానికి చెందిన తోకల శ్రీనివాస్ రెడ్డి గారి నియమి స్తున్నట్టు నర్సంపేట నియోజకవర్గ శాసనస భ్యులు పెద్దలు దొంతి మాధవ రెడ్డి తెలిపారు అనం తరం తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లా డుతూ నాపై నమ్మ కంతో నేను కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలను గుర్తించిన మన ప్రియతమ నాయకులు గౌరవ శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి గారు నాకు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ గా అవకాశం కల్పించ డం సంతోష కరమని అన్నారు వారు నాపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా కాంగ్రెస్ పార్టీ నాయ కులను ఏకతాటిపై నడిపించి కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తానని ధీమా వ్యక్తం చేశారు, నా ఈ ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు..

# మైనర్లకు వాహనం ఇచ్చి చట్టపరమైన చిక్కుల్లో పడోద్దు: సీపీ సన్‌ప్రీత్ సింగ్




వరంగల్ , జూన్ 23 (పోలీస్ నిఘా) : వాహనదారులు మైనర్లకు వాహనం అందజేసి వారి కారణంగా జరిగే రోడ్డు ప్రమాదాలకు వా హన యజమాని చట్టపరమైన చిక్కుల్లో పడోద్దని వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రజలకు సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకై ప్రతి పోలీసు అధికారి నిరంతరం కృషి చేయడంతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం ఇందుకోసం ప్రత్యేక చర్యలు తీసుకోవడం, కార్యక్రమాలను నిర్వహిస్తున్న కొంత మంది వాహనదారుల బాధ్యతరాహిత్య కారణంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతునే వున్నాయి. ప్రధానం ఈ రోడ్డు ప్రమాదాలు అధికంగా మైనర్ వాహనదారుల కారణ ంగా అధికంగా జరుగుతున్నాయి. గత రెండు రోజుల క్రితం పర్వతగిరి పోలీస్ స్టేషన జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వృద్ధులతో పాటు, ఒక మైనర్ బాలుడు మరణించగా, మరో మైనర్ బాలుడు తీవ్ర గాయలతో ప్రస్తుతం చికిత్స పోందుతున్నాడు. ఈ రోడ్డు ప్రమాదానికి ప్రధాన కారణంగా మైనర్ బాలుడు అతి వేగంగా వాహనం నడుపుతూ ఇద్దరు వృద్దులు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని అతి వేగంగా ఢీ కోట్టడం కారణంగానే సంఘటన స్థలంలోనే మైనర్ బాలుడితో పాటు ఏ పాపం ఎగురుగని ఇద్దరు వృద్దులు మరణించారు. ఈ సంఘటన చాలా బాధకరమైన విషయం. ఈ సంఘటనపై ప్రతి ఒక్కరు ఆలోచించాల్సిన విషయమని పోలీస్ కమిషనర్ తెలిపారు. ఇలాంటి రోడ్డు ప్రమాదాలను నివారించాలంటే ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలకు కట్టుబడి వుండాలని, ముఖ్యంగా మైనర్లకు వాహనం అందజేయడం చట్టరీత్యా నేరమని, ఇలా మైనర్లకు వాహనం అందజేయడం ద్వారా మైనర్ల డ్రైవింగ్ కారణంగా జరిగే రోడ్డు ప్రమాదాలకు వాహన యజమాని లేదా మైనర్ తల్లిదండ్రులు బాధ్యులుగా చేసి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో వారిని జైలులు తరలించడం కూడా జరుగుతుందని వరంగల్ పోలీస్ కమిషనర్ వాహనదారులను హెచ్చరించారు.

పోలీస్ నిఘా

సంపాదకీయం | బుధవారం | 24 జూన్ 2026

## హర్మూజ్‌పై ఆధారపడితే సంక్షోభమే

లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులతో విరుచుకుపడడం, 32మంది మరణించడం తదితర అనూహ్య పరిణామాలతో తాత్కాలిక ఒప్పందానికి తీవ్ర విఘాతం కలిగిందని హర్మూజ్ జలసంధిని మళ్లీ ఇరాన్ మూసివేసిన సంగతి తెలిసిందే. దీనికి ప్రతిగా 60 రోజుల్లో ఇరాన్‌తో తుది ఒప్పందం కుదరకపోతే జలసంధి మార్గంలో టోల్ విధిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించారు. ఆ హెచ్చరికలను బేఖాతరు చేసూ ఇరాన్ 'హర్మూజ్ మీ క్యాసినో కాదు, సముద్రపు దొంగలుండే పెరడు కాదని' గట్టిగా బదులిచ్చింది. అమెరికా ఇరాన్ మధ్య ఈ పరస్పర హెచ్చరికలు, బెదిరింపులు చూస్తుంటే హర్మూజ్ జలసంధి దిగ్బంధనం ఇప్పట్లో ముగిసే పరిస్థితి కనిపించడం లేదు. మన దేశంతో పాటు హర్మూజ్ జలసంధిపై ఆధారపడే దేశాలన్నిటికీ మళ్లీ సంక్షోభం కొనసాగక తప్పదు. చాలా దేశాలు హర్మూజ్ జలసంధిపై ఆధారపడకుండా ప్రత్యామ్నాయ మార్గాల కోసం అన్వేషిస్తున్నాయి. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ హర్మూజ్ జలసంధిపై ఏమాత్రం ఆధారపడకుండా ఉండేందుకు 'జీరో హర్మూజ్ డిపెండెన్సీ' వ్యూహాన్ని రూపొందించుకుంటోంది. ప్రస్తుత సంక్షోభం నుంచి భారత్ పాఠాలు నేర్చుకోవలసింది చాలా ఉంది. సరఫరా గొలుసులను వైవిధ్యపర్చడం, ప్రత్యామ్నాయ సముద్ర, భూగర్భ రవాణా మార్గాల నిర్మాణానికి భారీగా పెట్టుబడులు పెట్టడం, వ్యూహాత్మక భాగస్వామ్యాలను బలోపేతం చేయడం ప్రాధాన్యాలుగా గుర్తించాలి. హర్మూజ్ జలసంధి అనేది ప్రపంచ ఆర్థిక వ్యవస్థను శాసించే అతిముఖ్యమైన సముద్ర మార్గం. ఇరాన్ దీనిని తన గుప్పెటలో పెట్టుకుంది. జలసంధి మీదుగా నౌకల రాకపోకలు నియంత్రించేందుకు పర్షియన్ గల్ఫ్ స్ట్రయిట్ అథారిటీని ఏర్పాటు చేసింది. ఏ నౌక అయినా ఈ సంస్థ నుంచి అనుమతులు పొందాల్సిందేనని ఆంక్షలు విధించింది. ప్రపంచ చమురు సరఫరాలో దాదాపు 20 శాతం వరకు ముడి చమురు సరఫరాను అడ్డుకోగలమని నిరూపిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా వినియోగించే ముడిచమురు దాదాపు 20శాతం, అలాగే ద్రవీకృత సహజవాయువు (ఎల్‌ఎన్‌జి)లో 20 శాతం ఈ ఇరుకైన హర్మూజ్ జలసంధి ద్వారానే రవాణా అవుతోంది. దీనిపైనే ప్రపంచ ఇంధన భద్రత ఆధారపడి ఉంది. ఈ జలసంధిని మూసివేస్తే అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు ఒక్కసారి ఆకాశానికి అంటుకుంటాయి. ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణం పెరిగిపోతుంది. రవాణా వ్యయం అమాంతంగా పెరగడమే కాదు, నిత్యావసరాల ధరలు అదుపు తప్పుతాయి. ఇంతటి తీవ్ర సమస్యలకు కారణమవుతున్న హర్మూజ్ జలసంధి దిగ్బంధనాన్ని బయటపడాలంటే భారత్ ఎంతవరకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తోందో చెప్పలేం. ఈ నేపథ్యంలో భారత్ దౌర్బల్యాలు చాలా బయటపడుతున్నాయి. ప్రపంచ సముద్ర వాణిజ్యంలో దాదాపు 60 శాతం కంటే ఎక్కువ హిందూ మహాసముద్రం మీదుగానే జరుగుతోంది. అయినా మనదేశం సొంత నౌకల ద్వారా కేవలం 10 శాతం కన్నా తక్కువ సరకును మాత్రమే రవాణా చేయగలుగుతోంది. దీనివల్ల భారతీయ ఎగుమతిదారులు సరకుల రవాణాకు విదేశీ నౌకలపై ఆధారపడవలసి వస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా పనిచేస్తున్న మొత్తం నావికుల్లో దాదాపు 15 శాతం వరకు భారతీయులే ఉన్నారు. అంతర్జాతీయంగా అత్యధిక నావికులను అందిస్తున్న మూడు దేశాల్లో భారత్ ఒకటిగా ఉంటోంది. విదేశీ మారక ద్రవ్య నిల్వలను పెంపొందించడంలో నావికులు (సీఫేరర్స్) ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. సుమారు 6.5 బిలియన్ డాలర్లు (రూ.54,000 కోట్లకు పైగా) విదేశీ మారకద్రవ్యాన్ని వీరు మన దేశానికి తీసుకు వస్తున్నారు. కానీ ఏం లాభం? పశ్చిమాసియా సముద్ర జలాల్లో పెరుగుతున్న భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు, సోమాలియా తరహా సముద్రపు దొంగల దాడులవల్ల వారి ప్రాణాలకు ముప్పు వాటిల్లుతోంది. మనదేశంలో నౌకలు, ఓడరేవులు పరిమితంగానే ఉన్నాయి. భారతీయ పతాకాలతో విదేశీ నౌకలను రవాణా చేయించవలసి వస్తోంది. మన నౌకల్లో దీర్ఘకాలికంగా, భారీగా ఇంధనం లేదా ఎల్‌పిజి రవాణా చేయడానికి, నిల్వచేయడానికి అండర్ గ్రౌండ్ సౌకర్యం తగినంతగా ఉండడం లేదు. ఎప్పటికప్పుడు సమయానికి అనుగుణంగా సరఫరా జరుగుతోంది. ఇలాంటి దౌర్బల్యాలే ఇతర దేశాల నుంచి ఇంధన సరఫరాపై వ్యతిరేక ప్రభావం చూపిస్తున్నాయి. మరో ముఖ్య విషయం ఇరాన్ భారత్ సంయుక్తంగా చేపట్టే చాబహార్ ఓడరేవు నిర్మాణం సందిగ్ధంలో పడడం ప్రస్తుత సంక్షోభ సమయంలో మనకు తీరని నష్టమే. ఈ ఓడరేవు నిర్మాణం మన దేశానికి వాణిజ్యపరంగా, వ్యూహాత్మకంగా ఎంతో కీలక అవకాశం. అమెరికా ఆంక్షలు, అంతర్జాతీయ, భౌగోళిక రాజకీయాల ఒత్తిళ్లు కారణంగా మనదేశం ఈ ప్రాజెక్టును పక్కన పెట్టింది. మధ్య ఆసియా, అఫ్గాన్ దేశాలకు పాకిస్థాన్ మీదుగా వెళ్లే అవసరం లేకుండా సముద్రమార్గం ద్వారా ప్రత్యామ్నాయ వాణిజ్య మార్గాన్ని ఏర్పాటు చేసుకోవడానికి చాబహార్ ఓడరేవు ప్రాజెక్టును భారత్ చేపట్టింది. దీనికి కావలసిన రూ. 400 కోట్ల మేర ఆర్థిక అవసరాలను 2025లో పూర్తి చేసింది. అయితే ఇరాన్‌పై అగ్రరాజ్యం అమెరికా కఠినమైన ఆంక్షలను విధించడం, దౌత్యపరమైన ఒత్తిళ్ల వల్ల ఈ ప్రాజెక్టుపై తీవ్ర ప్రతికూలత ఏర్పడింది. ఈ దౌర్బల్యాలే మనదేశాన్ని వెంటాడుతున్నాయి. హర్మూజ్ జలసంధిపై పూర్తిగా ఆధారపడడాన్ని పూర్తిగా తగ్గించుకోకుంటే మనదేశానికి తీవ్ర ఆర్థిక సంక్షోభం తప్పదు. ఇది కేవలం ఆర్థిక లక్షం మాత్రమే కాదు, జాతీయ భద్రత. ఆర్థిక స్థిరత్వం కోసం ఇది తక్షణ అవసరం.

## బంజారాహిల్స్‌లో మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి హౌస్ అరెస్ట్



హైదరాబాద్, జూన్ 23 (పోలీస్ నిఘా) : యూరియా యాప్ రద్దు చేయాలన్న డిమాండ్‌తో కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డిలో భారత రాష్ట్ర సమితి.. రైతు ధర్నాకు పిలుపునిచ్చింది. ధర్నాకు హైదరాబాద్ నుంచి బయలుదేరే క్రమంలో మాజీమంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డిని బంజారాహిల్స్‌లోని నివాసంలో హౌస్ అరెస్ట్ చేశారు. ప్రశాంత్‌రెడ్డిని గృహనిర్బంధం చేయడాన్ని కేటీఆర్, హరీశ్‌రావు ఖండించారు. ప్రశాంత్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి సంఘీభావం తెలిపారు. రైతుల తరఫున ప్రశ్నించే నాయకులను అణచివేయాలని ప్రభుత్వం ప్రయత్నించడం దుర్మార్గమని మండిపడ్డారు. యూరియా కొరతతో రాష్ట్ర వ్యాప్తంగా రైతులు ఇబ్బందిపడుతున్నారని, యూరియా పంపిణీలో అమలుచేస్తున్న యాప్ విధానం రైతులకు ఇబ్బందికరంగా మారిందన్నారు. రైతుల సమస్యలను లేవనెత్తిన వారిపై పోలీసులను ప్రయోగించడం దారుణమని ఆక్షేపించారు.

# తెలంగాణలో తొలి రోప్‌వే..



తెలంగాణ పర్యాటక రంగంలో మరో కీలక మైలురాయికి తెరలేవబోతోంది. రాష్ట్రం లోనే తొలి సారిగా రోప్‌వే టూరిజం అందుబాటులోకి రానుంది. చరిత్ర, సాహసం, ప్రకృతి అందాలకు నిలయమైన భువనగిరి కోటపై రోప్‌వే ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. చారిత్రాత్మక భువనగిరి కోటను అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అడుగులు వేస్తోంది. పర్యాటకులకు కొత్త అనుభూతిని పంచేలా భువనగిరి కోటపై రోప్‌వే టూరిజంను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు పర్యాటకశాఖ కసరత్తు చేస్తోంది. రాష్ట్రాన్ని దేశ, విదేశీ పర్యాటకుల డెస్టినేషన్ సెంటర్ గా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో రేవంత్ సర్కార్ ప్రణాళికలను రూపొందిస్తోంది. ఇప్పటికే ఉన్న పర్యాటక ప్రాంతాలను ప్రపంచ స్థాయి సౌకర్యాలతో అభివృద్ధి చేయడంతో పాటు కొత్త ఆకర్షణలను అందుబాటులోకి తీసుకురావడంపై ఫోకస్ పెట్టింది. దాదాపు వెయ్యేళ్ల చరిత్ర కలిగిన భువనగిరి కోట తెలంగాణ వారసత్వ సంపదలో ఒకటి. భువనగిరి ఖిల్లా సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో సముద్ర మట్టానికి 610 మీటర్ల (సుమారు 3000 అడుగులం) ఎత్తులో ఉన్న ఏకశిలా పర్వతం. 10 నుంచి 11 శతాబ్దంలో పశ్చిమ చాళుక్య రాజు త్రిభువనమల్ల విక్రమాదిర్చుదు ఈ ఖిల్లాపైన దుర్భేద్యమైన కోట గోడను నిర్మించాలని ప్రసిద్ధి. పై భాగం నుంచి అండా కారంలో కనిపించడం ఖిల్లా ప్రత్యేకత.

**స్వదేశ్ దర్శన్ కింద రూ.56.81 కోట్లతో భారీ ప్రాజెక్టు**

కేంద్రం ప్రభుత్వం దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మక పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు ప్రవేశపెట్టిన 'స్వదేశీ దర్శన్ స్కీమ్ 2.0' కింద తెలంగాణలోని భువనగిరి కోటను ఎంపిక చేసింది. ఈ పథకం ద్వారా "భువనగిరి ఫోర్ట్ ఎక్స్‌పీరియన్షియల్ జోన్" ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం రూ.56.81 కోట్ల భారీ నిధులను మంజూరు చేసింది. భువనగిరి ఖిల్లా పక్కనే ఉన్న హైదరాబాద్-వరంగల్ 165వ నేషనల్ హైవే నుంచి కోట వద్దకు దాదాపు కిలో మీటరు దూరం వరకు రోప్‌వే ఏర్పాటు చేయనున్నారు. ఇది అందుబాటులోకి వస్తే.. రాష్ట్రంలో తొలి రోప్‌వేగా ఇది గుర్తింపు సాధించనుంది. ట్రెక్కింగ్ ప్రాధాన్యమున్న ప్రాంతాల్లో భువనగిరి కోట ఒకటి కాగా.. ప్రస్తుతం కోటపైకి చేరడానికి దాదాపు గంట సమయం పడుతోంది. చాలా మంది టూరిస్టులు ఈ కోటను సందర్శిస్తుంటారు. ఈ నేపథ్యంలో టూరిస్టులకు కొత్త అనుభూతిని ఇచ్చేందుకు రోప్ వే నిర్మాణ పనుల కొనసాగుతున్నాయి. ఇందుకోసం రెండు దఫాలుగా సుమారు ఐదెకరాల ప్రైవేటు భూములను సేకరించి నిర్వాసితులకు సుమారురూ. 4 కోట్ల పరిహారం అందజేశారు. ఈ మేరకు బేస్ క్యాంప్, రోప్వే పిల్లర్ల పనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుత మెట్ల మార్గంలో అవసరమైన చోట నూతన మెట్లను చెక్కుతున్నారు. అన్ని ద్వారాలకు, ఇతర కట్టడాలకు మరమ్మతులు చేయనున్నారు. ఈ ఆధునికీకరణ పనులను డంగు సున్నంతో చేపట్టడం విశేషం. ఖిల్లాపై బేస్ క్యాంపు వద్ద రెస్టారెంట్లు, గ్రీనరీ సౌకర్యాలను కల్పించనున్నారు. నల్లగొండ రోడ్డులో ఉన్న ఖిల్లా ప్రధాన మార్గాన్ని ఆధునికరించనున్నారు. రూ. 30కోట్ల వ్యయంతో ఖిల్లా పై స్విమ్మింగ్ పూల్, వివాహాలకు అనువుగా డెస్టినేషన్ వెడ్డింగ్ కోసం నిర్మాణాలు చేపడుతున్నారు.

**గంటకు ఖిల్లాపైకి 300 మంది పర్యాటకులు!**

భువనగిరి ఖిల్లా వద్ద జరుగుతున్న రోప్ వే పనుల పురోగతిని పర్యవేక్షించేందుకు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కోటపై నిర్మిస్తున్న రోప్‌వే, హోటల్, పార్కింగ్ వసతులు, విశ్రాంతి గదులు, పిల్లల ఆట స్థలం, కోట పునరుద్ధరణ పనులు, కేఫెటేరియా, ఇంటర్‌ప్రిటేషన్ సెంటర్, పర్యాటకులకు అవసరమైన ఇతర వసతుల పురోగతిని అధికారులతో కలిసి సోమవారం సమీక్షించారు. ఖిల్లా వద్ద సాగుతున్న పనులన్నింటినీ రానున్న అక్టోబర్ 2వ తేదీ, గాంధీ జయంతి నాటికి పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టులను నిరంతరం పర్యవేక్షిం చడంతో పాటు, అవసరమైతే రాత్రింబగళ్లు షిఫ్టుల వారీగా పనులు జరిగేలా చూడాలని స్పష్టం చేశారు. భువనగిరి కోట చారిత్రక వైభవాన్ని ఏమాత్రం దెబ్బతీయకుండా, దానికి ఆధునికంగా నిర్మాణాలు ఉండాలని అన్నారు. ఈ రోప్ వే పూర్తి అయితే ఖిల్లా పైకి గంటకు 300 మంది పర్యాటకులు వెళ్లే అవకాశం ఉంటుంది. ఈ రోప్ వే సెకండ్ కు 6 మీటర్ల గరిష్ట వేగంతో సాగుతుంది.


**టూరిజం సర్క్యూట్..**

యాదగిరిగుట్ట, భువనగిరి కోట, కొలనుపాకలను కలుపుతూ ఒక సమగ్ర ఆధ్యాత్మిక, వారసత్వ టూరిజం సర్క్యూట్‌ను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలను రూపొందిస్తోంది. ఈ టూరిజం సర్క్యూట్ ను రూపొందించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

ఇది అమలైతే దేశీయ, విదేశీ పర్యాటకులు ఒకే ప్రాంతంలో ఆధ్యాత్మిక, చారిత్రక, సాంస్కృతిక అనుభూతులను పొందే అవకాశం ఉంటుంది. యాదాద్రి లక్ష్మి నరసింహ స్వామి క్షేత్రం, నాగార్జునసాగర్ బుద్ధవనం, అనంతగిరి కొండలను ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులు కల్పనకు చేపట్టే చర్యలకు సంబంధించిన డిటైల్ ప్రాజెక్టు రిపోర్టును అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఈ నివేదికను కేంద్ర ప్రభుత్వం పరిశీలించి నిధులను మంజూరు చేయనుంది.

# 4500 ఏళ్లనాటి వ్యవసాయం

## ఆధునిక ఫార్మింగ్‌కు సవాల్ చేస్తున్న అమెజాన్ రైతులు



ప్రపంచవ్యాప్తంగా రసాయన ఎరువులు, పురుగుల మందుల వాడకంతో పర్యావరణం కలుషితమవుతున్న వేళ, అమెజాన్ అడవుల్లోని స్థానిక తెగలు అందిస్తున్న ఒక సాంప్రదాయ సాగు పద్ధతి ఇప్పుడు అంతర్జాతీయ సమాజం దృష్టిని ఆకర్షిస్తోంది. ఎటువంటి కెమికల్స్ వాడకుండా, ఐదేళ్ల సాగు తర్వాత తిరిగి ఆ భూమిని అడవికే అప్పగించే 'చాగ్రా' వ్యవసాయ విధానం.. ఆధునిక పారిశ్రామిక వ్యవసాయానికి సరికొత్త పాఠాలు నేర్పుతోంది. 4,500 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన ఈ పర్యావరణ అనుకూల పద్ధతి ప్రస్తుతం గ్లోబల్ వార్మింగ్, అంతర్జాతీయ మైనింగ్ మాఫియా, ప్రాంతీయ రాజకీయాల నడుమ మనుగడ కోసం పోరాడుతోంది. తమ పద్ధతులను కాపాడుకునేందుకు ఎంతకైనా తెగిస్తామని స్థానిక గిరిజనులు చెబుతున్నారు. అడవితల్లిని బతికించుకుంటేనే ప్రపంచం బాగుంటుందని చెబుతున్నారు.

**పర్యావరణ సమతుల్యత ... గణాంకాలు**

కొలంబియా, ఈక్వెడార్ సరిహద్దుల్లోని అమెజాన్ అటవీ ప్రాంతంలో వ్యాపించి ఉన్న సుమారు 30 స్వదేశీ తెగలకు చెందిన 240కి పైగా కుటుంబాలు ఈ చాగ్రా విధానంపైనే ఆధారపడి జీవిస్తున్నాయి. సాధారణంగా ఇక్కడ ఒక్కో సాగుభూమి వైశాల్యం 2 హెక్టార్లు మించదు. శాస్త్రవేత్తల పరిశోధనల ప్రకారం, ఈ చాగ్రా తోటలలో కేవలం వాణిజ్య పంటలే కాకుండా దాదాపు 104 విభిన్న వృక్ష జాతులు సహజీవనం చేస్తున్నాయి. కేవలం ప్రధాన ఆహారమైన 'కసవా'లోనే 67 రకాలు ఇక్కడ పండిస్తారు. ఈ పద్ధతి ద్వారా సాధారణ ఏకపంట సాగుతో పోలిస్తే అత్యధికంగా కార్బన్‌ను భూమిలోనే నిక్షిప్తం చేయవచ్చు. ఈక్వెడార్‌లోని 'నాపో' ప్రాంతంలో దాదాపు 24,000 హెక్టార్లలో విస్తరించిన ఈ తరహా చాగ్రా తోటల ద్వారా స్థానిక రైతులకు 40% నుండి 60% వరకు ఆదాయం లభిస్తోంది. అక్కడి 'కల్లారి' కోఆపరేటివ్ సంస్థ అంతర్జాతీయంగా ఆర్గానిక్ కోకోను విక్రయిస్తూ ఏడాదికి 2 మిలియన్ డాలర్లు అంటే మన కరెన్సీలో సుమారు రూ. 16 కోట్ల టర్నోవర్ సాధిస్తోంది.

**అంతర్జాతీయ రాజకీయాలు ... ఎదురవుతున్న సవాళ్లు**

ఐక్యరాజ్యసమితి సైతం దీనిని ప్రపంచ వారసత్వ వ్యవసాయ వ్యవస్థగా గుర్తించినప్పటికీ, గ్లోబల్ మార్కెట్ శక్తులు, స్థానిక అక్రమ మైనింగ్ వల్ల ఈ వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో పడింది. ముఖ్యంగా అమెజాన్ అడవుల్లో జరుగుతున్న బంగారం తవ్వకాలు, దానివల్ల పెరుగుతున్న మెర్క్యూరీ కాలుష్యంపై 2025లో కొలంబియా సుప్రీం కోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. మరోవైపు, అంతర్జాతీయ కార్బన్ క్రెడిట్ కంపెనీలు స్థానిక పరిస్థితులను అవగాహన చేసుకోకుండా, ఈ చాగ్రా సాగు ప్రాంతాలను "అడవుల నరికివేత" గా తప్పుగా వర్గీకరించడం అంతర్జాతీయ కార్పొరేట్ రాజకీయాలకు అద్దం పడుతోంది. దీనిపై 2024లో కోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పు స్థానిక తెగల హక్కులను కాపాడింది. గ్లోబల్ సప్లై చైన్‌లపై ఆధారపడి ఆహార భద్రతను ప్రమాదంలో పడేసే కంటే, స్థానిక పర్యావరణాన్ని కాపాడుకుంటూ ఆహారాన్ని ఎలా ఉత్పత్తి చేయాలో చాగ్రా విధానం నిరూపిస్తోంది. ప్రపంచ దేశాలు కార్పొరేట్ లాభాల కోసం అడవులను నరికే గ్లోబల్ ట్రెండ్‌ను పక్కనబెట్టి, ఈ 4500 ఏళ్ల నాటి సుస్థిర నమూనా నుండి పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. చాగ్రా వంటి వ్యవసాయ విధానాలను మనదేశంలో కూడా అమలు చేస్తే పర్యావరణంతో పాటు పోషకాలు కలిగిన ఆహారం ప్రజలకు అందుతుంది. పోషకాహార లోపంతో బాధపడే పిల్లలకు ఇది ఎంతో ఉపయోగం అవుతుంది.



# శాంతి ఒప్పందాలు జరిగినా ఆగని క్షిపణుల వర్షం

## అసలు బెంజమిన్ నెతన్యాహు మైండ్ గేమ్ ఏంటి?




పశ్చిమ ఆసియాలో శాంతి స్థాపన కోసం అమెరికా, ఇరాన్ దేశాల మధ్య 40 రోజుల సుదీర్ఘ చర్చల అనంతరం ఒక కీలక శాంతి ఒప్పందం కుదిరింది. అయితే ఈ పీస్ డీల్ జరిగిన కొద్ది గంటల్లోనే ఇజ్రాయెల్ సైన్యం లెబనాన్పై విరుచుకుపడింది. ఇజ్రాయెల్ జాతీయ రక్షణ మంత్రి ఇతమార్ బెన్ గ్వీర్ మాట్లాడుతూ.. "ట్రంప్ అంగీకరించినా, అంగీక రించక పోయినా తాము దక్షిణ లెబనాన్పై నియంత్రణను వదులుకోబోమని, తమ దేశ రక్షణ కోసం లెబనాన్‌ను పూర్తిగా తగలబెట్టడానికైనా సిద్ధమే" అని సంచలన ప్రకటన చేశారు. ఈ వ్యాఖ్యలపై ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ తీవ్రంగా స్పందిస్తూ, ఇజ్రాయెల్ పాలకులు మానవాళికే ముప్పుగా మారారని మండిపడ్డారు.

**అసలు ఏంటి ఈ గ్రేటర్ ఇజ్రాయెల్ మిషన్?**

అంతర్జాతీయ చట్టాలను, మిత్రదేశాల హెచ్చరికలను పక్కనబెట్టి నెతన్యాహు ఇంతలా తెగబడటం వెనుక గ్రేటర్ ఇజ్రాయెల్ లేదా ప్రామిస్డ్ ల్యాండ్ అనే ఒక పెద్ద వ్యూహం ఉందని రక్షణ రంగ నిపుణులు చెబుతున్నారు. గత ఏడాది సెప్టెంబర్ (2025)లోనే వెస్ట్ బ్యాంక్ ప్రాంతంలో దాదాపు 1 బిలియన్ డాలర్ల వ్యయంతో భారీ వసతుల ప్రాజెక్టును ఇజ్రాయెల్ ఆమోదించింది. "భవిష్యత్తులో స్వతంత్ర ఫిలిస్తీన్ దేశమనేదే ఉండదు, ఈ భూమి పూర్తిగా మాదే" అని నెతన్యాహు బహిరంగంగానే ప్రకటించారు. ఈ అజెండా ప్రకారమే ఇజ్రాయెల్ తన సరిహద్దులను విస్తరించే పనిలో పడింది.

**నెతన్యాహు టార్గెట్ లోని అరబ్ దేశాల జాబితా**

గ్రేటర్ ఇజ్రాయెల్ ఊహాత్మక మ్యాప్ ప్రకారం.. ప్రస్తుత ఫిలిస్తీన్ (గాజా, వెస్ట్ బ్యాంక్) ప్రాంతాలను పూర్తిగా తుడిచిపెట్టి ఇజ్రాయెల్‌లో విలీనం చేస్తారు. దీనితో పాటు పొరుగున ఉన్న జోర్డాన్, లెబనాన్ దేశాలతో పాటు సిరియాలోని మెజారిటీ ప్రాంతాలను (ముఖ్యంగా గోలన్ హైట్స్) ఆధీనంలోకి తెచ్చుకోవడం వీరి లక్ష్యం. అంతేకాకుండా ఇరాక్ లోని కొన్ని భాగాలు, ఈజిప్ట్ లోని సినాయ్ ద్వీపకల్పం, సౌదీ అరేబియాకు చెందిన వాయువ్య భూభాగాలను కూడా ఈ సామ్రాజ్యంలో కలపడం నెతన్యాహు అంతర్గత వ్యూహంగా ప్రచారం జరుగుతోంది.

**ఎక్సిస్ ఆఫ్ రెసిస్టెన్స్ పై ఇజ్రాయెల్ పంజా**

ఈ గ్రేటర్ ఇజ్రాయెల్ కల నెరవేరాలంటే తమకు ప్రధాన శత్రువుగా ఉన్న ఇరాన్ మద్దతు గల ఎక్సిస్ ఆఫ్ రెసిస్టెన్స్ కూటమిని, ముఖ్యంగా లెబనాన్కు చెందిన హిజ్బుల్లాను పూర్తిగా నిర్వీర్యం చేయాలని నెతన్యాహు భావిస్తున్నారు. హిజ్బుల్లా బలంగా ఉన్నంతవరకు ఇజ్రాయెల్ తన ఉత్తర సరిహద్దులను విస్తరించలేదు. అందుకే శాంతి ఒప్పందాల పేరుతో ఇరాన్‌ను కాసేపు శాంతింపజేసి, అదే సమయంలో లెబనాన్పై ముప్పేట దాడులు చేయడం ఇజ్రాయెల్ వ్యూహాత్మక ఎత్తుగడ. నెతన్యాహు ప్రస్తుతం అంతర్జాతీయ న్యాయస్థానాల తీర్పులను గానీ, ప్రపంచ దేశాల విమర్శలను గానీ అస్సలు కేర్ చేయడం లేదు. చరిత్రలో ఒక అజేయమైన నాయకుడిగా నిలిచిపోవాలనే పట్టుదలతోనే ఆయన ఈ యుద్ధాన్ని నిరంతరాయంగా కొనసాగిస్తున్నారు.

## హైదరాబాద్‌లో భారీ చోరీ.. ఎటిఎంలో నింపాల్సిన డబ్బు ఎత్తుకెళ్లిన దుండగులు




హైదరాబాద్, జూన్ 23 (పోలీస్ నిఘా) : నగరంలోని ఐఎస్ సదన్‌లో భారీ చోరీ జరిగింది. ఏటీఎంలో నింపాల్సిన డబ్బును దుండగులు ఎత్తుకెళ్లారు. ఓ ఏటీఎంలో డబ్బు పెట్టేందుకు సిబ్బంది వ్యాన్‌లో అక్కడికి వచ్చారు. సిబ్బంది ఏటీఎంలోకి వెళ్లగానే ఇద్దరు దుండగులు.. వ్యాన్‌లో ఉన్న రూ.17లక్షల నగదు ఉన్న ట్రంకు పెట్టెను బైక్‌పై పెట్టుకుని పరారయ్యారు. ఘటన జరిగిన తర్వాత ఏటీఎం క్యాష్ వ్యాన్ డ్రైవర్ కూడా కనిపించకుండా పోయాడు. దీంతో ఈ ఘటనపై పోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మరొకరితో కలిసి వ్యాన్ డ్రైవరే దోపిడీకి పాల్పడి ఉంటాడని భావిస్తున్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించాలి

**విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలి**

**జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు**





ములుగు, జూన్ 23 (పోలీస్ నిఘా) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని,విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అన్నారు. మంగళవారం వెంకటాపురం మండలంలోని జవహర్‌నగర్ మోడల్ స్కూల్‌ను జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు సందర్శించి పాఠశాల నిర్వహణ, విద్యా బోధన విధానాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు పాఠశాలలోని కెమిస్ట్రీ, బయాలజీ, ఇంగ్లీష్ ల్యాబ్‌లను పరిశీలించిన విద్యార్థులు ప్రయోగాత్మక విద్యపై అవగాహన పెంపొందించుకునేలా ల్యాబ్‌లను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. లైబ్రరీని సందర్శించి,విద్యార్థుల్లో పఠనాసక్తి పెంపొందించేందుకు పుస్తక పఠనాన్ని ప్రోత్సహించాలని తెలిపారు.ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందేలా ప్రణాళికాబద్ధంగా బోధన చేయాలని విద్యార్థుల అభ్యాస సామర్థ్యాన్ని పెంపొందించేలా కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలు ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## ఎక్సైజ్ శాఖలో సూపరింటెండెంట్ ఇంట్లో ఏసీబీ దాడులు



నిజామాబాద్, జూన్ 23 (పోలీస్ నిఘా) : నిజామాబాద్ జిల్లాలో అవినీతి విరోధక శాఖ అధికారుల బృందాల దాడులు కలకలం సృష్టించాయి. నిజామాబాద్ జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ కె. మల్లారెడ్డి ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నట్లు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు వచ్చినట్టు తెలిసింది. దీంతో మంగళవారం ఉదయం నుండి ఏసీబీ డీఎస్పీ శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఉదయం నుండి దాడులు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని సుభాష్ నగర్ ప్రాంతంలో గల ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయం తో పాటు నగరంలోని ప్రగతి నగర్ లో ఈఎస్ నివాసముండే ఆయన ఇంటిపై ఏకధాటిగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ కార్యాలయంలోని కొన్ని డాక్యుమెంట్లను ఏసీబీ బృందం స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. దీంతోపాటు ఈఎస్ ఇంట్లో నుంచి పలు రికార్డులతో పాటు ఇతర విలువైన వస్తువులను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అనంతరం ఈఎస్ మల్లారెడ్డిని ఏసీబీ అధికారులు తమ వెంట తీసుకువెళ్లి విచారణ నిర్వహిస్తున్నారు. అలాగే హైదరాబాద్ నగరంలో ఉన్న ఈఎస్ ఇంటిపై సైతం ఏసీబీ అధికారుల బృందం దాడి చేసి అక్కడ తనిఖీలు నిర్వహిస్తున్నారు.

## మాదాపూర్‌ను ముంచెత్తిన భారీ వర్షం.. నీట మునిగిన కాలనీలు



శేరిలింగంపల్లి, జూన్ 23 (పోలీస్ నిఘా) : మాదాపూర్ సున్నం చెరువు సమీపంలో ఉన్న కాలనీలలో రాత్రి కురిసిన భారీ వర్షానికి భవనం సెల్లార్లలోకి నీరు చేరింది. సెల్లార్ లో ఉన్న కార్లు, బైకులు నీట మునిగాయి. ప్రధానంగా సున్నం చెరువుకు వెళ్లే వరదనీటి కాలువను హైడ్రా అధికారులు మూసివేయడంతో చెరువు సమీపంలో ఉన్న ఇంట్లోకి నీళ్లు చేరుతున్నాయని కాలనీవాసులు వాపోతున్నారు. అదేవిధంగా సెల్లార్ లో ఉన్న షాప్ లలో కూడా ఫ్రిజ్జులు ఎలక్ట్రికల్ వస్తువులు అన్ని నీట మునిగాయి. అర్ధరాత్రి ఒక్కసారిగా భారీ వర్షం కురవడంతో నీరు పోయే మార్గం అన్ని మూసుకుపోవడంతో కాలనీలను ముంచెత్తాయి. సెల్లార్ లోకి నీళ్లు చేరడం వలన ఉదయం వరకు ఇంట్లో ఉన్నవాళ్లు కిందికి రావడానికి ఇబ్బంది పడ్డారు. లింగంపల్లి తారనగర్ లో వర్షం నీరు ఇళ్లల్లోకి చేరి కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

## భూమిని కాపాడుకుందాం.. సేంద్రియ వ్యవసాయం వైపు అడుగులు వేద్దాం

చిన్నకోడూరు, జూన్ 23 (పోలీస్ నిఘా) : రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి భూమిని కాపాడుకోవాలని శాస్త్రవేత్త డాక్టర్ గోపాలరావు రైతులకు పిలుపునిచ్చారు. మంగళవారం మండల పరిధిలోని చౌడారం గ్రామంలో ఎఫ్‌పీఓ, ఇఫ్కో ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఖేత్ బచావో' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రసాయన ఎరువుల వినియోగం అధికమవడంతో భూముల సారవంతత దెబ్బతింటోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు రసాయన ఎరువులను పరిమితంగా వినియోగిస్తూ, సేంద్రియ ఎరువుల వినియోగాన్ని పెంచాలని సూచించారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, సారవంతమైన భూమిని అందించాలంటే ఇప్పటి నుంచే సేంద్రియ వ్యవసాయం వైపు అడుగులు వేయాల్సిన అవసరం ఉందన్నారు. రైతులు శాస్త్రీయ పద్ధతులను అనుసరిస్తూ, తగిన మోతాదులోనే రసాయన ఎరువులను ఉపయోగించాలని, సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని ఆయన సూచించారు.

# ఆధార్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలి

**పిల్లల ఆధార్ నమోదు,బయోమెట్రిక్ అప్‌డేట్లను వేగవంతం చేయాలి**

**జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్**




ములుగు, జూన్ 23 (పోలీస్ నిఘా) : జిల్లాలో ఆధార్ నమోదు,ఆధార్ అప్‌డేషన్,బయోమెట్రిక్ అప్‌డేట్ ప్రక్రియలను వేగవంతం చేసి ప్రతి అర్హుడికి ఆధార్ సేవలు సకాలంలో అందేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్. మహేందర్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి జిల్లా స్థాయి ఆధార్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించి,ఆధార్ సేవల పురోగతి చిన్నారుల ఆధార్ నమోదు,విద్యార్థుల బయోమెట్రిక్ అప్‌డేట్ ఆధార్ వెరిఫికేషన్ పెండింగ్ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 0 నుండి 5సంవత్సరాల పిల్లల ఆధార్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని, ఆసుపత్రుల్లో వ్యాక్సినేషన్ సమయంలోనే ఆధార్ నమోదు జరిగేలా అవగాహన కల్పించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మహిళా శిశు సంక్షేమ శాఖ, ఆరోగ్య శాఖ, పోస్టల్ శాఖల సమన్వయంతో ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలని ఆదేశించారు. 5నుండి 17 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు బయోమెట్రిక్ అప్‌డేట్ ఉచితంగా అందుబాటులో ఉన్నందున ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అప్‌డేట్ ప్రక్రియను పూర్తి చేయాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. 18 సంవత్సరాలు పైబడిన వారి ఆధార్ నమోదు వెరిఫికేషన్ పెండింగ్ కేసులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, జిల్లాలో ఉన్న ఆధార్ నమోదు కేంద్రాలు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలు, విద్యా ప్రవేశ పరీక్షలు ఇతర సేవల సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా ప్రజలు తమ ఆధార్ నమోదు, అప్‌డేట్ ప్రక్రియలను ముందుగానే పూర్తి చేసుకునేలా విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# ప్రైవేట్ స్కూళ్లలో ఫీజులు.. పుస్తకాల దోపిడిని అరికట్టండి

**బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సాయిబాషా**

**జిల్లా విద్యాశాఖ అధికారికి గారికి వినతి పత్రం అందజేత**



సంగారెడ్డి, జూన్ 23 (పోలీస్ నిఘా) : సంగారెడ్డి జిల్లాలో ప్రవేట్ స్కూల్లు ఇష్టారాజ్యంగా ఫీజు, పుస్తకాల దోపిడిపై కఠిన చర్యలు తీసుకొవాలని జిల్లా విద్యా శాఖ అధికారి తరపున సూపర్డెంట్‌కు వినతి పత్రం ఇవ్వడం జరిగినది. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం రాష్ట్ర బీసీ అధ్యక్షులు సాయిబాషా మాట్లాడుతూ ఫీజలు, పుస్తకాల దోపిడి చేస్తున్న ప్రైవేట్ స్కూల్లపై కఠిన చర్యలు తీసుకోవాలని అలాగే శానిటైజేషన్, బిల్డింగ్ సేఫ్టీ, టెట్ అర్హత,ఫైర్ సేఫ్టీ, బస్సుల ఫిట్నెస్, అధిక ఫీజులు, టీసీ విషయంలో వేధింపులు చేస్తున్న ప్రైవేట్ స్కూళ్లను గుర్తించి స్కూలు సీజ్ చేసి యజమాన్యలపైకఠిన చర్యలు తీసుకోవాలి. ప్రైవేట్ స్కూళ్లలో పుస్తకాలు అమ్మడం పూర్తిగా నిషేధించాలి. ఎక్కడైనా పుస్తకాలు అమ్ముతున్నట్లు తెలిస్తే, ఆ స్కూళ్లను తక్షణమే సీజ్ చేయాలి. అధిక ఫీజులు వసూలు చేస్తూ, విద్యార్థుల రక్తం తాగుతున్న ప్రైవేట్ స్కూళ్లను గుర్తించి, వాటిని సీజ్ చేయాలి. సరైన గుర్తింపు అనుమతులు లేని ప్రైవేట్ స్కూళ్లను మూసివేయాలి. శానిటైజర్ మరియు బిల్డింగ్ సేఫ్టీ సర్టిఫికెట్లు లేని స్కూళ్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. టెట్ అర్హత లేని ఉపాధ్యాయులను తొలగించాలి. ఫైర్ సేఫ్టీ ప్రమాణాలు పాటించని స్కూళ్లపై యాక్షన్ తీసుకోవాలి. ఫిట్నెస్ లేని స్కూల్ బస్సుల రిజిస్ట్రేషన్ రద్దు చేయాలి. యజమాన్యం పై కఠిన చర్యలు తీసుకోవాలి. ప్రైవేట్ స్కూల్ నుండి గవర్నమెంట్ స్కూల్ కి వస్తున్న విద్యార్థులను టీసీ విషయంలో వేధిస్తున్న స్కూళ్లను గుర్తించి, యజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలి. రకరకాల ఫీజుల పేరుతో ప్రైవేట్ విద్యాసంస్థలు దోచుకుంటున్నారు స్కూల్లో ఎలాంటివి అమ్మొద్దని గైడ్లెన్స్ ఉన్న అవి పెడచెవిన పెట్టి సొమ్ము చేసుకుంటున్నారు 2005 ఫీజు నియంత్రం చట్టం అమలులో ఉన్న అవన్నీ పట్టించుకోకుండా విద్యార్థుల రక్తం తాగుతున్నారు అలాంటి ప్రైవేట్ విద్యాసంస్థలను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని.. రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ మంత్రిని నియమించి ప్రభుత్వ స్కూల్లో మెరుగైన వసతులు కల్పించాలని ప్రభుత్వం వెంటనే ఫీజు నియంత్రణ చట్టం అమలు తీసుకొచ్చి పేద విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు ఈ సమావేశంలో పాల్గొన్నవారు,బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సాయిబాషా, బీసీ విద్యార్థి సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వంశీ పటేల్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ కొడకంచి అభినవ్,మహేష్ యాదవ్, శ్రీహన్,తదితరులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత: మంత్రి వివేక్ వెంకటస్వామి




చెన్నూర్, జూన్ 23 (పోలీస్ నిఘా) : యువత మాదకద్రవ్యాలకు బానిసలై తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కార్మిక, భూగర్భ గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. మంగళవారం మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో స్థానిక సీఐ బన్సీలాల్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యువత మాదకద్రవ్యాలకు అలవాటు పడి ఎన్నో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఆయన అన్నారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి తమ పిల్లలను చదివిస్తూ ఉన్నత పదవులు పొందాలని ఆశిస్తున్న తరుణంలో, యువత మత్తుకు అలవాటు పడి తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా నియోజకవర్గంలో మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన కోరారు. తల్లిదండ్రులు తమ పిల్లల నడవడిక పై నిఘా పెట్టాలని సూచించారు. అనంతరం నషా ముక్త్ భారత్ అభియాన్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తెలంగాణ ఎంప్లాయిస్ ఎలక్ట్రిసిటీ యూనిట్ 1104 ఆధ్వర్యంలో యాదాద్రి-భువనగిరి ప్రాంతీయ సర్వసభ్య సమావేశం

**కార్మికుల సమస్యలపై చర్చించిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిబాబా**







యాదాద్రి, జూన్ 23 (పోలీస్ నిఘా) : యాదాద్రి-భువనగిరి ప్రాంతీయ సర్వసభ్య సమావేశం సోమవారం యాదగిరిగుట్టలో ప్రాంతీయ అధ్యక్షులు పి. యాదగిరి అధ్యక్షతన ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. సాయిబాబా మాట్లాడుతూ, విద్యుత్ కార్మికుల అనేక సమస్యలపై చర్చించారు. "రాత్రనక, పగలనక కార్మికులు కష్టపడి పనిచేయడం వల్లే నిరంతర విద్యుత్ సరఫరా సాధ్యమవుతోంది" అని ఆయన పేర్కొన్నారు. అలాగే ఎన్నో సంవత్సరాల నుంచి దీర్ఘకాలి ఆర్టిజన్ కార్మికుల సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేస్తారని అన్నారు. సమావేశంలో TGSPDCL కంపెనీ అధ్యక్షులు ఏ. వేణు, కార్యనిర్వాహక అధ్యక్షులు ఎన్. వెంకన్న, అదనపు కార్యదర్శి ఎం. భాస్కర్ రెడ్డి, నల్గొండ జిల్లా అధ్యక్షులు టి. జైపాల్ రెడ్డి, కార్యదర్శి ఎన్. వెంకటయ్య, యాదాద్రి ప్రాంతీయ కార్యదర్శి ఎస్. అమర్నాథ్‌లితో పాటు మాజీ అదనపు కార్యదర్శి లిగోపాల్, సీనియర్ నాయకులు జి. సురేందర్ రెడ్డి అడ్డ గూడూరు 1104 యూనియన్ సెక్షన్ లీడర్ బెజ్జంకి ఉపేంద్ర చారి, లైన్మెన్ నావిలే రామచంద్రయ్య , తుప్పతి బీరప్ప, మారిశెట్టి అశోక్, కార్మిక సోదర, సోదరీమణులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

## భారీ వర్షాలు... పలు గ్రామాలకు రాకపోకలు బంద్



ఏటూరు నాగారం, జూన్ 23 (పోలీస్ నిఘా) : సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మండలంలోని దొడ్ల మల్యాల మధ్య గల మట్టి రోడ్డు.. తూములతో సహా కొట్టుకొని పోయింది. దీంతో మండల కేంద్రంతో పలు గ్రామాలకు సంబంధం తెగిపోయింది. రూ. 60 లక్షలతో చేపట్టిన పనులు ఒక్క వర్షానికే గంగ పాలు అయ్యింది. దీనిపై బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ వర్షకాలం ప్రారంభంకాకముందే కొండాయి, మల్యాల, గోవిందరాజుల కాలనీ, ఐలాపురం గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయని మండిపడ్డారు. దీనిపై మంత్రి సీతక్క సమాధానం చెప్పాలని సీరియస్ అయ్యారు. ఇప్పటికైనా మంత్రి సీతక్క, ప్రభుత్వం స్పందించి, ఆ గ్రామాలకు శాశ్వత రవాణా సౌకర్యం ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు .

## మొక్కలు నాటిన డైరెక్టర్ బలగం వేణు



కీసర, జూన్ 23 (పోలీస్ నిఘా) : గ్రీన్ ఇండియా ఛాలెంజ్ బాగంగా హరితసేన మహిళా విభాగం అధ్యక్షురాలు నాయకపు మాధురి వెంకటేష్ ఆధ్వర్యంలో మంగళవారం కీసర గుట్టలో డైరెక్టర్ బలగం వేణు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డైరెక్టర్ బలగం వేణు మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడడానికి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. తనకు కీసర గుట్టలో మొక్కలు నాటే అవకాశం కల్పించిన మాజీ సర్పంచ్, గ్రీన్ ఇండియా ఛాలెంజ్ మహిళా అధ్యక్షురాలు మాధురికి రుణపడి ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో కీసర గుట్ట యువజన నాయకులు రాగుల శ్రీనివాస్, సంతోష్,రమేష్, దశరథ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## రాజగోపరం నిర్మాణానికి మంత్రి వాకిటి శ్రీహరి భూమి పూజలు

మక్తల్, జూన్ 23 (పోలీస్ నిఘా) : అతి పురాతనమైన శ్రీ పడమట ఆంజనేయ స్వామి దేవాలయం ముందు రాజగోపుర నిర్మాణానికి బుధవారం మంత్రి వాకిటి శ్రీహరి భూమి పూజ చేసినట్లు ఆలయ ధర్మకర్త ప్రాణేశ చారి ఈవోనిత్యానందాచారి తెలిపారు. ఈ రాజగోపురం నిర్మాణానికి మంత్రి వాకిటి శ్రీహరి రూ. 50 లక్షలు మంజూరు చేయించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ డిప్యూటీ ఈఈ ఓం ప్రకాష్ రావు, ఏఈ రణధీర్, ఆలయ ఈవో నిత్యానందాచారి, వంశపారంపర్య ధర్మకర్త ప్రాణేశాచారి, ఎండోమెంట్ ఇన్స్పెక్టర్ కవిత, అర్చకులు అరవిందాచారి, సిబ్బంది శ్రీనివాస్, రజనికాంత్.కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎ. రవికుమార్, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి వాదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

### ధర్మపురిలో కొత్తగా 11రూట్లలో...

# ఆర్టీసీ బస్సు సర్వీసులు



ధర్మపురి, జూన్ 23 (పోలీస్ నిఘా) : తెలంగాణ ఆర్టీసీ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకొని, ఆదాయం పెంచే విధంగా అందరూ సహకరించాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపు నిచ్చారు. శ్రీ లక్ష్మీ నరసింహా స్వామి ఆలయంకు వచ్చే భక్తుల సౌకర్యం కోసం ధర్మపురి నుంచి నిర్మల్, కరీంనగర్ కు రెండు కొత్త ఆర్టీసీ బస్సు సర్వీసులను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మంగళవారం ధర్మపురి బస్టాండ్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ, ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో ధర్మపురి శ్రీలక్ష్మీ నర్సింహా స్వామి దేవాలయానికి నిత్యం వేల మంది భక్తులు వస్తుంటారని అన్నారు. భక్తుల సౌకర్యం కోసం నిర్మల్ నుంచి ధర్మపురి వరకు ఎక్స్ ప్రెస్ బస్సు సౌకర్యం కల్పించడం జరిగిందని తెలిపారు. ఉదయం 7గంటలకు నిర్మల్ నుంచి బయలు దేరిన బస్సు దస్తురాబాద్, కడెం, ఖానాపూర్ మీదుగా ధర్మపురి వస్తుందని మంత్రి వివరించారు. రోజుకు రెండు ట్రిప్పున చొప్పున నిర్మల్ -- ధర్మపురి మధ్య బస్సు నడుస్తుందని మంత్రి అడ్లూరి వివరించారు. ధర్మపురి నుంచి జగిత్యాల మీదుగా ప్రయాణం కష్టంగా ఉన్న నేపథ్యంలో రాయపట్నం, వెల్గటూర్, ధర్మారం, చొప్పదండి మీదుగా కొత్త బస్సు సర్వీస్ ను ప్రారంభించినట్లు మంత్రి వివరించారు. కొత్త సర్వీస్ ఉదయం 7గంటలకు జగిత్యాల నుంచి బయలుదేరి ధర్మపురి, రాయపట్నం, వెల్గటూర్, ధర్మారం మీదుగా కరీంనగర్ చేరకుంటుందని మంత్రి అడ్లూరి తెలిపారు. కొత్త సర్వీస్ విద్యార్థులకు, ఉద్యోగులకు ఉపయోగంగా ఉంటుందని మంత్రి తెలిపారు.

అదే విధంగా కరీంనగర్ నుంచి రాత్రి 9గంటలకు ధర్మపురికి ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు మంత్రి వివరించారు. మంత్రి పొన్న ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ చొరవతో ధర్మపురి నియో జకవర్గంలో కొత్తగా 11 రూట్లలో నూతన బస్సు సర్వీసులు నడిపించడానికి అనుమతి తీసుకున్నామని మంత్రి అడ్లూరి తెలిపారు. జిల్లా గంధ్రాలయ సంస్థ చైర్మన్ సంఘనభట్ల దినేష్ మాట్లాడుతూ దేశంలోనే ఎక్కడ లేని విధంగా తెలంగాణ ఆర్టీసీ సేవలు అందిస్తుందని అన్నారు. ధర్మపురికి వచ్చే భక్తుల కోసం నూతనంగా నడిపిస్తున్న సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని దినేష్ కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల పార్టీ అధ్యక్షుడు చిలుముల లక్ష్మణ్, మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య, నాయకులు వేముల రాజుతో పాటు ధర్మపురి మున్సిపల్ కౌన్సిలర్లు, జగిత్యాల డిపో మేనేజర్ రమేష్, నిర్మల్ డిపో మేనేజర్ పండరి, ఆర్టీసీ జగిత్యాల సీఐ శ్రీనివాస్, ఎఫ్ ఎం నిర్మల్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

### మెదక్ జిల్లా టూరిజం హబ్‌గా తీర్చిదిద్దేలా

# ప్రభుత్వం పటిష్ట ప్రణాళిక

**జిల్లాలో వివిధ పర్యాటక ప్రదేశాల అభివృద్ధికి 2.5 కోట్ల రూపాయలు కేటాయింపు**

**మెదక్ ఖిల్లాకు తక్షణ అవసరాల కోసం 57 లక్షలు మంజూరు**

**టూరిజం శాఖ ముఖ్య కార్యదర్శి, మెదక్ జిల్లా ప్రత్యేక అధికారి వాణి ప్రసాద్**

**మెదక్ జిల్లాలో 99 రోజుల ప్రగతి ప్రణాళిక జయకేతనం...**

**ప్రజా ప్రతినిధులు అధికారుల సమన్వయంతో సక్సెస్ ఫుల్**



మెదక్, జూన్ 23 (పోలీస్ నిఘా) : సోమవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం విజయవంతంలో భాగంగా మెదక్ జిల్లా సమీక్షా సమావేశం మెదక్ ఖిల్లాపై నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ టూరిజం శాఖ ముఖ్య కార్యదర్శి వాణి ప్రసాద్, జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. మెదక్ మెదక్ ఖిల్లా ను సందర్శించిన టూరిజం శాఖ ముఖ్య కార్యదర్శి గారికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా టూరిజం అభివృద్ధి ప్రణాళిక సుదీర్ఘంగా వివరించడం జరిగింది. ఈ సందర్భంగా టూరిజం శాఖ ముఖ్య కార్యదర్శి వాణి ప్రసాద్ మాట్లాడుతూ...99 రోజులు 10 ప్రధాన అంశాల తో ప్రజల భాగస్వామ్యంతో సమగ్ర అభివృద్ధి, గ్రామం నుంచి జిల్లా స్థాయి వరకు విజయవంతమైన కార్యాచరణ పారదర్శక పరిపాలన వేగవంతమైన సేవలు.. సుస్థిర అభివృద్ధికి నూతన దిశగా మెదక్ జిల్లా ముందు వరుసలో ఉంటుందన్నారు. 99 రోజులపాటు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమం మెదక్ జిల్లాలో చారిత్రాత్మకంగా నిలిచిందన్నారు. ప్రజల జీవితాల్లో పెను మార్పులను తీసుకువచ్చిందని కొనియాడారు గ్రామ గ్రామాన వార్డు మెంబర్ నుంచి శాసనసభ్యులు, మంత్రుల వరకు.. మరోపక్క పంచాయతీ కార్యదర్శి నుంచి జిల్లా కలెక్టర్ వరకు.. అందర్నీ భాగస్వామ్యం చేసి ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక. ఇంతకు మునుపెన్నడూ జరగని విధంగా ఈ కార్యక్రమం 99 రోజులపాటు మెదక్ జిల్లాలో నిరాటకం గా జరగడం విశేషంగా . అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ అయ్యేలా చేసిందని వెల్లడించారు.. నియోజకవర్గాల్లో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల ముందు ఉంచింది. మెదక్ జిల్లా ఆదర్శంగా నిలిచిందన్నారు. జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ప్రజల సహకారంతో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక దిగ్విజయంగా పూర్తయింది. అని వెల్లడించారు. మెదక్ జిల్లా పర్యాటక రంగం అభివృద్ధి దిశగా ముందుకు పోతుందని పర్యాటకులు ఆకర్షించే విధంగా ఖిలాను అభివృద్ధి చేసి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వానికి నివేదికలు సమర్పించి తద్వారా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. మెదక్ ఖిల్లా జిల్లాకు గర్వకారణం అని అన్నారు ఖిల్లాలో వారసత్వ,సాంస్కృతిక అభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్నామని, మెదక్ జిల్లాలో పర్యాటక అభివృద్ధికి పెద్ద పీట వేస్తామన్నారు. మెదక్ ఖిల్లా ను మరింత ప్రాచర్యంలోకి తెస్తామన్నారు. మెదక్ ఖిల్లాపై నిరంతరం సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు చేపడతామన్నారు. ఖిల్లా పై బాల బాలికలను ఆకర్షించేలా ప్రత్యేక కార్యక్రమాల రూపొందించాలన్నారు. జిల్లాలో వివిధ పర్యాటక ప్రదేశాల అభివృద్ధికి 2.5 కోట్ల రూపాయలు కేటాయించామని, అవి టెండర్ స్టేజీలో ఉన్నాయన్నారు. మెదక్ ఖిల్లాకు తక్షణ అవసరాల కోసం 57 లక్షలు మంజూరు చేశామన్నారు. జిల్లా కలెక్టర్ ప్రతిమసింగ్ మాట్లాడుతూ మెదక్ జిల్లా పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని ఇందులో భాగంగా టూరిజం ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్ గారు ఖిలాకోటను సందర్శించడం శుభపరిణామం అన్నారు. భవిష్యత్తులో మెదక్ పర్యాటక ప్రాంత సర్వాంగ సుందరంగా తయారు కాబోతుందని వివరించారు. ప్రజా పాలన 99 రోజుల ప్రగతి ప్రణాళిక జిల్లాలో అధికారుల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించామని ఈ సందర్భంగా వెల్లడించారు. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మెదక్ జిల్లాలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆలైవ్ అరైవ్ కార్యక్రమాలు నిర్వహించామని, మూడు కంటి పరీక్షల క్యాంపులు, నాలుగు హెల్మెట్ పంపిణీ కార్యక్రమాలు నిర్వహించి జిల్లాలో పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించమన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ అంబాదాస్ రాజేశ్వర్, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### జాతీయ టీకా దినోత్సవం-2026లో భాగంగా

# పల్స్ పోలియో కార్యక్రమం



**జూన్ 28, 29, 30 తేదీల్లో కార్యక్రమం**

**ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్**

**డా. రేవతి రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం**

శంకర్ పల్లి , జూన్ 23 (పోలీస్ నిఘా) : జాతీయ టీకా దినోత్సవం -2026 లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు శంకర్‌పల్లి మండల పరిధిలో పల్స్ పోలియో కార్యక్రమం ఈ నెల 28, 29, 30 తేదీలలో నిర్వహించనున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమ నిర్వహణపై వైద్య ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కల్పించేందుకు మరియు కార్యాచరణ ప్రణాళిక రూపొందించేందుకు ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ అధ్యక్షతన పీహెచ్ సీ శంకర్‌పల్లి నందు మండల స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ నెల 28/06/2026 (ఆదివారం): మండల పరిధిలో ఏర్పాటు చేసిన 36 పోలియో బూత్‌ల నందు ఉదయం 7:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు "0 నుండి 5 సంవత్సరముల లోపు చిన్నారులకు"పోలియో చుక్కలు వేయడం జరుగుతుంది. 29/06/2026 మరియు 30/06/2026 (సోమ, మంగళవారాలు)మొదటి రోజు బూత్‌ల వద్ద పోలియో చుక్కలు వేయించుకోని చిన్నారులను గుర్తించి, ఆరోగ్య సిబ్బంది మరియు ఆశా కార్యకర్తలు ఇంటింటికి వెళ్ళి పోలియో చుక్కలు వేస్తారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, మండలంలోని తల్లిదండ్రులందరూ తమ 5 సంవత్సరముల లోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి, భారతదేశాన్ని పోలియో రహిత దేశంగా కొనసాగించేందుకు సహకరించాలని కోరారు. పోలియో చుక్కలు పూర్తిగా ఉచితం మరియు సురక్షితమని, ఒక్క చిన్నారి కూడా మిస్ కాకుండా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో మెడికల్ ఆఫీసర్ డా. రేవతి, ఎంపీవో, గిరిరాజు, ఏ పి ఓ నాగభూషణం, ఎం ఎల్ హెచ్ పి డాక్టర్లు, ఆశా కార్యకర్తలు మరియు అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో యువతే కీలక శక్తి





**వ్యసనాలకు కాదు.. లక్ష్య సాధనకు అడుగులు వేయాలి**

**డ్రగ్స్‌కు దూరంగా.. క్రీడలకు చేరువగా ఉండాలి**

**జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు**

మెదక్, జూన్ 23 (పోలీస్ నిఘా) : యువత డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ క్రీడలు, విద్య, ఉన్నత లక్ష్యాల సాధనపై దృష్టి సారించాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ పిలుపునిచ్చారు. జిల్లా ఎస్పీ గారి ఆదేశాల మేరకు మెదక్ జిల్లా పోలీసు శాఖ డ్రగ్స్ నిర్మూలనపై విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మెదక్ టౌన్ సీఐ మహేష్ ఆధ్వర్యంలో యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై చైతన్యం కల్పించే లక్ష్యంతో మంగళవారం వన్-డే క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ పోటీలను జిల్లా ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రపంచ దేశాలతో పోలిస్తే భారతదేశంలో యువ జనాభా అత్యధికంగా ఉందని, దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని అన్నారు. యువత తమ శక్తి, సామర్థ్యాలను సానుకూల దిశలో వినియోగిస్తే దేశాభివృద్ధికి బలమైన శక్తిగా నిలుస్తారని పేర్కొన్నారు. ప్రస్తుత కాలంలో మాదకద్రవ్యాలు యువత జీవితాలను, కుటుంబాలను, సమాజాన్ని తీవ్రంగా దెబ్బతీస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. క్షణిక ఆనందం కోసం డ్రగ్స్ వైపు అడుగులు వేయడం జీవితాన్ని చీకటిలోకి నెట్టేస్తుందని, ఒకసారి వాటికి బానిసైతే ఆరోగ్యం, విద్య, ఉపాధి అవకాశాలు, కుటుంబ బంధాలు, వ్యక్తిత్వం అన్నీ దెబ్బతింటాయని హెచ్చరించారు. "డ్రగ్స్‌కు 'నో' చెప్పండి... క్రీడలకు 'ఎస్' చెప్పండి" అనే సందేశాన్ని ప్రతి యువకుడు జీవితంలో ఆచరించాలని సూచించారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, జట్టు స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని, జీవితంలో విజయాలను అందుకోవడానికి క్రీడలు కూడా ఒక మంచి వేదికగా నిలుస్తాయని తెలిపారు. యువత గొప్ప వ్యక్తుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధన కోసం నిరంతరం కృషి చేయాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు యువతకు మంచి మార్గదర్శకులుగా ఉండాలని, సమాజంలోని ప్రతి ఒక్కరూ డ్రగ్స్ నిర్మూలనలో భాగస్వాములు కావాలని కోరారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు అందించాలని విజ్ఞప్తి చేశారు. మెదక్ జిల్లా పోలీసు శాఖ డ్రగ్స్ నిర్మూలన కోసం అవగాహన కార్యక్రమాలు, క్రీడా పోటీలు, విద్యాసంస్థల్లో చైతన్య సదస్సులు నిరంతరం నిర్వహిస్తోందని, ప్రతి ఒక్కరూ పోలీసు శాఖకు సహకరించి డ్రగ్స్ రహిత మెదక్ జిల్లాను నిర్మించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

అనంతరం జిల్లా ఎస్పీ యువ తతో కలిసి డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, ఐపీఎస్, డీఎస్పీ ప్రసన్న కుమార్, మెదక్ టౌన్ సీఐ మహేష్, పోలీసు అధికారులు, సిబ్బంది, వివిధ కళాశాలల విద్యార్థులు, యువత, క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## భార్య పై అనుమానంతో వ్యక్తి హత్య.. నిందితుడి అరెస్ట్



కొత్తగూడెం, జూన్ 23 (పోలీస్ నిఘా) : అక్రమ సంబంధం అనుమానంతో ఓ వ్యక్తిని హత్య చేసిన ఘటనలో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ ఆదినారాయణ ఈ అంశంపై నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. పోలీసుల వివరాల ప్రకారం అంబేద్కర్ నగర్‌కు చెందిన శివాజీ (శ్రీను కుమారుడు) తన భార్యకు అదే గ్రామానికి చెందిన నాగరాజుతో అక్రమ సంబంధం ఉందని అనుమానించాడు. ఈ నేపథ్యంలో జూన్ 21 రాత్రి సుమారు 10:20 గంటల సమయంలో శివాజీ తన భార్య నాగేశ్వరి, చెల్లెలు పరిశుద్ధ అలియాస్ ప్రమీల ప్రోద్బలంతో నాగరాజును హత్య చేయాలని పథకం రచించినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం నాగరాజు ఇంటికి వెళ్లి, ఇంట్లో నిద్రిస్తున్న నాగరాజు పై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచి హత్య చేసి అక్కడి నుంచి పరారైనట్లు పేర్కొన్నారు. ఈ కేసులో నిందితుడు శివాజీ తన ఇంటికి వచ్చినట్లు సమాచారం అందడంతో ఇన్‌స్పెక్టర్ ఎం. కరుణాకర్ తన సిబ్బందితో కలిసి వెళ్లి అతడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నేరాన్ని అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు.

నిందితుడి వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన కత్తి, ఘటన సమయంలో ధరించిన టీ-షర్టును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అతడిని పోలీస్ స్టేషన్‌కు తరలించి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

## మారుమూల ఏజెన్సీ ప్రాంతంలో విద్యా వెలుగు



చందంపేట, జూన్ 23 (పోలీస్ నిఘా) : చందంపేట మండలంలోని మారుమూల ఏజెన్సీ ప్రాంతమైన చిత్రియాల గ్రామంలో ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి చేపడుతున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. గ్రామ సర్పంచ్ చిరంజీవి చొరవ, ఉపాధ్యాయుల కృషి, గ్రామస్తుల సహకారంతో ప్రభుత్వ పాఠశాలలు కొత్త ఉత్సాహాన్ని సంతరించుకున్నాయి. ఈ విద్యా సంవత్సరంలో గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ఏకంగా 40 మంది కొత్త విద్యార్థులు అడ్మిషన్లు పొందడం విశేషంగా మారింది. మారుమూల ప్రాంతాల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో సర్పంచ్ చిరంజీవి ప్రత్యేక దృష్టి సారించారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలతో కలిసి ప్రభుత్వ పాఠశాలల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. దీంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడులకు పంపేందుకు ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ చిరంజీవి మాట్లాడుతూ గ్రామీణ, ఏజెన్సీ ప్రాంతాల్లోని విద్యార్థులకు విద్యే అభివృద్ధికి ప్రధాన మార్గమని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మంచి బోధన, అవసరమైన సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్ కోసం ప్రభుత్వ విద్యను ప్రోత్సహించాలని కోరారు. పాఠశాల అభివృద్ధికి గ్రామ ప్రజల సహకారం ఎంతో ఉందని, విద్యార్థుల సంఖ్య పెరగడం అందరి సమిష్టి కృషికి నిదర్శనమని తెలిపారు. అనంతరం పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. కొత్తగా చేరిన విద్యార్థులకు కూడా పుస్తకాలు అందించి, క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. పాఠ్యపుస్తకాల పంపిణీతో విద్యార్థుల్లో ఆనందం నెలకొంది. ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసేందుకు గ్రామస్థుల సహకారంతో భవిష్యత్‌లో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని సర్పంచ్ తెలిపారు. మారుమూల ప్రాంతాల్లో విద్యా వెలుగు విస్తరించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిరంజీవి చాట్ల, మండల విద్యాధికారి రామలింగయ్య, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు టాక్రూ, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.





# రాత్రి నిద్ర పట్టకపోతే ఇది సూపర్ ట్రిక్..



ప్రస్తుత కాలంలో ఒత్తిడి, ఆందోళన, నిద్రలేమి వంటి సమస్యలు చాలా మందిని వేధిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో రాత్రి పడుకునే ముందు రకరకాల ఆహారం తింటూ ఉన్నారు. దీంతో ఇవి సరైన పద్ధతిలో డైజెషన్ కాకపోవడంతో నిద్రలేమి సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఇంకొంత మంది కార్యాలయాల్లో పనిచేసేవారు కెఫిన్ కలిగిన ద్రవాలు తాగడంతో ఇది ఆరోగ్యంపై ప్రభావం పడుతోంది. ఫలితంగా సరైన నిద్ర పోవడం లేదు. అయితే ఇలాంటి వారు రాత్రి పడుకునే ముందు ఇది తాగడం వల్ల ఎలాంటి అలజడి లేకుండా హాయిగా నిద్రపట్టే అవకాశాలున్నాయని ఆరోగ్య నిపుణుల అంటున్నారు. అదేంటంటే.. చాలా మంది రాత్రి పడుకునే ముందు పాలు తాగడం అలవాటు. కానీ కేవలం పాలు మాత్రమే కాకుండా ఇందులో చిటికెడు యాలకుల పొడి కలిపి తాగడం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఒక గ్లాసు వేడి పాలలో అర టీస్పూన్ యాలకుల పొడి కలిపి బాగా మరిగించాలి. కావాలంటే కొద్దిగా తేనె లేదా బెల్లం కలిపి తాగవచ్చు. పడుకునే 30 నిమిషాల ముందు ఈ పానీయం తీసుకుంటే మంచి ఫలితాలు పొందవచ్చు. ఈ సహజ పానీయం శరీరాన్ని ప్రశాంతంగా ఉంచడమే కాకుండా హాయిగా నిద్రపట్టేలా చేస్తుంది. పాలలో ట్రిప్టోఫాన్ అనే ముఖ్యమైన అమైనో ఆమ్లం ఉంటుంది. ఇది శరీరంలో సెరొటోనిన్, మెలటోనిన్ హార్మోన్ల ఉత్పత్తిని ప్రోత్సహిస్తుంది. ఈ హార్మోన్లు మెదడును ప్రశాంతంగా ఉంచి ఒత్తిడి, ఆందోళనలను తగ్గిస్తాయి. యాలకుల సువాసన కూడా మనసుకు ప్రశాంతతను అందిస్తుంది. దీంతో రాత్రి వేళల్లో హాయిగా, గాఢంగా నిద్రపోవడానికి సహాయపడుతుంది. సాధారణంగా పాలు తొందరగా జీర్ణం కావు. అయితే ఇందులో యాలకులు వేసి కలిపి తాగడం వల్ల జీర్ణవ్యవస్థకు ఎంతో మేలు చేస్తాయి. కడుపులో గ్యాస్, ఉబ్బరం, అజీర్తి వంటి సమస్యలను తగ్గించడంలో సహాయపడతాయి.

రాత్రి భోజనం తర్వాత యాలకుల పాలు తాగితే ఆహారం సులభంగా జీర్ణమై కడుపులో భారంగా అనిపించకుండా ఉంటుంది. అలాగే జీర్ణక్రియను వేగవంతం చేస్తూ కడుపు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. యాలకుల్లో విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీరంలో ఫ్రీ రాడికల్స్ ప్రభావాన్ని తగ్గించి కణాలను రక్షిస్తాయి. దీంతో రోగనిరోధక శక్తి పెరిగి సీజనల్ వ్యాధులు, చిన్నపాటి ఇన్ఫెక్షన్ల నుంచి శరీరానికి రక్షణ లభిస్తుంది. యాలకులకు సహజసిద్ధమైన యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉన్నాయి. ఇవి శరీరంలోని అంతర్గత వాపులను తగ్గించడంలో సహాయపడతాయి. కీళ్ల నొప్పులు, కండరాల అలసట వంటి సమస్యలు ఉన్నవారికి కూడా యాలకుల పాలు కొంత ఉపశమనాన్ని అందించగలవని నిపుణులు సూచిస్తున్నారు. యాలకుల్లో ఉండే పొటాషియం, ఇతర పోషకాలు రక్తపోటును నియంత్రించడంలో సహాయపడతాయి. రక్త ప్రసరణను మెరుగుపరచడంతో పాటు గుండె ఆరోగ్యాన్ని కాపాడడంలో కూడా ఇవి ఉపయోగపడతాయి. క్రమం తప్పకుండా మితంగా తీసుకుంటే గుండె పనితీరు మెరుగుపడే అవకాశం ఉంటుంది. యాలకులలో సహజ యాంటీబ్యాక్టీరియల్ గుణాలు ఉంటాయి. ఇవి నోటిలోని హానికర బ్యాక్టీరియాను తగ్గించి నోటి దుర్వాసనను నియంత్రిస్తాయి. అందుకే భోజనం తర్వాత యాలకులు నమిలే అలవాటు పూర్వం నుంచే ఉంది.

# రాగి పాత్రలో నీరు తాగుతున్నారా?



ఆధునిక కాలంలో ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగిన తర్వాత చాలా మంది రాగి బాటిళ్లు, పాత్రలలో నీటిని తాగడం ఒక దినచర్యగా మార్చుకున్నారు. అయితే సరైన అవగాహన లేకుండా వీటిని ఉపయోగించడం వల్ల శరీరానికి లాభాల కంటే నష్టాలే ఎక్కువగా జరుగుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. రాగి పాత్రలను తప్పుగా ఉపయోగిస్తే, అవి ప్రయోజనాలకు బదులుగా శరీరానికి హానికరంగా మారతాయి. ముఖ్యంగా రాగి పాత్రలను ఉపయోగించేటప్పుడు ప్రతి ఒక్కరూ నివారించవలసిన ఆ మూడు ముఖ్యమైన తప్పుల గురించి తెలుసుకుందాం.

**1. నీటిని ఎక్కువ కాలం నిల్వ ఉంచడం**

చాలా మంది రాగి పాత్రలలో లేదా బాటిళ్లలో నీటిని ఒక రోజంతా లేదా కొన్ని రోజుల పాటు అలానే నిల్వ ఉంచుతుంటారు. కానీ రాగి పాత్రలలో నీటిని కేవలం పరిమిత కాలం పాటు మాత్రమే నిల్వ ఉంచడం ఉత్తమం. సాధారణంగా 6 నుండి 8 గంటల సమయం దీనికి సరిపోతుందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. అంతకంటే ఎక్కువ కాలం నిల్వ ఉంచిన నీరు అధిక మొత్తంలో రాగిని గ్రహిస్తుంది, ఇది కొంతమంది శరీరానికి అస్సలు మంచిది కాదు. అందువల్ల, రాగి పాత్రలలో ఎల్లప్పుడూ తాజా నీటిని నింపుకుంటూ, దానిని క్రమం తప్పకుండా మార్చుకోవడం చాలా ముఖ్యం.

**2. ఆమ్ల పదార్థాలను నిల్వ చేయడం**


నిమ్మరసం, చింతపండు నీరు, వెనిగర్, విభిన్న రకాల జ్యూస్‌లు లేదా ఇతర ఆమ్ల (సిట్రిక్) గుణాలున్న పదార్థాలను రాగి పాత్రలలో ఎప్పుడూ నిల్వ చేయకూడదు. పుల్లని పదార్థాలు రాగి లోహంతో రసాయనిక చర్య జరిపి, ఆరోగ్యానికి ఎంతో హాని కలిగించే ప్రమాదకరమైన సమ్మేళనాలను ఏర్పరుస్తాయి. ఆయుర్వేదం ప్రకారం ఇది శరీరానికి అత్యంత హానికరం. అందుకే రాగి పాత్రలను కేవలం సాధారణ మంచినీటిని నిల్వ చేయడానికి మాత్రమే ఉపయోగించాలి.

**3. పాత్రను క్రమం తప్పకుండా శుభ్రం చేయకపోవడం**

రాగి పాత్రల ఉపరితలంపై కాలక్రమేణా ఒక ప్రత్యేకమైన పొర ఏర్పడి, వాటి మెరుపును తగ్గిస్తుంది. ఈ పాత్రలను ప్రతిరోజూ క్రమం తప్పకుండా శుభ్రం చేయకపోతే, వాటి పరిశుభ్రత దెబ్బతిని బ్యాక్టీరియా చేరే అవకాశం ఉంది. రాగి పాత్రలను లోపల, బయట శుభ్రం చేయడానికి నిమ్మరసం, ఉప్పు లేదా మార్కెట్లో లభించే రాగి క్లీనర్‌లను ఉపయోగించవచ్చు. ఇలా చేయడం వల్ల పాత్రలు చూడటానికి అందంగా ఉండటమే కాకుండా, వాటిలోని నీరు తాగడానికి కూడా సురక్షితంగా ఉంటుంది.

రోజంతా కేవలం రాగి పాత్రలోని నీటినే తాగే బదులు, దానిని మీ దినచర్యలో ఒక సమతుల పద్ధతిలో మాత్రమే చేర్చుకోవాలి. ఒకవేళ ఎవరికైనా ముందు నుంచే కాలేయం (లివర్), మూత్రపిండాలు (కిడ్నీలు) లేదా ఇతర దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు ఉంటే, వారు సొంతంగా కాకుండా వైద్యుడిని సంప్రదించిన తర్వాత మాత్రమే రాగి పాత్రలోని నీటిని తాగడం మంచిది.

# రాత్రి అన్నానికి బదులు జొన్న రొట్టె తింటున్నారా?



(డయాబెటిస్) ఉన్నవారికి జొన్న రొట్టె ఒక సంజీవని లాంటిది. జొన్నలు తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ కలిగిన ధాన్యం. ఇవి శరీరంలో నెమ్మదిగా జీర్ణమవడం వల్ల గ్లూకోజ్ అనేది ఒకేసారి కాకుండా చాలా నెమ్మదిగా రక్తంలోకి విడుదలవుతుంది. ఫలితంగా రక్తంలో చక్కెర స్థాయిలు అకస్మాత్తుగా పెరగకుండా స్థిరంగా ఉంటాయి.

పోషకాల గని జొన్నలు: జొన్నలు శరీరానికి అవసరమైన అద్భుతమైన పోషకాలను అందిస్తాయి. వీటిలో డైటరీ ఫైబర్ (పీచుపదార్థం), ప్రోటీన్, ఐరన్, మెగ్నీషియం, పొటాషియం వంటి అవశ్యక ఖనిజాలు సమృద్ధిగా ఉంటాయి.

బరువు తగ్గించడంలో అద్భుతంగా పనిచేస్తుంది: జొన్నల్లో ఉండే అధిక ఫైబర్ కంటెంట్ కారణంగా ఇవి తిన్న తర్వాత జీర్ణవ్యవస్థలో చాలా నెమ్మదిగా అరుగుతాయి. దీనివల్ల ఎక్కువ సేపు కడుపు నిండిన భావన కలిగి, రాత్రి పూట అనవసరమైన ఆకలి వేయదు. ఇది అర్ధరాత్రి పూట క్రేవింగ్స్ వల్ల వింత వింత స్నాక్స్ తినే అలవాటును తగ్గిస్తుంది. క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తూ, డిన్నర్‌లో జొన్న రొట్టెలు తింటే బరువు నియంత్రణ చాలా సులభమవుతుంది.

రక్తంలో చక్కెర స్థాయిల నియంత్రణ: మధుమేహం

గుండె ఆరోగ్యం, జీర్ణక్రియ మెరుగుదల: జొన్నల్లో ఉండే పొటాషియం, మెగ్నీషియం వంటి ఖనిజాలు రక్తపోటును అదుపులో ఉంచి, రక్తప్రసరణ సజావుగా సాగేలా చేస్తాయి. ఇది గుండె జబ్బుల ముప్పును తగ్గిస్తుంది. అలాగే, దీనిలోని ఫైబర్ జీర్ణవ్యవస్థ పనితీరును మెరుగుపరిచి, మలబద్ధకం, గ్యాస్ వంటి సమస్యలను నివారిస్తుంది.

ఇలా తింటే మరింత ప్రయోజనం: జొన్న రొట్టెలను ఉత్తగా కాకుండా వాటితో పాటు ఆకుకూరలు, కూరగాయల కూరలు, పప్పు లేదా పెరుగు వంటి పోషకాహారంతో కలిపి తీసుకోవడం వల్ల శరీరానికి అవసరమైన అన్ని పోషకాలు సమతుల్యంగా అందుతాయి. రాత్రి పూట హెవీగా అన్నం తినే అలవాటు ఉన్నవారు దానికి బదులుగా జొన్న రొట్టెలను అలవాటు చేసుకోవడం ఆరోగ్యకరమైన జీవితానికి ఒక అద్భుతమైన అడుగు.

# జైపూర్ పీహెచ్‌సీలో డీఎంహెచ్‌ఓ మెరుపు తనిఖీ

## విధుల్లో నిర్లక్ష్యంపై 'రాథోడ్' సీరియస్!

**టైమ్ మెయింటైన్ చేయకపోతే చర్యలు తప్పవు: సిబ్బందికి డాక్టర్ నరేందర్ రాథోడ్ వార్నింగ్**

**గర్భిణుల రికార్డులు పక్కాగా ఉండాలి.. 'హై-రిస్క్' కేసులపై ప్రత్యేక నిఘా**

**సీజనల్ వ్యాధులపై 'రాపిడ్ రెస్పాన్స్' యాక్షన్ ప్లాన్**



ఉమ్మడి ఆదిలాబాద్, జూన్ 23 (పోలీస్ నిఘా) : ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందడమే లక్ష్యంగా మంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ నరేందర్ రాథోడ్ క్షేత్రస్థాయి తనిఖీలను వేగవంతం చేశారు. ఇందులో భాగంగానే జైపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. కేవలం పైపైన తనిఖీలతో సరిపెట్టకుండా.. రిజిస్టర్లు, మందుల నిల్వలు, సిబ్బంది హాజరును క్షుణ్ణంగా పరిశీలించి ఆసుపత్రి తీరును చక్కదిద్దేలా గట్టి ఆదేశాలు జారీ చేశారు.

**ఫార్మసిస్ట్ విధుంవర అసంతృప్తి.. 'ఈ-ఔషధ' నిర్లక్ష్యంపై ఆగ్రహం**

ఈ తనిఖీల్లో ప్రధానంగా మందుల సరఫరా విభాగంలో లోపాలు డీఎంహెచ్ఓ దృష్టికి వచ్చాయి. ఫార్మసిస్ట్ విధులకు హాజరయ్యే తీరు, స్టాక్ రిజిస్టర్ల నిర్వహణ సరిగ్గా లేకపోవడంపై ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'ఈ-ఔషధ' పోర్టల్‌లో రోజువారీ వివరాలను ఎందుకు అప్‌డేట్ చేయడం లేదని నిలదీశారు. రికార్డుల్లో తేడాలు వస్తే సహించేది లేదని హెచ్చరించారు.

**హై-రిస్క్ గర్భిణులపై 'డైలీ మానిటరింగ్' ఉండాలి**

మాతా శిశు సంరక్షణ విషయంలో డీఎంహెచ్ఓ వైద్యాధికారులకు స్పష్టమైన గైడ్‌లైన్స్ ఇచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రిలోనే కాన్పులు జరిగేలా ప్రసవాల సంఖ్యను పెంచాలి. ఆశా, ఆరోగ్య కార్యకర్తలు గర్భిణుల వివరాలను పోర్టల్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలి. అత్యంత కీలకమైన 'హై-రిస్క్' (అధిక ముప్పు ఉన్న) గర్భవతుల వివరాలను వైద్యాధికారి ప్రతిరోజూ స్వయంగా పర్యవేక్షించి, వారికి ప్రత్యేక వైద్యం అందేలా చూడాలి.

**సీజనల్ అలర్ట్: దోమలపై యుద్ధం.. 'రాపిడ్ కిట్లు' సిద్ధం**

వాతావరణ మార్పులతో కీటక జనిత వ్యాధులు (మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, ఫైలేరియా) ప్రబలే ప్రమాదం ఉన్నందున ముందస్తుగా అలర్ట్ కావాలని సూచించారు.

త్వరితగతిన పరీక్షలు: రోగ నిర్ధారణ ఆలస్యం కాకుండా ఉండేందుకు 'రాపిడ్ డయాగ్నస్టిక్ కిట్లను' నిరంతరం అందుబాటులో ఉంచాలి.

అత్యవసర మందులు: పాము కాటు, తేలు కాటుకు సంబంధించిన యాంటీ వెనమ్ మందులు, కుక్క కాటు నివారణ వ్యాక్సిన్లను కొరత లేకుండా స్టాక్ ఉంచాలి.

ఓఆర్ఎస్ పంపిణీ: ప్రభావిత గ్రామాలు, అన్ని ఆరోగ్య కేంద్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లను సిద్ధంగా ఉంచాలి.

**'మండల కమిటీలు & రాపిడ్ రెస్పాన్స్' టీమ్స్**

వైద్యం కేవలం ఆసుపత్రికే పరిమితం కాకుండా క్షేత్రస్థాయికి వెళ్లాలని డీఎంహెచ్ఓ పిలుపునిచ్చారు. ఇందు కోసం ఎంపీడీఓ, తహశీల్దార్, విద్యాశాఖ అధికారులతో కూడిన 'మండల కమిటీలు' సమన్వయంతో పనిచేయాలని కోరారు. అలాగే సర్పంచులు, సెక్రటరీలు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలను కలుపుకుని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఏదైనా అత్యవసర పరిస్థితి వస్తే తక్షణమే స్పందించేందుకు వీలుగా ప్రతి పీహెచ్‌సీ పరిధిలో 'రాపిడ్ రెస్పాన్స్ టీమ్స్' ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

**తుది హెచ్చరిక:**

"ప్రభుత్వం కేటాయించిన విధులను సిబ్బంది సమర్థవంతంగా నిర్వహించాలి. సమయపాలన పాటించకుండా, బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే కఠినమైన శాఖాపరమైన చర్యలు తప్పవు." -డాక్టర్ నరేందర్ రాథోడ్, డీఎంహెచ్ఓ

# ఓటరు జాబితా సవరణకు జిల్లాలోని ప్రతి ఒక్కరు సహకరించాలి: కలెక్టర్



వరంగల్, జూన్ 23 (పోలీస్ నిఘా) : జిల్లాలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం చేపడుతున్నామని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటరు జాబితాలో నమోదు చేస్తామని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారధ అన్నారు. వరంగల్ కలెక్టరేట్ లో మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ ఓటరు సవరణ జాబితాను చేపడుతున్నట్లు తెలిపారు. ఈనెల 25 నుంచి వచ్చేనెల 24 వరకు బూత్ లెవల్ అధికారులు ఇంటింటి సర్వేను నిర్వహిస్తారని ఆమె తెలిపారు. ఈ సర్వే ద్వారా పోలింగ్ కేంద్రాల హేతుభద్రీకరణ చేయడంతో పాటు 1200లోపు ఓటర్లు పోలింగ్ కేంద్రంలో ఉండే విధంగా చూస్తారని అన్నారు. ఒకే కుటుంబానికి చెందిన వారందరూ ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అర్హులైన వారందరికి ఓటు హక్కు కల్పించడంతో పాటు చనిపోయిన వారి ఓట్లను తొలగిస్తామన్నారు. జిల్లాలో ఇంటింటి సర్వేకు వచ్చే బీఎల్ఓలు, బీఎల్ఏలకు తగిన సహకారం అందించాలని ఆమె కోరారు. ఇంటింటి సర్వేలో సమగ్ర వివరాలు తీసుకొని హేతుభద్రీకరణ చేస్తారని అన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారందరిని ఓటరుగా నమోదు చేస్తారని అన్నారు. పేరు, చిరునామా, ఇతర వివరాల్లో మార్పుల సవరణ లు ఏమైనా ఉంటే నిర్ణీత గడువులోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. బీఎల్ఓలు ఇంటికి వచ్చిన సమయంలో గుర్తింపు కార్డులను చూపించాలన్నారు. ఆధార్ గుర్తింపు కార్డుతో పాటు ప్రభుత్వం గుర్తించిన ఏదైనా ఒక కార్డును చూపించాలన్నారు. బీఎల్ఓలు ఇంటిని సందర్శించిన సమయంలో ఇంటికి తాళం వేసి ఉన్నా, మూసి ఉన్నా ఎన్యుమరేషన్ ఫారాలను వారి ఇంటిలో వేసి కనీసం మూడు సార్లు ఇంటికి వచ్చి పరిశీలించి వెళ్తారని అన్నారు. ఎన్యుమరేషన్ ఫారాలలో వివరాలన్నింటిని అందించాలన్నారు. ఓటరుకు ఇప్పటికే ఓటరు ఐడీ కార్డు ఉన్నట్లయితే దాని వివరాలు, తల్లిదండ్రుల పేర్లు, వివరాలు అందించాలన్నారు. తల్లిదండ్రులు ప్రస్తుతం జీవించి లేకుంటే గతంలో ఎక్కడ ఓటరుగా నమోదై ఉన్నారో ఆ వివరాలను సేకరిస్తారని అన్నారు. ఒక వ్యక్తి ఒకటి కంటే ఎక్కువ ప్రదేశాల్లో ఓటరుగా నమోదైతే అనవసరమైనవి తొలగిస్తారని ఆమె తెలిపారు. వరంగల్ జిల్లా పరిధిలో నర్సంపేట, వరంగల్ తూర్పు, వర్ధన్నపేట నియోజకవర్గాల పరిధిలో ఓటరు జాబితాను చేపడుతున్నట్లు ఆమె తెలిపారు. వరంగల్ జిల్లాలో మొత్తం 795 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని అన్నారు. ఈ కేంద్రాల కోసం బీఎల్ఓలను నియమించడంతో పాటు కొత్తగా రాజకీయ పార్టీల నుంచి బూత్ లెవల్ అసిస్టెంట్లను కూడా నియామకం చేస్తున్నామన్నారు. వరంగల్ జిల్లాలో మొత్తం 780309 మంది ఓటర్లు ఉన్నారని అన్నారు. ఈనెల రోజులకు పైగా నడిచే ఈ ఇంటింటి సర్వేకు ప్రతి ఒక్కరు సహకరించాలని కలెక్టర్ కోరారు. ఇవన్నీ పూర్తయిన తర్వాత ముసాయిదా ఓటరు జాబితాను జూలై 31, 2026 నాడు ముద్రిస్తారని అన్నారు. ఆ తర్వాత ఎవరికైనా ఓటు హక్కు రాకపోతే వారి నుంచి జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు దరఖాస్తులను స్వీకరిస్తారని అన్నారు. జూలై 31 నుంచి సెప్టెంబర్ 28 వరకు వాటిని పరిశీలించి క్లియర్ చేస్తారని అన్నారు. తుది ఓటరు జాబితాను అక్టోబర్ 1న ముద్రిస్తారని అన్నారు. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితాకు అనుగుణంగా ఉంటుందని తెలిపారు. ఈ ఓటరు సవరణ జాబితా కోసం చేపట్టిన సర్ కార్యక్రమానికి ప్రతి ఒక్కరు సహకరించాలని కలెక్టర్ కోరారు. ఎవరైనా ఓటు హక్కు ఇప్పటి వరకు నమోదు చేసుకోకుండా ఉంటే తప్పనిసరిగా చేసుకోవాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీవో సుమ, డీపీఆర్వో ప్రేమలతతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# మహిళల సంక్షేమానికి సాధికారతకు ప్రభుత్వం కృషి

**ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి**



కాప్రా, జూన్ 23 (పోలీస్ నిఘా) : మహిళల సంక్షేమానికి, ఆర్థిక సాధికారతకు తెలంగాణ ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కుషాయిగూడ లక్ష్మీ కన్వెన్షన్ లో ఇందిరా మహిళా శక్తి చీరలు పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతుందన్నారు. అందులో భాగంగానే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, ఆర్టీసీలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో అద్దె బస్సుల సేవలు, తదితర అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు గుర్తు చేశారు. ఇప్పుడు ఇందిరా మహిళా శక్తి పథకం కింద ఆడపడుచులకు చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో మహిళల ఆశీర్వాదం కాంగ్రెస్ ప్రభుత్వంపై పూర్తిస్థాయిలో ఉందని, భవిష్యత్తులో కూడా మహిళలకు పెద్దపీట వేసే పరంపర కొనసాగిస్తామని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్సీ బోగడపు దయానంద్, ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డి , మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్, ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి, తదితర అధికారుల బృందంతో కలిసి పట్నం మహేందర్ రెడ్డి మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు రవీందర్ సాగర్, నిత్యానంద్, శైలజ, జకియా సుల్తానా, అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# చిత్రం

## టాప్ హీరోయిన్‌ల ఫిట్నెస్ సీక్రెట్స్!



బాలీవుడ్ నుంచి టాలీవుడ్ వరకూ సుపరిచితమైన టాప్ -10 అందగత్తెలు తమ సిల్కీ లుక్ -సన్నజాజి తీగ లాంటి శరీరాకృతిని కాపాడుకోవడానికి ఏం చేస్తున్నారో తెలుసా? వెండితెరపై తళతళా మెరిసిపోయే ఈ భామల ఫిట్‌నెస్ రహస్యాలు తెలుసుకోవాలనే ఆసక్తి మీకు ఉందా? ఉంటే పూర్తి వివరాల్లోకి వెళ్లాల్సిందే.

గ్లామర్ రంగంలో రూపాన్ని మెయింటెయిన్ చేయడం చాలా అవసరం. ముఖ్యంగా తల్లి అయ్యాక కూడా తిరిగి హీరోయిన్ గా రాణించాలంటే.. దానికోసం కఠోరమైన శ్రమ, ప్రణాళిక తప్పనిసరి. భారత చలనచిత్ర పరిశ్రమలో రాణిస్తున్న టాప్ 10 హీరోయిన్ ల ఇన్‌స్టాగ్రామ్ ఫీడ్ ను పరిశీలిస్తే.. బాలీవుడ్ - సౌత్ చిత్రసీమలోని టాప్ హీరోయిన్లు కేవలం సాధారణ వర్కౌట్లతో సరిపెట్టడం లేదు. ఈ అందాల భామలు తమ రోజువారీ జీవనశైలిలో జిమ్ - పైలేట్స్ ట్రైనింగ్‌కు అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నారని సర్వేలో తేలింది. బాలీవుడ్ టాప్ హీరోయిన్లలో దీపిక పదుకొనే, ఆలియా భట్, కత్రినా కైఫ్ తమ ఫిట్‌నెస్ క్లాసులలో పైలేట్స్‌ను ఒక ప్రధాన భాగంగా చేసుకున్నారు. పైలేట్స్ వ్యాయామాలు శరీరం ఫ్లెక్సిబిలిటీని (సమతుల్యత) పెంచడమే కాకుండా, శారీరకంగా బలాన్ని పటిష్టం చేయడానికి అద్భుతంగా తోడ్పడతాయి. ముఖ్యంగా ఆలియా భట్ గర్భధారణ తర్వాత కూడా చాలా త్వరగా తన పాత రూపానికి రావడానికి ఈ పైలేట్స్ రొటీన్ ఎంతో సహాయపడింది. ఇక కత్రినా, దీపికా కూడా మామ్స్ అన్న సంగతి తెలిసిందే. ఈ ఇద్దరూ తమ పర్‌ఫెక్ట్ బాడీ షేప్ కోసం వెయిట్ ట్రైనింగ్ - పైలేట్స్‌ను కలిపి బ్యాలెన్స్ చేస్తుంటారు. ఈ ఫిట్‌నెస్ రేసులో సీనియర్ భామలు కరీనా కపూర్ ఖాన్ - మలైకా అరోరా ఎవరికీ తీసిపోరని నిరూపిస్తున్నారు. వయసు పెరుగుతున్నా కొద్దీ మరింత అందంగా, ఫిట్‌గా తయారవ్వడం వీరికే చెల్లింది. మలైకా అరోరా తన ఇన్‌స్టాగ్రామ్‌లో రెగ్యులర్‌గా క్లిష్టమైన పైలేట్స్ , యోగాసనాలను షేర్ చేస్తూ యువతకు స్ఫూర్తినిస్తుంటుంది. అలాగే ఇద్దరు పిల్లల తల్లైన కరీనా కపూర్ కూడా జిమ్‌లో హెవీ వెయిట్ ట్రైనింగ్ .. కఠినమైన కార్డియో వర్కౌట్లను అలవోకగా చేస్తూ తన గ్లామర్‌ను కాపాడుకుంటోంది. సౌత్ స్టార్ సమంత రూత్ ప్రభు ఫిట్‌నెస్ సెషన్స్‌లో పైలేట్స్ చాలా కీలకమైనది. మయోసైటిస్ సహా కొన్నిరకాల శారీరక సవాళ్లను ఎదుర్కొన్నా సామ్ జిమ్‌లో కఠినంగా శ్రమిస్తూ, గ్రేట్ కంబ్యాక్ ఎలా ఉంటుందో చూపించారు. సమంత వెయిట్ లిఫ్టింగ్, క్యాలిస్టెనిక్స్, పైలేట్స్ సెషన్ల వీడియోలు సోషల్ మీడియాలో ఎప్పుడూ ట్రెండింగ్‌లో ఉంటాయి. తనలాగే నేటి తరం యంగ్ హీరోయిన్లలో జాన్వీ కపూర్, ఆలయ ఎఫ్ వంటి వారు కూడా ఈ తరహా కఠినమైన శిక్షణనే నమ్ముకున్నారు. జాన్వీ కపూర్ తన కర్వీ ఫిగర్‌ను నిలబెట్టుకోవడానికి జిమ్ వర్కౌట్లతో పాటు రెగ్యులర్‌గా పైలేట్స్ స్టూడియోల చుట్టూ తిరుగుతూ కనిపిస్తుంది.

## ప్రియదర్శి కొత్త సినిమా.. సుకుమార్‌తో ఇలా..



టాలీవుడ్‌లో కంటెంట్ ఉన్న సినిమాలకు ఎప్పుడూ మంచి ఆదరణ దక్కుతుంది. ఈ క్రమంలోనే సుకుమార్ రైటింగ్స్, బన్నీ వాస్ వర్క్స్ బ్యానర్లు కలిసి ఒక కొత్త ప్రాజెక్ట్ ను పట్టాలెక్కించాయి. యంగ్ హీరో ప్రియదర్శి మెయిన్ లీడ్ గా నటిస్తున్న ఈ సినిమా పనులు లేటెస్ట్ గా మొదలయ్యాయి. రెగ్యులర్ షూటింగ్ కు వెళ్లే ముందు చిత్ర యూనిట్ మొత్తం సుకుమార్ ను కలిసి ఆయన బ్లెస్సింగ్స్ తీసుకున్నారు. ఈ సందర్భంగా దిగిన ఫోటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఈ చిత్రానికి వంశీ రెడ్డి దొండపాటి దర్శకత్వం వహిస్తున్నాడు. ఇదొక పక్కా తెలంగాణ ఫ్యామిలీ డ్రామా అని మేకర్స్ ముందుగానే క్లారిటీ ఇచ్చారు. పల్లెటూరి నేపథ్యంలో సాగే కథల్లో సహజత్వం ఉంటే జనాలు ఈజీగా కనెక్ట్ అవుతారు. అందుకే ఈ సినిమాలో కామెడీతో పాటు కుటుంబ భావోద్వేగాలను కూడా సమపాళ్లలో మిక్స్ చేస్తూ స్క్రిప్ట్ సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. బలగం లాంటి హిట్ తర్వాత ప్రియదర్శికి ఇలాంటి రూరల్ కాన్సెప్ట్ దొరకడం నిజంగా కలిసి వచ్చే అంశం. ఇక ఈ ప్రాజెక్ట్ లో హీరోయిన్ ఎంపిక ఇండస్ట్రీలో ఆసక్తికరంగా మారింది. తెలంగాణ జానపద పాటలు, డాన్స్ లతో సోషల్ మీడియాలో మంచి గుర్తింపు తెచ్చుకున్న నాగదుర్గ ఇందులో హీరోయిన్ గా నటిస్తోంది. ఆమెకు ఇదే టాలీవుడ్ లో ఫస్ట్ సినిమా. గ్లామర్ కోసమే కాకుండా కథలోని పల్లెటూరి వాతావరణానికి, ఆ నేటివిటీకి సరిగ్గా సరిపోయే అమ్మాయి కావాలనే ఉద్దేశ్యంతోనే మేకర్స్ ఆమెను ఎంచుకున్నట్లు అర్థమవుతోంది. కొత్త సినిమా పనులు మొదలుపెడుతున్న సందర్భంగా టీమ్ అంతా సుకుమార్ ను కలవడం విశేషం. కొత్త టాలెంట్ ను ఎంకరేజ్ చేయడంలో సుకుమార్ ఎప్పుడూ ముందుంటారు. ఈ మీట్ లో ఆయన టీమ్ కు తన బెస్ట్ విషెస్ తెలియజేశారు. అదే సమయంలో నాగదుర్గ పుట్టినరోజు కూడా ఉండటంతో సుకుమార్ సమక్షంలోనే ఆమె బర్త్ డే వేడుకలను కూడా సింపుల్ గా సెలబ్రేట్ చేశారు. ఇది ఆ కొత్త హీరోయిన్‌కు మంచి మెమరీ అని చెప్పొచ్చు. సుకుమార్ రైటింగ్స్, బన్నీ వాస్ వర్క్స్ చేతులు కలిపాయి అంటే ఆ ప్రాజెక్ట్ వెనుక కచ్చితంగా బలమైన కంటెంట్ ఉంటుందని ఇండస్ట్రీలో ఒక నమ్మకం ఉంది. లో బడ్జెట్ లోనే క్వాలిటీ సినిమాలు తీసి హిట్లు కొట్టిన ట్రాక్ రికార్డ్ ఈ రెండు సంస్థలకు ఉంది. ప్రియదర్శి నాచురల్ యాక్టింగ్, నాగదుర్గ ఫ్రెష్ లుక్ ఈ సినిమాకు ప్లస్ అయ్యేలా కనిపిస్తున్నాయి. కొత్త దర్శకుడు వంశీ రెడ్డి ఈ అవకాశాన్ని ఏ స్థాయిలో వాడుకుంటాడనేది చూడాలి. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు దాదాపు చివరి దశకు చేరుకున్నాయి. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ స్టార్ట్ చేసి సినిమాను వీలైనంత త్వరగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఈ తెలంగాణ ఫ్యామిలీ డ్రామా బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి రిజల్ట్ ఇస్తుందో చూడాలంటే మరికొన్ని రోజులు ఎదురుచూడాల్సిందే. ఈ ప్రాజెక్ట్ కి సంబంధించిన మిగతా నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలోనే అఫీషియల్ గా బయటకు రానున్నాయి.

## రెడ్ బ్యాగ్‌లో ఏముంది?



సస్పెన్స్ థ్రిల్లర్ కథలంటే సినీ ప్రియుల్లో ఎప్పుడూ ప్రత్యేక ఆసక్తి ఉంటుంది. అలాంటి ఇంట్రెస్టింగ్ కాన్సెప్ట్ తో తెరకెక్కుతున్న మూవీ ది రెడ్ బ్యాగ్. హరికృష్ణ సోమిశెట్టి నిర్మిస్తున్న ఆ సినిమాకు రవికుమార్ సీరపు దర్శకత్వం వహించారు. ఇప్పటికే వచ్చిన ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై హైప్ క్రియేట్ చేయగా, తాజాగా రిలీజైన టీజర్ క్యూరియాసిటీని పెంచింది. ఏపీ పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ చేతుల మీదుగా టీజర్ విడుదలైంది. టీజర్ ప్రారంభం నుంచే మిస్టరీ ఎన్విరాన్మెంట్ ను క్రియేట్ చేసే ప్రయత్నం చేశారు. "జీవితంలో పిలవని అతిథులు వస్తుంటారు.. వాళ్లు మన జీవితాన్ని మార్చేస్తారు.. ఆ అతిథి మనిషే కావాల్సిన అవసరం లేదు" అనే వాయిస్ ఓవర్ తో కథపై ఆసక్తిని పెంచారు. సాధారణంగా కనిపించే ఒక రెడ్ బ్యాగ్ చుట్టూ కథ తిరుగుతున్నట్లు టీజర్ ద్వారా క్లియర్‌గా తెలుస్తోంది. నలుగురు యువతుల జీవితాలు ఒక్కసారిగా ప్రమాదంలో పడటం, ఆ పరిస్థితుల కారణంగా ఒక రెడ్ బ్యాగ్ కనిపించడం కథలో మెయిన్ ఎలిమెంట్ గా కనిపిస్తోంది. ఆ బ్యాగ్ లో ఏముంది? దాని కోసం ఎవరు వెతుకుతున్నారు? యువతులకు దానితో ఉన్న సంబంధం ఏమిటి? అనే ప్రశ్నలకు టీజర్ సమాధానం చెప్పకపోయినా ప్రేక్షకుల్లో ఆసక్తి రేకెత్తించేలా రూపొందించారు. టీజర్‌లో గ్లామర్‌తో పాటు యాక్షన్, థ్రిల్ కు కూడా ఇంపార్టెన్స్ ఇచ్చారు. కథలోని పాత్రలు సాధారణ పరిస్థితుల నుంచి ప్రాణాపాయ స్థితికి చేరినట్లు చూపించిన విధానం ఆకట్టుకుంటుంది. ముఖ్యంగా వెంటాడే సీన్స్, వైలెన్స్ ఘటనలు, ఉత్కంఠభరితమైన కట్స్ సినిమాపై అంచనాలు పెంచుతున్నాయి. చివర్లో నటి రాశి కనిపించిన తీరు కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఎలాంటి డైలాగ్ లేకుండానే ఆమె ఎక్స్ప్రెషన్ తో మిస్టరీని మరింత పెంచే ప్రయత్నం చేశారు. కబీర్ సింగ్, ప్రసాద్ బెహరా, రాధ్య, మౌనిక, స్నేహా సింగ్, ఆకాంక్ష, ఈషాన్ శంకర్, అవినాష్ బాదల్, భార్గవి తదితరులు తమ పాత్రలకు తగ్గట్టుగా కనిపించారు. టీజర్ లో అందరి పాత్రలకు ప్రాధాన్యం ఉన్నట్లు అనిపిస్తోంది. ముఖ్యంగా ఉమెన్ రోల్స్ చుట్టూనే కథ ఎక్కువగా తిరిగే అవకాశం కనిపిస్తోంది. సాంకేతికంగా కూడా టీజర్ మంచి రేంజ్ లో కనిపించింది. ప్రియేష్ గురుస్వామి అందించిన సినిమాటోగ్రఫీ విజువల్స్‌ను మరింత ఆకర్షణీయంగా నిలబెట్టింది. కుంకుమ్ భాగ్య ఫేం, నటి సంచిత ఉంగాలే హఠాన్మరణం భారతీయ చలనచిత్ర పరిశ్రమల్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ముఖ్యంగా నైట్ ఎఫెక్ట్ లో తీసిన షాట్లు సినిమాకు కావాల్సిన మిస్టరీ ఫీల్ ను తీసుకొచ్చాయి. శేఖర్ మోపూరి అందించిన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ టీజర్ కు మెయిన్ అసెంట్ గా నిలిచింది. ప్రతి సీన్ లో ఉత్కంఠను పెంచేలా మ్యూజిక్ ను ఉపయోగించారు. శివ శర్వాణి ఎడిటింగ్ కూడా స్పీడ్ గా సాగుతూ టీజర్ ను ఆసక్తికరంగా మార్చింది. ఏదేమైనా ది రెడ్ బ్యాగ్ టీజర్ ప్రేక్షకుల్లో ఆసక్తి రేకెత్తించడంలో సక్సెస్ అయింది. ఒక సాధారణ రెడ్ బ్యాగ్ చుట్టూ నడిచే మిస్టరీ వెనుక అసలు కథ ఏమిటన్న ప్రశ్న ప్రేక్షకుల ముందుంచింది. సస్పెన్స్, థ్రిల్, యాక్షన్ ఎలిమెంట్స్ తో రూపొందించిన ఆ చిత్రం విడుదలకు ముందే మంచి బజ్ ను సంపాదించింది.

## యంగ్ డైరెక్టర్లను వదలని కమల్..



తమిళ సినీ పరిశ్రమలో కొత్త టాలెంట్ ను గుర్తించి వారికి అవకాశాలు కల్పించే నటుల్లో కమల్ హాసన్ పేరు ఎప్పుడూ ముందువరుసలో ఉంటుంది. నటుడిగానే కాదు, నిర్మాతగా కూడా ఆయన తీసుకునే నిర్ణయాలు తరచుగా చర్చనీయాంశమవుతుంటాయి. తాజాగా ఒక యంగ్ డైరెక్టర్ కి ఆయన ఇస్తున్న మద్దతు ఇండస్ట్రీలో ఆసక్తికరమైన చర్చకు దారి తీసింది. సాధారణంగా ఒక పెద్ద స్టార్ కోసం రెడీ చేసిన కథ ఆ ప్రాజెక్టులో ముందుకు వెళ్లకపోతే, ఆ కథతో పాటూ డైరెక్టర్ అవకాశాలు కూడా తగ్గిపోతాయని భావిస్తారు. కానీ కమల్ విధానం మాత్రం భిన్నంగా కనిపిస్తోంది. ఒక ప్రాజెక్టు రూపంలో ఊహించిన కల నెరవేరకపోయినా, ఆ డైరెక్టర్ ఆలోచనలో విలువ ఉంటే దానిని వదిలేయకూడదన్న దృక్పథాన్ని ఆయన మరోసారి చూపిస్తున్నట్లు తెలుస్తోంది. రీసెంట్‌గా యంగ్ డైరెక్టర్ శిబి చక్రవర్తి పేరు ఈ నేపథ్యంలో వినిపిస్తోంది. కమర్షియల్ ఎంటర్‌టైనర్‌లతో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిన శిబి.. కమల్ హాసన్ బ్యానర్ లో రజినీ నటించనున్న సినిమాకు దర్శకత్వం వహిస్తారని అంతా అనుకున్నారు కానీ కమల్‌కు నచ్చిన కథ రజినీకి నచ్చడంతో ఆ ప్రాజెక్టు వేరే డైరెక్టర్‌తో మొదలైంది. అయితే శిబి చెప్పిన ఆ కథ అందరికీ వెంటనే కనెక్ట్ కాకపోయినా, కమల్ మాత్రం ఆ కథలో ప్రత్యేకతను గుర్తించినట్లు తెలుస్తోంది. కమల్ కెరీర్‌ను పరిశీలిస్తే ఆయనకు ఎప్పుడూ కొత్త ఆలోచనలు, ప్రయోగాత్మక కథలు, సాంప్రదాయ ఫార్ములాలకు భిన్నమైన కథనాలపై ఆసక్తి ఎక్కువ. అందుకే ఒక కథలో కమర్షియల్ అంశాల కంటే కొత్తదనం, పాత్రల లోతు లేదా కథ చెప్పే విధానంలో ప్రత్యేకత కనిపిస్తే దానికి ప్రాధాన్యం ఇస్తుంటారు. ఈ నేపథ్యంలో శిబి రెడీ చేసిన కథ కూడా అలాంటి కోవలోనే ఉండొచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అంతే కాదు, పెద్ద హీరోతో సినిమా చేయలేకపోయినా డైరెక్టర్ ని పూర్తిగా పక్కన పెట్టకుండా అతనితో కలిసి కథను మరింత మెరుగుపరచే ప్రయత్నాలు ఇంకా కొనసాగుతున్నాయనే వార్తలు వినిపిస్తున్నాయి. ఇది కమల్ నిర్మాణ సంస్థ యంగ్ టాలెంట్ పట్ల చూపిస్తున్న నమ్మకాన్ని ప్రతిబింబిస్తోంది. ఒకే సినిమా ఫలితాన్ని బట్టి నిర్ణయాలు తీసుకునే బదులు, దర్శకుడి దీర్ఘకాల సామర్థ్యాన్ని దృష్టిలో పెట్టుకుని అవకాశాలు ఇవ్వడమనేది ఇప్పుడు అరుదుగా కనిపిస్తున్న అంశం. ఇటీవలి కాలంలో కోలీవుడ్‌లో అనేక మంది కొత్త డైరెక్టర్లు ఎదిగిన నేపథ్యంలో, వారికి అండగా నిలిచిన ప్రముఖ బ్యానర్ల పాత్ర కూడా కీలకంగా మారింది. ఆ లిస్ట్ లో కమల్ సంస్థ పేరు మరింత బలంగా వినిపిస్తోంది. కొత్త ఆలోచనలను ప్రోత్సహించడం, యంగ్ డైరెక్టర్లకు అవకాశాలివ్వడం, వారి కథలను అభివృద్ధి చేసే అవకాశాలు కల్పించడం వంటి అంశాలు చూస్తుంటే, ఇది కేవలం సినిమా నిర్మాణ సంస్థగానే కాకుండా కొత్త టాలెంట్ కు వేదికగా కూడా మారుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## పెద్ది తర్వాత బుచ్చిబాబు కొత్త ప్లాన్!



టాలీవుడ్‌లో డైరెక్టర్ బుచ్చిబాబు సానా గురించి మాట్లాడినప్పుడు ముందుగా గుర్తొచ్చేది ఆయన కథలపై చూపించే నిబద్ధత. ఒక సినిమా పూర్తయిన వెంటనే మరో ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించే డైరెక్టర్ల కంటే, తన ఆలోచనలను పూర్తిగా మలచుకుని ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికే ఆయన ఎక్కువ ప్రాధాన్యం ఇస్తుంటారు. అయితే ఇప్పుడు పరిస్థితులు మారుతున్నట్లు కనిపిస్తున్నాయి. రామ్ చరణ్ తో చేసిన పెద్ది సక్సెస్ తర్వాత బుచ్చిబాబు తన పని విధానంలోనే కీలకమైన మార్పుకు సిద్ధమవుతున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఉప్పెనతో డైరెక్టర్ గా అద్భుతమైన అరంగేట్రం చేసిన బుచ్చిబాబు, ఆ సినిమా తర్వాత వెంటనే మరో ప్రాజెక్ట్‌ను ప్రారంభించలేదు. తన రెండో సినిమాకు కథను రెడీ చేసుకోవడం, దానికి తగ్గ ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ నిర్వహించడం కోసం ఆయన చాలా ఎక్కువ సమయాన్నే కేటాయించారు. ఫలితంగా ఉప్పెన నుంచి పెద్ది వరకు ప్రేక్షకులు, పరిశ్రమ దాదాపు కొన్ని సంవత్సరాలు వేచి చూడాల్సి వచ్చింది. కానీ ఆ నిరీక్షణకు తగిన ఫలితం లభించిందనే అభిప్రాయం ఇప్పుడు వినిపిస్తోంది. పెద్ది బాక్సాఫీస్ వద్ద మంచి ఫలితాలను అందుకోవడంతో పాటు డైరెక్టర్ గా బుచ్చిబాబు స్థాయిని మరింత పెంచింది. ముఖ్యంగా ఆయన కథ చెప్పే తీరు, ఎమోషన్స్ ను మలిచే విధానం, క్యారెక్టర్ల డిజైన్ పై ప్రశంసలు దక్కాయి. దీంతో ఆయన తదుపరి సినిమా పట్ల సహజంగానే ఆసక్తి పెరిగింది. ఈ నేపథ్యంలో బుచ్చిబాబు గతంలా ఎక్కువ రెస్ట్ తీసుకోవాలని భావించడం లేదని తెలుస్తోంది. ప్రస్తుతం కొంతకాలం విశ్రాంతి తీసుకోవాలనే ఆలోచనలో ఉన్నప్పటికీ, అది లాంగ్ గ్యాప్ కాదని తెలుస్తోంది. త్వరలోనే కొత్త కథ డెవలప్‌మెంట్ వర్క్స్ ను ప్రారంభించి తర్వాతి ప్రాజెక్ట్‌ను వేగంగా ముందుకు తీసుకెళ్లాలని బుచ్చిబాబు భావిస్తున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం టాలీవుడ్‌లో పోటీ తీవ్రంగా పెరిగింది. ఒక సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ తన క్రేజ్‌ను కొనసాగించాలంటే వరుసగా ప్రాజెక్టులను అనౌన్స్ చేయడం కూడా కీలకంగా మారింది. ఈ అంశాన్ని బుచ్చిబాబు కూడా గుర్తించినట్లు కనిపిస్తోంది. అందుకే ఈసారి స్టోరీ డెవలప్‌మెంట్ ప్రాసెస్‌ను వేగవంతం చేసి, గతంతో పోలిస్తే తక్కువ వ్యవధిలోనే తన తర్వాతి సినిమాను అనౌన్స్ చేసే అవకాశాలున్నాయని అంటున్నారు. ఇక బుచ్చిబాబు ఫ్యూచర్ ప్రాజెక్టులపై ఇప్పటికే పలు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా స్టార్ హీరోలతో కాంబినేషన్లపై ఆసక్తికర డిస్కషన్స్ సాగుతున్నాయి. అయితే ప్రస్తుతం బుచ్చిబాబు దృష్టి మొత్తం కొత్త కథపై ఉన్నట్లు సమాచారం. మొత్తానికి ఉప్పెన తర్వాత పెద్ది కోసం సంవత్సరాల సమయం తీసుకున్న బుచ్చిబాబు, ఇప్పుడదే మార్గంలో నడవకూడదని నిర్ణయించుకున్నట్లుగా సంకేతాలు కనిపిస్తున్నాయి. చిన్న బ్రేక్ తర్వాత పెద్ద ప్లానింగ్‌తో తిరిగి రంగంలోకి దిగేందుకు ఆయన సిద్ధమవుతుండటం, అభిమానుల్లో ఆసక్తిని మరింత పెంచుతోంది.

## 25న అమరావతిలో 'ఎన్‌బికె112' చిత్రం ప్రారంభం



గాడ్ అఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, సంచలన దర్శకుడు కొరటాల శివ తొలిసారిగా 'ఎన్‌బికె112' చిత్రం కోసం జతకడుతున్నారు. ఈ ప్రాజెక్ట్ ఇప్పటికే అభిమానులు, సినీ వర్గాల్లో భారీ అంచనాలు పెంచింది. ఎస్‌ఎల్‌వి సినిమాస్ సుధాకర్ చెరు కూరి, యువసుధ ఆర్ట్ సుధాకర్ మిక్కిలినేని ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నారు. అమరావతి సమీపంలోని వెంకటాయపాలెంలో ఉన్న తిరుమల తిరుపతి దేవస్థానంలో జూన్ 25న ఈ సినిమా గ్రాండ్ లాంచ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఏపీ మంత్రులు నారా లోకేష్, కందుల దుర్గేష్ ముఖ్య అతిథులుగా హాజరుకానుండటంతో ఈ కార్యక్రమం అత్యంత ప్రతిష్టాత్మకంగా జరగనుంది. బాలకృష్ణ భారీ స్థాయి స్క్రీన్ ఇమేజ్‌కు సరిపోయేలా కొరటాల శివ ఒక పవర్‌ఫుల్ కథని సిద్ధం చేశారు.

## బాసర మహంకాళి ఆలయంలో దొంగతనం

(మొదటి పేజీ తరువాయి)

సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి దొంగలను త్వరితగతిన గుర్తించి అరెస్ట్ చేయాలని ఆదేశించారు. ఆలయాల్లో భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక నిఘా పెట్టాలని, భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో భద్రతను మరింత కఠినతరం చేయాలని సూచించారు. ప్రజలు సైతం అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీ కోరారు. ఈ కేసు ఛేదనకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించామని, త్వరలోనే నిందితులను పట్టుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఎస్పీ వెంట భైంసా ఏఎస్పీ సాయి కిరణ్ ఐపీఎస్, ఇన్స్పెక్టర్లు రవీందర్ నాయక్, సమ్మయ్య, స్థానిక ఎస్ఐలు, దేవస్థాన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## అట్టహాసంగా పద్మ పురస్కారాల ప్రదానోత్సవం

(మొదటి పేజీ తరువాయి)



మొత్తం 47 మందికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పద్మశ్రీ పురస్కారాలను ప్రదానం చేశారు. కాగా, అంతకుముందు మే 25న నిర్వహించిన మొదటి విడత కార్యక్రమంలో 66 మందికి పద్మ అవార్డులను అందజేసిన సంగతి తెలిసిందే. ఇవాళ రాష్ట్రపతి చేతుల మీదుగా పద్మశ్రీ పురస్కారాలు అందుకున్న వారిలో తెలుగు సినీ రంగానికి చెందిన ప్రముఖ నటులు, నిర్మాతలు అయిన రాజేంద్రప్రసాద్, మురళీమోహన్ ఉన్నారు. కళారంగానికి వారు చేసిన అసమాన సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం ఈ పురస్కారాలను ప్రకటించింది. రాష్ట్రపతి చేతుల మీదుగా వారు ఇరువురు అవార్డును తీసుకుంటున్న సమయంలో హాల్ అంతా చప్పట్లతో మారుమోగింది. అదేవిధంగా మళయాళం ఫిల్మ్ ఇండస్ట్రీ నుంచి సూపర్ స్టార్ మమ్ముట్టి పద్మశ్రీ పురస్కారాన్ని స్వీకరించారు. ఈ ప్రతిష్టాత్మక అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## వ్యాసరచన పోటీలలో విజేతలకు బహుమతులు అందజేసిన ఖమ్మం టౌన్ ఏసీపీ రమణమూర్తి



ఖమ్మం, జూన్ 23 (పోలీస్ నిఘా) : డ్రగ్స్ మహమ్మారి ఎందరో జీవితాలను చిన్నాభిన్నం చేస్తుందని ఖమ్మం టౌన్ ఏసీపీ రమణమూర్తి అన్నారు. మాదకద్రవ్యాల వినియోగంపై అవగాహన కార్యక్రమం సందర్భంగా ఖమ్మం నగరంలోని ఇందిరానగర్ హైస్కూల్‌లో నిర్వహించిన వ్యాసరచన పోటీలలో ప్రధమ, ద్వితీయ స్థానాల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఖమ్మం టౌన్ ఏసీపీ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ..యువత మాదక దవ్యాలకు అలవాటు పడి ఆరోగ్యంతో పాటు జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. డ్రగ్స్ కు అలవాటు పడినవారు విచక్షణ కోల్పోయి ఏం చేస్తున్నారో తెలియని పరిస్థితిల్లో అఘైత్యాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ బాలకృష్ణ, స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**కారేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో మాదకద్రవ్యాల నిర్మూలన కార్యక్రమాలు...**

మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కారేపల్లి ఎస్సై గోపి అన్నారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు కారేపల్లి మండలం భాగ్యనగర్ తండా మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపడం యొక్క ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ..నేటి యువత మాదకద్రవ్య రహితంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని అన్నారు. యువత ఎటువంటి దురలవాట్లకు బానిస కాకుండా సన్మార్గంలో నడిచి జీవితంలో ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు.

## ముగింపు దశలో ధాన్యం కొనుగోళ్లు

### -జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్-



మెదక్ , జూన్ 23 (పోలీస్ నిఘా) : జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ముగింపు దశలో ఉన్నాయని జిల్లా కలెక్టర్ అన్నారు. జిల్లాలు ఇప్పటివరకు 95, 313 మంది రైతుల నుండి 4,21,083,240 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి,90,221 మంది రైతులకు వారి బ్యాంకు ఖాతాలో 928.85 కోట్ల రూపాయలు చెల్లింపు చేశామన్నారు. ఇప్పటివరకు 531 ధాన్యం కొనుగోలు కేంద్రాలలో పూర్తిగా ధాన్యం కొనుగోలు చేశామని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మోకిల ప్రభుత్వ పాఠశాలలో అవగాహన కార్యక్రమం



శంకర్ పల్లి , జూన్ 23 (పోలీస్ నిఘా) : అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకొని మోకిల పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో మోకిల ప్రభుత్వ పాఠశాల నందు విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మోకిల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి మరియు ఎస్.ఐ సురేష్ గౌడ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలు డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాలకు యువత బానిసైతే భవిష్యత్తు నాశనం అవుతుందని, ఆరోగ్యం, కుటుంబం, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుందని విద్యార్థులకు వివరించారు. అలాగే రోడ్డు భద్రతా విషయంలో హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడం, మైనర్లు వాహనాలు నడపకూడదని, ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించాలని సూచించారు. మరియు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, చదువుపై దృష్టి పెట్టి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, సమాజానికి మంచి పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా డ్రగ్స్ విక్రయాలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులుమరియు మోకిలా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## యాదగిరిగుట్ట దేవస్థాన తాత్కాలిక ఉద్యోగుల సంఘం ఏర్పాటు

### అధ్యక్షుడిగా ఏఈఓ రఘు, ప్రధాన కార్యదర్శిగా సూపరింటెండెంట్ ఊడెపు వెంకట ప్రసాద్



యాదగిరిగుట్ట, జూన్ 23 (పోలీస్ నిఘా) : ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థాన ఉద్యోగుల సమస్యల పరిష్కారం, సంక్షేమం హక్కుల పరిరక్షణ కొరకు దేవస్థానంలో పని చేసే ఉద్యోగులతో తాత్కాలిక ఉద్యోగుల సంఘ కార్యవర్గం ఏర్పాటు చేసినట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు తాత్కాలిక ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా ఏఈఓ గజవెల్లి రఘు, ప్రధాన కార్యదర్శిగా సూపరింటెండెంట్ ఊడెపు వెంకట్ ప్రసాద్, కోశాధికారిగా సూపరింటెండెంట్ దాసోజు నరేష్, ఆర్గనైజర్ గా ఉప ప్రధాన అర్చకులు దోర్బాల శ్రీధర్ శర్మ, కార్యవర్గ సభ్యులుగా ఉప ప్రధాన అర్చకులు మాధవాచార్యులు, సీనియర్ అసిస్టెంట్లు రత్నదీప, ఎన్ నగేశ్, రికార్డు అసిస్టెంట్ డంగు శ్రవణ్, డోలక్ ఎం రామ తిరుపాల్, గోపాలకుడు బండ సత్యనారాయణ, అటెండర్ బి పాండు, హెల్పర్ యాదగిరి, డ్రైవర్ నాగులు ఎన్నికయ్యారు. త్వరలో నిర్వహించబడే సాధారణ సమావేశంలో శాశ్వత కార్యవర్గం ఎన్నిక చేయబడునని, అప్పటివరకు తాత్కాలిక సంఘం ఆధ్వర్యంలో ఉద్యోగుల సమస్యలు ఏమైనా ఉన్నచో పరిష్కరించబడునని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు సురేంద్ర చార్యులు ఏ ఈ ఓ లు జూసెట్టి కృష్ణ సిబ్బంది శంకర్ ప్రసాద్ చంద్రమౌళి దయానంద్ గుడ్ల రాజు అర్జున్ యశ్వంత్ మల్లేష్ కొమ్మ గాని కుమార్ శ్రీశైలం శీను తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రి రామ్మోహన్‌తో రాష్ట్ర మంత్రులు తుమ్మల, ఉత్తమ్ భేటీ

## కొత్తగూడెం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణంపై తుమ్మల విజ్ఞప్తి



ఖమ్మం/ భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 23 (పోలీస్ నిఘా) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం వద్ద గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణం చేపట్టాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రాశీమోహన్ నాయుడు కు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. మంగళవారం నాడు డిల్లీలో రాశీమోహన్ నాయుడు ను ప్రభుత్వం తరపున మంత్రులు తుమ్మల ఉత్తమ్ కుమార్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణం పై చర్చించారు. కొత్తగూడెం వద్ద గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రతిపాదన చేయగానే స్పందించి ఎయిర్ పోర్ట్ నిర్మాణం కోసం సివిల్ ఏవియేషన్ తరపున ఫీజు బులిటీ సర్వే చేసినందుకు రాశీమోహన్ నాయుడు కు మంత్రి తుమ్మల కృతజ్ఞతలు తెలిపారు. ఫీజుబులిటీ సర్వే లో ప్రతిపాదిత స్థలం ఎయిర్ పోర్ట్ నిర్మాణం కోసం అనువుగా లేనందున మరో స్థలం రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రతిపాదన చేశామని అక్కడ త్వరగా ఫీజుబులిటీ సర్వే చేసి, గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణంలో చొరవ తీసుకోవాలని కేంద్ర మంత్రి రాశీమోహన్ నాయుడు కు మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో దక్షిణ అయోధ్య గా ప్రసిద్ధి చెందిన భద్రాచలం రామాలయం దేశ వ్యాప్తంగానే కాదు ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ప్రసిద్ధి చెందిందని తెలిపారు.


**జాతికి వెలుగులు అందించే సింగరేణి గనులు.. హెవీ వాటర్ ప్లాంట్..ఐటీసీ**

బీ. పీ.ఎల్ సంస్థలతో పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అరుదైన ఖనిజ నిక్షేపాలతో అటవీ ప్రాంతంతో ఎకో టూరిజం కు కేరాఫ్ గానిలిచింది. దేశంలోనే తొలి ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ కొత్తగూడెం లో ఏర్పాటు చేశాం. గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణం వల్ల పారిశ్రామికంగా విద్యా పరంగా టూరిజం పరంగా జిల్లా ఎంతో పురోగతి చెందే అవకాశం ఉందని, దేశ విదేశాల నుంచి భద్రాద్రి రామాలయం దర్శనానికి వచ్చే భక్తులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణంలో చొరవ తీసుకోవాలని రాంమోహన్ నాయుడు కు మంత్రి తుమ్మల సవివరంగా తెలిపారు. గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణంలో చేపట్టాల్సిన పనులపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని మంత్రి తుమ్మల తెలిపారు. తెలుగు బిడ్డన రాంమోహన్ నాయుడు చొరవతో కొత్తగూడెం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ కల సాకారం కానుందని మంత్రి తుమ్మల ఆశాభావం వ్యక్తం చేశారు.

# నగర పార్కుల అభివృద్ధికి ఆధునిక నమూనాలు రూపొందించాలి

**హనుమకొండ జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్‌పాయి**

**డబ్ల్యూఆర్ఐ ప్రతినిధులతో నగర పార్కుల అభివృద్ధిపై సమీక్ష సమావేశం**



హనుమకొండ, జూన్ 23 (పోలీస్ నిఘా) : నగరంలోని పార్కులను ప్రజలకు మరింత ఆకర్షణీయంగా, ఉపయోగకరంగా తీర్చిదిద్దేందుకు ఆధునిక నమూనాలు (డిజైన్లు) రూపొందించి అభివృద్ధి పనులను చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) ప్రత్యేక అధికారి చాహత్ బాజ్‌పాయి సూచించారు. మంగళవారం హన్మకొండ కలెక్టరేట్ లో వరల్డ్ రిసోర్సెస్ ఇన్స్టిట్యూట్ (డబ్ల్యూఆర్ఐ) ప్రతినిధులు, బల్దియా అధికారులతో నగర పార్కుల అభివృద్ధిపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్కుల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన వినోద, విశ్రాంతి సౌకర్యాల కల్పనకు సంబంధించి పలు సూచనలు చేశారు. బాలసముద్రంలోని చిల్డ్రన్స్ పార్కు అభివృద్ధికి డబ్ల్యూఆర్ఐ అందించిన ఆధునిక డిజైన్లను అనుసరించి పార్కును అభివృద్ధి చేసినట్లు తెలిపారు. అదే తరహాలో నగరంలోని ఇతర పార్కుల అభివృద్ధికి కూడా డబ్ల్యూఆర్ఐ సాంకేతిక సహకారం అందించాలని కోరారు. వరంగల్ పరిధిలోని కీర్తినగర్ పార్కుతో పాటు నగరంలోని మరికొన్ని పార్కులు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలను ఎంపిక చేసి వాటి అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ప్రజల అవసరాలు, పిల్లల వినోదం, పర్యావరణ పరిరక్షణ అంశాలను దృష్టిలో ఉంచుకొని పార్కులను అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. నగరంలో పచ్చదనం పెంపొందించడంతో పాటు ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించే దిశగా పార్కుల అభివృద్ధి కీలకమని, ఈ కార్యక్రమంలో డబ్ల్యూఆర్ఐ పూర్తి సహకారం అందిస్తుందని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో డబ్ల్యూఆర్ఐ కన్సల్టెంట్ ప్రతినిధి ఎలైన్ అగిత్ జీడబ్ల్యూఎంసీ సూపరింటెండింగ్ ఇంజనీర్ రాజ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రవికుమార్, సంతోష్‌బాబు, డిప్యూటీ ఇంజనీర్ రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# గురిజాల రైతు వేదికలో ఘనంగా సీడ్ మేళా ప్రారంభం



నర్సంపేట, జూన్ 23 (పోలీస్ నిఘా) : ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని గురిజాల రైతు వేదికలో మంగళ వారం నిర్వహిం చిన సీడ్ మేళా కార్యక్రమా న్ని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సంయుక్తంగా ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఎమ్మె ల్యే దొంతి మాధవ రెడ్డి మాట్లాడుతూ మార్కెట్ డిమాండ్ కలిగి ప్రభుత్వం సూచించిన ఏడు రకాల వరి విత్తన రకాలకు మాత్రమే బోనస్ ఇవ్వడం జరుగుతుందని, వాటిని మాత్రమే ఈ సీడ్ మేళాలో అధీకృత డీలర్ల ద్వారా అమ్మకాలకు పెట్టడం జరిగిందని తెలిపారు. పంటల ఎంపికలో వర్షపాత పరిస్థితులను పరిగణలోకి తీసుకొని మధ్య కాలిక స్వల్పకా లిక రకాలను ఎంచు కోవాలని ఎమ్మెల్యే అన్నారు. వర్షాభావ పరిస్థితులు నెలకొంటే పప్పు ధాన్యాలు , జొన్న,ను వ్వులు, మరియు కూరగాయలు సాగుకు వంటి ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. యూరియాను సిఫార్సు చేసిన మోతాదులోనే వినియోగించాలని, రెండో దఫా నుంచి నానో యూరియాను తప్పని సరిగా ఉపయోగించాలని రైతులను కోరారుజిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొ నేందుకు జిల్లా యంత్రాంగం సమగ్ర కార్యా చరణ ప్రణాళి కను సిద్ధం చేసిందని తెలిపారు. రైతులు అంతర పంట లు సాగు చేయ డంతో పాటు తక్కువ నీటి అవసరం ఉన్న పంటల ను ఎంచు కోవాలని సూచించారు. వాతావ రణ పరిస్థితు లకు అనుగుణంగా పంటల ప్రణాళిక రూపొందించు కోవడం ద్వారా నష్టా లను తగ్గించుకో వచ్చని పేర్కొన్నారు.రైతులు ఒకే చోట అన్ని విత్తనా లు అందుబా టులో ఉంచడంలో హర్షం వ్యక్తం చేసి ప్రభుత్వానికి కృతజ్ఞత లు తెలిపారు ఈ కార్యక్రమంలో వరంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలై శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ అధికారిణి విజయ నిర్మల, డీహెచ్‌వో శ్రీనివాస్, ఏడీఏ శ్రీనివాస్, ఉద్యాన శాఖ అధికారి జ్యోతి, వ్యవసాయ అధికారి కృష్ణకుమార్, సర్పంచ్‌లు గురిజాల చంద్రరావు, చిన్న గురిజాల కమలాకర్, జీజీఆర్‌పల్లి బుస నర్సయ్య, గుంటూరుపల్లి రజిత, వ్యవసాయ విస్తరణాధికారులు అశోక్, సింధు, సంధ్య, త్రివేణి, అబిద్ హుస్సేన్‌తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధి జరగాలి

### -జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్-



మనోహరాబాద్, జూన్ 23 (పోలీస్ నిఘా) : మనోహరాబాద్ మండలంలోని శాంత బయోటెక్ పరిశ్రమలో జిల్లా పారిశ్రామిల అభివృద్ధి పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ... జిల్లాలు పారిశ్రామిక అభివృద్ధి జరిగి పరిశ్రమల స్థాపన, ఉద్యోగ అవకాశాల కల్పన కోసం చొరవ చూపాలన్నారు. పరిశ్రమల లో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడంతో పాటు ప్రభుత్వ సబ్సిడీలు, ప్రోత్సాహక పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కోసం నూతన యాప్ శిక్షణను పారిశ్రామిక వేతలకు జరిగింది పారిశ్రామికవేత్తలు చాలా ఉత్సాహంతో వారి సందేహాలు నివృత్తి చేసుకోవడం జరిగింది. కార్యక్రమం అంతరం శాంత బయోటెక్ పరిశ్రమలలో మొక్కలు నాటి, వాటికి నీరు పోశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ ప్రకాష్ రావు,ఐల అధ్యక్షులు సుబ్బారావు , కార్యదర్శి, అసోసియేషన్ సభ్యులు మరియు వివిధ పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ దయానంద్‌ని కలిసిన సర్పంచ్ కేతావత్ అంబాలి రవీందర్ నాయక్



దేవరకొండ , జూన్ 23 (పోలీస్ నిఘా) : నేరడుగొమ్ము మండలంలోని పెద్దమునిగల్ గ్రామానికి చెందిన పసుపులేటి రామకృష్ణకు గవర్నర్ కోట ఎమ్మెల్సీ దయానంద్ చేతుల మీదుగా హైదరాబాద్ లోని తన నివాసం లో సీఎంఆర్ఎఫ్ 60000 రూపాయల చెక్కుని గ్రామ సర్పంచ్ కేతావత్ అంబాలి రవీందర్ నాయక్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ అందజేశారు. అనంతరం సర్పంచ్ ఎమ్మెల్సీ దయానంద్ ని శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ యొక్క కార్యక్రమంలో పెద్దమునిగల్ సర్పంచ్ కేతావత్ అంబాలి రవీందర్ నాయక్,రాపర్తి వినయ్ కుమార్,చిలుకూరి రాజేష్,పసుపులేటి రామకృష్ణ పాల్గొన్నారు.

## డిఎన్టి హాస్టల్‌కు ప్రహరీ గోడ నిర్మించి, మంచినీటి సమస్య పరిష్కరించాలి

### ఎస్ఎఫ్ఐ దేవరకొండ డివిజన్ కార్యదర్శి బుడగ వెంకటేష్ డిమాండ్




దేవరకొండ, జూన్ 23 (పోలీస్ నిఘా) : ఈ 23 నుంచి 28 వరకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హాస్టల్స్,స్కూలు సర్వేలో భాగంగా దేవరకొండ పట్టణ కేంద్రంలో ఉన్నటువంటి ఎస్టీ-1హాస్టల్,డిఎన్టి హాస్టల్లో సర్వే నిర్వహించి సమస్యలు తెలుసుకోవడం జరిగింది అనంతరం ఎస్ఎఫ్ఐ దేవరకొండ డివిజన్ కార్యదర్శి బుడిగ వెంకటేష్ మాట్లాడుతూ.... విద్యారంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం విస్మరిస్తుందని నూతన అకాడమిక్ ఇయర్ ప్రారంభమైన కూడా గత సమస్యలతోటే విద్యార్థులకు స్వాగతం పలుకుతూ అంగు ఆర్భాటాలు చేస్తుంది తప్ప పూర్తి స్థాయిలో విద్యార్థులకు న్యాయం చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. డిఎన్టి హాస్టల్లో ప్రధానమైన సమస్య త్రాగునీరు సమస్య పరిష్కరించకుండా మళ్లీ హాస్టల్ పునర్ ప్రారంభించి నీటి సమస్యతోటి ఇబ్బంది పడుతూ విద్యార్థులు హాస్టల్ మొఖం చూటాలంటేనే దాటేస్తున్న పరిస్థితి కనిపిస్తున్న కూడా అధికారులు చూసి చూడనట్టు వ్యవహరించడం ఎంతవరకు సబబు అన్నారు. గతంలో అధికారులకు చెప్పినప్పటికీ కూడా పట్టించుకునే పరిస్థితి కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు తక్షణమే డిఎన్టి హాస్టల్ ప్రహరీ గోడ మంచినీటి సౌకర్యం కల్పించి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఏ.త్రిశాంత్,ఆర్.అశోక్, ఎన్.అరవింద్,ఎన్.అఖిల్,వి. గణేష్,జైరాం తదితరులు పాల్గొన్నారు.

## పల్స్ పోలియోకు సర్వం సిద్ధం.. సిబ్బందికి ప్రత్యేక శిక్షణ



లక్సెట్టిపేట, జూన్ 23 (పోలీస్ నిఘా) : లక్సెట్టిపేట మండలం లోని వెంకట్రావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఈనెల 28 న జరగనున్న పల్స్ పోలియో వాక్సినేషన్ కార్యక్రమం నిర్వాహణపై సిబ్బందికి మంగళవారం నాడు ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించినట్లు వైద్యాధికారిని డాక్టర్ సమత తెలిపారు. ఈనెల 28 న ఆదివారం నాడు మండలం లోని 0 – 5 సంవత్సరాల పిల్లలు 3603 మందికి పోలియో వాక్సిన్ వేయనున్నట్లు తెలిపారు. మొదటి రోజు ప్రభుత్వ పాఠశాలల్లో , గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో, అంగన్వాడి కేంద్రాల్లో బూత్ లను ఏర్పాటు చేసి పిల్లలకు పోలియో వాక్సిన్ వేయనున్నట్లు తెలిపారు. అలాగే రెండవ రోజు మరియు మూడవరోజు మా సిబ్బంది ఇంటింటికి వెళ్లి పిల్లలను గుర్తించి వారికి వాక్సిన్ వేసి వందశాతం లక్ష్యం పూర్తి చేస్తామని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ స్పెషల్ పల్స్ పోలియో వాక్సిన్ కార్యక్రమం లో 0 – 5 సంవత్సరాల లోపు పిల్లలకు తల్లిదండ్రులు తప్పకుండా వాక్సిన్ వేయించాలని డాక్టర్ సమత కోరారు. ఈ సందర్భంగా ఆమె సిబ్బందికి కార్యక్రమం పై పలు సూచనలు అందించారు. ఈ శిక్షణా కార్యక్రమం లో హెచ్ఈఓ దేవేందర్, హెల్త్ సూపర్ వైజర్ శోభ, ఫార్మసీ ఆఫీసర్ సుష్మ, హెల్త్ అసిస్టెంట్లు గఫూర్, వేణు, ఇసాక్ అహ్మద్, ఎంఎల్ హెచ్ పీ లు ,ఏఎన్ఎంలు, ఆశావర్కర్స్ పాల్గొన్నారు.

# జన్నారంలో విషాదం

## అనుమానపు వేధింపులకు వివాహిత బలి



ఉమ్మడి ఆదిలాబాద్, జూన్ 23 (పోలీస్ నిఘా) : భర్త, అత్తింటి వారి మానసిక, శారీరక వేధింపులు తట్టుకోలేక ఓ ప్రైవేట్ టీచర్ ఆత్మహత్యకు పాల్పడిన విచారకర సంఘటన జన్నారం మండలంలో చోటుచేసుకుంది. అపస్మారక స్థితిలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం ఆమె కన్నుమూసింది. ఎస్ఐ ఉదయ్ కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.

**ఐదేళ్ల క్రితం వివాహం.. దుబాయ్ వెళ్లొచ్చాక అనుమానం**

ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలం కేంద్రానికి చెందిన ఖర్టె మాధవ రావు పెద్ద కూతురైన జ్యోత్స్న (27)కు, జన్నారం మండలం రెండ్లగూడ గ్రామానికి చెందిన కస్తులపురి నాగరాజుతో ఐదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి నాలుగేళ్ల బాబు ఉన్నాడు. ప్రైవేట్ టీచర్‌గా పనిచేస్తున్న జ్యోత్స్న సంసారం సాఫీగానే సాగుతున్న క్రమంలో, భర్త నాగరాజు ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లాడు. ఏడాది పాటు అక్కడ ఉండి, ఇటీవల నెల రోజుల క్రితమే స్వగ్రామానికి తిరిగివచ్చాడు.

అయితే, దుబాయ్ నుండి వచ్చినప్పటి నుండి నాగరాజు భార్య ప్రవర్తనపై తీవ్రమైన అనుమానం పెంచుకున్నాడు. వేరే వారితో అక్రమ సంబంధం ఉందంటూ జ్యోత్స్నను శారీరకంగా, మానసికంగా వేధించడం ప్రారంభించాడు. ఈ విషయాన్ని బాధిత మహిళ తన తండ్రికి ఫోన్ చేసి పలుమార్లు వాపోయింది.

**ఫోన్‌లో వినపడ్డ కూతురి ఆర్తనాదాలు**

ఈ నెల 20వ తేదీ అర్ధరాత్రి 12 గంటల సమయంలో భర్త నాగరాజు జ్యోత్స్నను తీవ్రంగా కొడుతూ, హింసిస్తుండగా ఆమె తన తండ్రి మాధవ రావుకు ఫోన్ చేసింది. భర్త పెడుతున్న బాధలు, జ్యోత్స్న ఆర్తనాదాలు తండ్రి ఫోన్‌లో ప్రత్యక్షంగా విన్నాడు.

తీరా మరుసటి రోజు (జూన్ 21న) ఉదయం నాగరాజు అన్న కస్తులపురి నరేష్, మాధవ రావుకు ఫోన్ చేసి "జ్యోత్స్న ఏదో గుర్తుతెలియని మందు గోలీలు మింగిందని, ప్రస్తుతం మంచిర్యాలలోని వసుధ ఆసుపత్రిలో చికిత్స పొందుతోందని" తెలిపాడు. ఆందోళనతో కుటుంబ సభ్యులతో కలిసి ఆసుపత్రికి వెళ్లిన తండ్రికి జ్యోత్స్న అపస్మారక స్థితిలో (కోమాలో) కనిపించింది.

**చికిత్స పొందుతూ మృతి.. అత్తింటి వారిపై కేసు నమోదు**

పరిస్థితి విషమించడంతో మంగళవారం (జూన్ 23) ఉదయం 7:41 గంటల ప్రాంతంలో జ్యోత్స్న ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. భర్త నాగరాజుతో పాటు అతని అన్న నరేష్, అత్త లక్ష్మిలు లేనిపోని మాటలు చెప్పి నాగరాజులో అనుమానం రేకెత్తించారని, వారి వేధింపులు తట్టుకోలేకే తన కూతురు మందు బిళ్లలు మింగి, ఆపై చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని తండ్రి మాధవ రావు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

**పోలీసుల దర్యాప్తు:**

మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జన్నారం పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. అత్తింటి వేధింపుల కోణంలో కేసును దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఉదయ్ కిరణ్ పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది.

# ఉపాధ్యాయుల సర్దుబాటు జూన్ 30 తర్వాత సంఖ్య ఆధారంగా చేపట్టాలి

**టీపీటీఫ్ సంగారెడ్డి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమశేఖర్, అనుముల రాంచందర్ డిమాండ్**





సంగారెడ్డి, జూన్ 23 (పోలీస్ నిఘా) : తెలంగాణ రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ జారీ చేసిన మిగులు ఉపాధ్యాయుల సర్దుబాటు ఉత్తర్వులపై తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ సంగారెడ్డి జిల్లా శాఖ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. విద్యా ప్రమాణాల పరిరక్షణ పేరుతో చేపడుతున్న ఈ సర్దుబాటు ప్రక్రియ విద్యార్థుల అభ్యాస ప్రక్రియపై ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదం ఉంది. విద్యార్థులు ఇంకా పాఠశాలల్లో నమోదు చేసుకుంటున్నారు, ఈ తరుణంలో విద్యార్థుల సంఖ్య ఆధారంగా సర్దుబాటుచేయడం వల్ల అనేక ఇబ్బందులు వస్తాయి, పూర్తి స్థాయిలో నమోదు జరిగిన తర్వాత అనగా జూన్ 30 వరకు దాదాపు నమోదు చివరిదశలో ఉంటుందని, అప్పుడు సర్దుబాటుచేయాలి అని వారు డిమాండ్ చేశారు. ప్రతి విద్యాసంవత్సరం విద్యార్థుల సంఖ్యలో మార్పులు సహజం. అలాంటి తాత్కాలిక గణాంకాల ఆధారంగా ఉపాధ్యాయులను ఒక పాఠశాల నుంచి మరొక పాఠశాలకు తరలించడం వల్ల బోధనలో అంతరాయం ఏర్పడుతుంది. ఇప్పటికే సంవత్సరాలుగా ఒక పాఠశాలలో సేవలందిస్తున్న ఉపాధ్యాయులను తరచూ సర్దుబాటు చేయడం విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను దెబ్బతీస్తుంది, వృత్తిపరమైన సమస్యలను మరింత పెంచుతుంది. రిటైర్మెంట్లు, పదోన్నతులు, ఖాళీలు వంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం కొత్త నియామకాల ద్వారానే సాధ్యమవుతుంది. కానీ ఖాళీలను భర్తీ చేయకుండా ఉన్న ఉపాధ్యాయులను మరోచోటికి పంపడం ప్రభుత్వ విద్యను ప్రజలకు దూరం చేసే కుట్రగానే భావించాల్సి ఉంటుందని వారు అన్నారు. అదేవిధంగా, జిల్లా స్థాయిలో చేపట్టే ఈ సర్దుబాటు ప్రక్రియలో పారదర్శకత, స్పష్టమైన ప్రమాణాలు మరియు ఉపాధ్యాయుల అభిప్రాయాలకు తగిన ప్రాధాన్యం కల్పించాల్సిన అవసరం ఉంది. లేకపోతే అన్యాయాలు జరిగే అవకాశం ఉంటుందని, నిబంధనలు కూడా మార్చాలని, మారుతున్న విద్యావ్యవస్థలో అనేక మార్పులు జరిగాయని, ఒక ఉపాధ్యాయునితో 20 మంది విద్యార్థులకు చదువు చెప్పే పరిస్థితులు లేవని, అనేక రకాలైన పనులు, ఆన్లైన్ డేటా పంపడం, ఎఫ్ ఆర్ ఎస్, మధ్యాహ్న భోజనం, వంటి అనేక రకాల పనులు ఉంటున్నాయని కావున ప్రతి పాఠశాలకు కనీసం ఇద్దరు ఉపాధ్యాయులను కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక పాఠశాలల్లో 60 మంది విద్యార్థులకు కూడా ఇద్దరు ఉపాధ్యాయులు అనే నిబంధన సవరించాలని వారు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరిపి ఏకాభిప్రాయం సాధించి సర్దుబాటు చేయాలని అన్నారు, పాఠశాలల్లో ఉన్న ఖాళీలను శాశ్వత నియామకాల ద్వారా భర్తీ చేయాలి అన్నారు. సర్దుబాటు చేసే ఉపాధ్యాయులకు సీనియారిటీ ప్రకారం కౌన్సిలింగ్ నిర్వహించి సర్దుబాటు చేయాలని చెప్పారు. ఉపాధ్యాయులను కేవలం సంఖ్యల ఆధారంగా పరిగణించడం కాకుండా, విద్యా వ్యవస్థకు వెన్నెముకగా భావించి వారి సమస్యలకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాము అని జిల్లా అధ్యక్షులు సోమశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి అనుముల రాంచందర్ లు తెలిపారు.

# ఏబీవీపీ పిలుపుతో దేవరకొండలో విజయవంతమైన పాఠశాలల బంద్



**డిఆర్ఎస్ ప్రైవేట్ పాఠశాల ఫర్నిచర్ ధ్వంసం చేసిన ఏబీవీపీ**

**ప్రభుత్వం విద్యార్థుల సమస్యలపై వెంటనే స్పందించాలి**

**తెలంగాణ రాష్ట్ర హాస్టల్స్ కో కన్వీనర్ యలమల గోపీచంద్**

దేవరకొండ , జూన్ 23 (పోలీస్ నిఘా) : అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ ) రాష్ట్రవ్యాప్త పాఠశాలల బంద్ పిలుపు మేరకు మంగళవారం ఏబీవీపీ దేవరకొండ శాఖ పరిధిలో ప్రైవేట్ మరియు ప్రభుత్వ పాఠశాలలు విజయవంతంగా బంద్ నిర్వహించబడ్డాయి. ఇందులో భాగంగా దేవరకొండ పరిధిలోని డిఆర్ఎస్ అనే ఒక్క ప్రైవేట్ యాజమాన్యం సమాచారా లోపంతో పాఠశాల నడపగా అక్కడికి ఏబీవీపీ కార్యకర్తలు వెళ్లి పాఠశాల ఫర్నిచర్ ధ్వంసం చేయడం జరిగింది. అదేవిధంగా విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ బంద్‌కు పిలుపునివ్వడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర హాస్టల్స్ కో కన్వీనర్ వెలమల గోపీచంద్‌లి మాట్లాడుతూ, విద్యార్థుల హక్కులు మరియు నాణ్యమైన విద్య కోసం ఏబీవీపీ నిరంతరం పోరాటం చేస్తోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

డిమాండ్స్ :

27,000 ల ప్రభుత్వ స్కూళ్లలో 23,000 ల స్కూళ్లను మూసివేస్తామన్న ముఖ్యమంత్రి ప్రకటనను వెంటనే ఉపసంహరించుకోవాలి.

ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ళలో విచ్చలవిడి ఫీజుల దోపిడిని అరికట్టి, ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలి.

ఖాళీగా ఉన్న ఎం ఈ ఓ , డి ఈ ఓ పోస్టులతో పాటు టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి.

ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక వసతులు కల్పించాలి. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించే యూనిఫామ్స్ వెంటనే అందించాలి.

గురుకుల పాఠశాలలకు పక్కా భవనాలు నిర్మించాలి. ఫుడ్ పాయిజన్ కి తావులేకుండా విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి.

ప్రైవేట్ స్కూల్ మేనేజ్ మెంట్ల ఆధ్వర్యంలో నడుస్తున్న బుక్స్, యూనిఫామ్స్ విక్రయాలను నిషేధించాలి.

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ స్కూళ్ళలో "బ్రేక్ ఫాస్ట్" స్కీమ్ తక్షణమే అమలు చేయాలి.

విద్యార్థుల సమస్యలు పూర్తిగా పరిష్కరించే వరకు ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నగర జాయింట్ సెక్రెటరీ గుండాల శివరామరాజు, యలమల హేమ సుందర్, లింగాల రాకేష్, ఇస్లావత్ రామ్ చరణ్, సాయి, బిట్టు, హరి, అరవింద్, శివ, రోహిత్, రాము తదితరులు పాల్గొన్నారు.

# 99 రోజుల ప్రజాపాలన - ప్రగతి నివేదిక కార్యక్రమ విజయాలను కేస్ స్టడీలుగా నమోదు చేయాలి

**జిల్లా ప్రత్యేక అధికారి అనుదీప్ దురిశెట్టి**

**ప్రతి శాఖ విజయాలు, ఉత్తమ పద్ధతులు, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వివరాలతో సమగ్ర నివేదికలు రూపొందించాలి**

**రోడ్డు ప్రమాదాల తగ్గుదలపై గత ఏడాదితో పోల్చి విశ్లేషణ చేయాలి**

**గురుకులాల్లో ఒక్క సీటు కూడా ఖాళీగా ఉండకుండా చర్యలు తీసుకోవాలి**

**ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇసుక కొరత తలెత్తకుండా చర్యలు చేపట్టాలి**

**ప్రతి శాఖ విజయగాథలు, ఉత్తమ ఫొటోలతో ఐదు రోజుల్లో ప్రత్యేక బుక్‌లెట్ సిద్ధం చేయాలి**

**99 రోజుల ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా ప్రత్యేక అధికారి**



ఖమ్మం, జూన్ 23 (పోలీస్ నిఘా) : 99 రోజుల ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో సాధించిన విజయాలను కేస్ స్టడీల రూపంలో నమోదు చేయాలని జిల్లా ప్రత్యేక అధికారి, ఐటీ శాఖ సంయుక్త కార్యదర్శి, గనుల శాఖ ప్రత్యేక కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా ప్రత్యేక అధికారి అనుదీప్ దురిశెట్టి, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత జిల్లా అధికారులతో 99 రోజుల ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక అమలుపై సమీక్షించారు. సమావేశంలో అన్ని శాఖల అధికారులు తమ శాఖల ద్వారా చేపట్టిన కార్యక్రమాలు, సాధించిన విజయాలను వివరించారు. ఈ సందర్భంగా లిజిల్లా ప్రత్యేక అధికారి, జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూలి తెలంగాణ ప్రభుత్వం 99 రోజుల కార్యక్రమం విజయగాథలను గుర్తించి నమోదు చేయడంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ప్రతి శాఖ తమ విజయాలు, సాధించిన ఫలితాలు, ఉత్తమ పద్ధతులు, ప్రజలకు కలిగిన ప్రయోజనాలను సంక్షిప్తంగా పొందుపరుస్తూ నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. ప్రతి శాఖ నివేదికలో స్పష్టమైన వివరాలు ఉండాలని, ఇతర జిల్లాల్లో అమలు చేయదగిన ఉత్తమ పద్ధతులను ప్రత్యేకంగా పేర్కోవాలని తెలిపారు. ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులు, వాటి ప్రస్తుత స్థితి, పరిష్కార వివరాలను కూడా నివేదికల్లో పొందుపరచాలని సూచించారు. పాలేరు నియోజక వర్గంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో అందిన దరఖాస్తులు, పరిష్కరించిన సమస్యలు, పెండింగ్ దరఖాస్తుల వివరాలతో ప్రత్యేక నివేదిక సిద్ధం చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమాలు, బ్లాక్ స్పాట్‌ల సవరణ చర్యల వల్లమరణాల సంఖ్యలో వచ్చిన తగ్గుదలను గత ఏడాది గణాంకాలతో పోల్చి చూపించాలని, ప్రమాదాల తగ్గుదల స్పష్టంగా ప్రతిబింబించేలా నివేదికలు రూపొందించాలని సూచించారు. జిల్లాలోని గురుకుల రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో ఒక్క సీటు కూడా ఖాళీగా ఉండకూడదని, నిరుపేదలు, అనాథలు,ఒంటరి తల్లిదండ్రుల పిల్లలకు ప్రాధాన్యతనిస్తూ ఖాళీ సీట్లను భర్తీ చేయాలని సూచించారు. మంచి విద్య పిల్లలకు జీవితాంతం ఉపయోగపడే గొప్ప బహుమతి అని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు టీజీఎంఐడీసీ, మన ఇసుక వాహనం ద్వారా ఉచిత ఇసుక సరఫరా చేస్తున్నామని, ఖమ్మంజిల్లాలో ఇసుక సమస్య తలెత్తకుండా చూడాలని సూచించారు. ప్రతి నియోజక వర్గంలో నాణ్యమైన ఇసుక బజార్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణాలకు అవసరమైన ఇసుక కేటాయింపులు కూడా టీజీఎంఐడీసీ ద్వారా జరుగుతున్నాయని చెప్పారు. జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశానికి అన్ని శాఖలు తమ అవసరమైన ఇసుక ప్రతిపాదనలు పంపాలని సూచించారు. 99 రోజుల ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికపై రూపొందించే బుక్‌లెట్‌లో ప్రతి శాఖ విజయ గాథలు, ఉత్తమ కేస్ స్టడీలు, థీమ్ వారీగా ఎంపిక చేసిన ఉత్తమ ఫొటోలను పొందుపరచాలని సూచించారు. బుక్‌లెట్ పరిమాణం కంటే నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. ఐదు రోజుల్లో బుక్‌లెట్ పూర్తి చేయాలని ఆదేశించారు. 99 రోజుల కార్యక్రమంలో ప్రారంభమైన పనులకు సంబంధించి భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను కూడా బుక్‌లెట్‌లో చేర్చాలని సూచించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యాచరణకు ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో అధికారులు ఇప్పటివరకు అద్భుతంగా పనిచేశారని అభినందించారు.

జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఖమ్మం జిల్లాలో 99 రోజుల ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికను విజయవంతంగా అమలు చేశామని తెలిపారు. మార్చి 6 నుండి మార్చి 15 వరకు నిర్వహించిన పరిశుభ్రత, ఫైల్ క్లియరెన్స్ కార్యక్రమంలో 11,326 ఫైళ్లను పరిష్కరించామని తెలిపారు. జిల్లాలోని 571 గ్రామాలు, 177 పట్టణ వార్డుల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. మాతృ మరణాల రేటును సున్నాకు తీసుకురావాలనే లక్ష్యంతో తల్లి ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. "ప్రతి ప్రసవం సురక్షితం" కార్యక్రమం ద్వారా హైరిస్క్ గర్భిణులను ముందుగానే గుర్తించి నిరంతర పర్యవేక్షణ తో సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా మొబైల్ ఎక్స్‌రే వాహనాల ద్వారా ప్రత్యేక శిబిరాలు నిర్వహించినట్లు తెలిపారు. మాదక ద్రవ్యాల నిర్మూలన కార్యక్రమాలు, రోడ్డు భద్రత చర్యలపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. బాలల భద్రత వారోత్సవాలు నిర్వహించి అన్ని విద్యాసంస్థల్లో మాదకద్రవ్యాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. 53 మంది అనాథ పిల్లలకు ఆధార్ కార్డులు, జనన ధృవీకరణ పత్రాలు, కుల ధృవీకరణ పత్రాలు, ఆరోగ్యశ్రీ కార్డులు అందించినట్లు తెలిపారు. జిల్లాలో నిర్వహించిన జాబ్‌మేళా ద్వారా 610 మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. వ్యవసాయ వారోత్సవాలు నిర్వహించి రైతు భరోసా, నానో యూరియా వినియోగం, రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు, పంట అవశేషాల దహనం నివారణ, వ్యవసాయ యాంత్రీకరణ, ఆయిల్ పామ్ సాగు, ప్రత్యామ్నాయ పంటల సాగు, నేల ఆరోగ్య నిర్వహణపై విస్తృత అవగాహన కల్పించినట్లు తెలిపారు. అలాగే విద్యా వారోత్సవాలు, యువజన, క్రీడా వారోత్సవాలు నిర్వహించినట్లు తెలిపారు. మహిళల భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో ట్రైనీ కలెక్టర్ పారస్ కుమార్, ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు, మునిసిపల్ కమీషనర్ లు, తదితరులు పాల్గొన్నారు.


# ఇరిగేషన్ అధికారుల సమస్యలను పరిష్కరించాలి

**ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు బజ్జురి రమణారెడ్డి**



బోనకల్, జూన్ 23 (పోలీస్ నిఘా) : జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న మండల సర్వేసభ్య సమావేశ కార్యక్రమంలో భాగంగా ఈరోజు బోనకల్ మండల ఇరిగేషన్ సబ్ డివిజన్లో ఇరిగేషన్ బోన కల్ మండల సర్వసభ్య సమావేశం జరిగింది ఈ కార్యక్రమంలో బోనకల్ సబ్ డివిజన్ పరిధిలోగల ఇరిగేషన్ ఉద్యోగస్తులు అధిక సంఖ్యలో పాల్గొని జిల్లా నాయకులకు వారు ఎదుర్కొంటున్న పలు సమస్యలను తెలియజేయడం జరిగినది ఇందులో సిబ్బందికి రావలసిన పెండింగ్ బిల్స్ అయినటువంటి మెడికల్ బిల్లులు, రవాణా భత్యపు బిల్లులు, ఫీల్డ్ సిబ్బంది అయినా లస్కర్లకు ఇవ్వవలసిన సైకిల్ అలవెన్సును రద్దు చేయడం దాని స్థానంలో బైక్ అలవెన్స్ ఇస్తానని ఇవ్వకపోవడం మరియు ఔట్సోర్సింగ్ సిబ్బందికి గత ఆరు నెలల నుండి శాలరీలు రాకపోవడతో వారు ఉద్యోగ నిర్వహణ, కుటుంబ పోషణ చాలా ఇబ్బందికరంగా ఉందని జిల్లా నాయకత్వం దృష్టికి తీసుకునీ రావడం జరిగినది సిబ్బంది సమస్యలు సావధానంగా విన్న జిల్లా నాయకత్వం అవుట్సోర్సింగ్ ఉద్యోగ స్తుల శాలరీలు వచ్చే నెలలో పడే అవకాశం ఉన్నందున వేచి చూద్దామని లేనియెడల రాష్ట్ర ఫైనాన్స్ సెక్రటరీ పై ఒత్తిడి తెచ్చే విధంగా మనకు అండగా ఉన్నటువంటి జిల్లా టీఎన్జీవో నాయకత్వ దృష్టికి మరియు రాష్ట్ర టి జేఈఏసి రాష్ట్ర నాయకత్వ దృష్టికి తీసుకు వెళ్దామని అదేవిధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే విధంగా ముగ్గురు మంత్రులలో మన జిల్లా వారు అయినందున వారిని కూడా కలిసి మన సమస్యలకు పరిష్కారం అయ్యే విధంగా కృషి చేద్దామని ఈ సమావేశంలో తెలియ చేయడంతో సిబ్బంది అందరూ కూడా హర్షధ్వానాల మధ్య అంగీకరించి ఇక ముందు జరగబోయే ప్రతి కార్యక్రమంలో కూడా మేము మీ వెంటే ఉంటామని అందరం సంఘటితంగా పోరాడుదాం అని ఈ సమావేశంలో తెలియజేయడం జరిగింది. ఈ సబ్ డివిజన్లో పనిచేస్తున్న సిబ్బంది వారి ఉద్యోగ నిర్వహణలో వారి యొక్కపై అధికారులు అయినా డిఈఈ తమ్మవరపు వెంకటేశ్వర్లు గారు మరియు ఏఈఈ లు అయిన సామ్రాజ్, కొండలరావు, శ్రావణి గారులు ఉద్యోగ నిర్వహణలో ఎంతో ప్రోత్సహిస్తూ మాకు అన్ని రకాల అండదండలు అందజేస్తున్నారని, అధికారులము, చిన్న స్థాయి సిబ్బంది అనే భేదభావం లేకుండా అందరం ఒక కుటుంబం వలె ఈ సబ్ డివిజన్లో కలిసి మెలిసి పనిచేస్తున్నామని ఈ సిబ్బంది అందరూ కూడా అధికారులను కొని ఆడారు. ఈ మాటలకు జిల్లా నాయకులు విస్తు పోయారు వారి యొక్క అధికారులకు కూడా యూనియన్ జిల్లా నాయకత్వం సైతం అభినందనలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ప్రాజెక్టు ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బజ్జురి రమణారెడ్డి ప్రధాన కార్యదర్శి సోమపొంగు శ్రీనివాస్ కోశాధికారి ఈశ్వర్ అసోసియేట్ ప్రెసిడెంట్ సురేష్ జిల్లా ఆఫీస్ ఇన్చార్జి సూరిబాబు మరియు మండల నాయకులు కృష్ణ, మదర్, నవీన్ కుమార్, తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు

# అనుబంధం ఆత్మీయతల నడుమ వీడ్కోలు



కాచిగూడ, జూన్ 23 (పోలీస్ నిఘా) : మిత్రమా ..శుభోదయం... ఎక్కడో చూసిన పలకరింపు కాదు నిరంతరం మన మధ్య ఉండే బంధం ఇది...మార్నింగ్ వాక్ లో పలకరింపు కూడా కాదు.. మరి ఏమిటి? యూనిఫాం మీద మక్కువతో హోమ్ గార్డ్స్ గా చేసి ప్రధాన కార్యాలయానికి బదిలీ అవుతున్న ఇద్దరి హోమ్ గార్డ్స్ .సిబ్బంది ఆప్యాయతల కలబోత అది...విషయం లోకి వస్తే....హైదరాబాద్ ట్రాఫిక్ విభాగం లో కాచిగూడ పోలీస్ స్టేషన్ లో తొమ్మిదేళ్లు గా పని చేస్తున్న వీ.ప్రసాద్..ఏక స్వామి తెలంగాణ హోమ్ గార్డ్స్ ప్రధాన కార్యాలయానికి బదిలీ అవుతున్న సందర్భంలో కాచిగూడ ఇన్స్పెక్టర్ కౌశిక్ సార్ అండ్ ఎస్సైలు సిబ్బంది అంతా వారికి వీడ్కోలు పలికి తమ అభిమానాన్ని వ్యక్తం చేశారు.వారిని పూలమాలలతో సత్కరించి శాలువ లు కప్పారు 'కర్తవ్య నిర్వహణలో మరింత మంచి పేరు తెచ్చుకోవాలని అధికారులు వారిని కోరారు....ఎంతో అభిమానం తో కూడిన ఈ వీడ్కోలు ఇన్నాళ్లు కలిసి పని చేసి విడిపోతున్న బాధ తో పాటు సంతోషం కూడా కలిసి ఉందని... ఉన్నతాధికారుల ప్రోత్సాహం తో శాఖకు మరింత పేరు తెస్తామని బదిలీ అయిన హోమ్ గార్డ్ ఆఫీసర్స్ అన్నారు.

# చొప్పకట్లపాలెం గ్రామంలో అర్ధరాత్రి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్ట్




బోనకల్ , జూన్ 23 (పోలీస్ నిఘా) : మండల పరిధిలో ఉన్న చొప్పకట్లపాలెం గ్రామ శివారులలో సోమవారం అర్ధరాత్రి ఇసుక అక్రమ రవాణా జరుగుతుందని పోలీసులకు సమాచారం ఇవ్వగా బోనకల్ ఎస్సై మాచినేని రవి ఆధ్వర్యంలో ఉదయం 3 గంటల సమయంలో రైడ్ చేయగా చొప్పకట్లపాలెం గ్రామానికి చెందిన తుపాకుల నరేష్ అనే వ్యక్తి తన యొక్క ట్రాక్టర్ పై ఇసుక అక్రమ రవాణా చేయుచుండగా అతనిని పట్టుకొని ట్రాక్టర్ ను పోలీస్ స్టేషన్ కు తరలించి అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లును ఘటనా స్థలంలోనే స్వాధీనం చేసుకుంటున్నారు. బోనకల్ మండల ప్రజలకు తెలియజేయునది ఏమనగా, అక్రమ ఇసుక రవాణా చేసినట్లయితే కఠిన చర్యలు తీసుకొని వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుంది.అంతేకాక, ఎటువంటి ప్రభుత్వానికి లేని ఇసుకను రవాణా చేసినట్లయితే అటువంటి వారి సమాచారాల్ని బోనకల్ పోలీస్లకు తెలుపగలరు.

# అమెరికా పౌరసత్వం మరింత ఖరీదు..!



వాషింగ్టన్, జూన్ 23 : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారం చేపట్టినప్పటి నుంచి ఇమిగ్రేషన్ రూల్స్‌ను కఠినతరం చేస్తూనే ఉన్నారు. తాజాగా ఆయన కార్యవర్గం చేసిన ప్రతిపాదనలతో అమెరికా పౌరసత్వం మరింత ఖరీదుగా మారనుంది. పౌరసత్వ దరఖాస్తుల ఫైలింగ్ ఫీజులను 75 శాతం మేర పెంచాలని యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌లాండ్ సెక్యూరిటీ ప్రతిపాదించింది. సక్రమ మార్గంలో వచ్చిన వలసదారులు పౌరసత్వానికి దరఖాస్తు చేసుకుంటే.. ప్రాసెసింగ్, వెట్టింగ్ ఖర్చులు భరించాల్సిరావడంతో పాటు ఇప్పటివరకు ఉన్న పలు మినహాయింపులను కూడా కోల్పోనున్నారు. పౌరసత్వ దరఖాస్తు (పేపర్ బేస్డ్) ఫైల్ చేయడానికి ఫీజు 760 డాలర్ల నుంచి 1330 డాలర్లకు పెరగనుంది. ఆన్‌లైన్ దరఖాస్తు విషయానికొస్తే.. 710 డాలర్ల నుంచి 1280 డాలర్లకు ఫీజు పెంపును అధికారులు ప్రతిపాదించారు. ఈ కొత్త ఫీజులు అమల్లోకి వస్తే.. 75 శాతం మేర భారం పడనుంది. ఏదైనా సిటిజన్‌షిప్ అప్లికేషన్ తిరస్కరణకు గురైతే.. దానిని తిరిగి పరిశీలించాలని కోరినా సరే.. ఖర్చుల మోత మోగనుంది. ఆ రుసుము 830 డాలర్ల నుంచి 1475 డాలర్లకు అంటే 645 డాలర్ల మేర పెరగనుంది. ప్రస్తుతం ఈ ప్రతిపాదిత నిబంధనలపై 60 రోజుల పాటు ప్రజాభిప్రాయ సేకరణ చేయనున్నారు. అలాగే అమెరికాలో ఆదాయ ఆధారిత మార్గదర్శకాల ప్రకారం.. దరఖాస్తుదారులకు ప్రస్తుతం లభిస్తోన్న మినహాయింపులను తొలగించాలని డీహెచ్ఎస్ ప్రతిపాదించింది. 400 శాతం లేక అంతకంటే తక్కువ ఆదాయం ఉన్న దరఖాస్తుదారులకు రెడ్యూస్డ్ ఫీజ్ ఆప్షన్‌ను తీసేయాలని సూచించింది. ఈ కొత్త రూల్స్ వల్ల సహజంగా పౌరసత్వం పొందడానికి అర్హత ఉన్న శాశ్వత నివాసితులు.. తమకున్న అవకాశాలు కోల్పోయే ప్రమాదం ఉందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

# ఆ బాధ నన్ను ఎప్పటికీ వదిలిపోదు

**రాజకీయాలు ఇంత క్రూరమా..?**

**అసెంబ్లీలో తమిళనాడు సీఎం విజయ్ కీలక ప్రసంగం**



చెన్నై, జూన్ 23 : తమిళనాడు అసెంబ్లీ సమావేశాలు కొనసాగుతున్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి విజయ్ మంగళవారం కీలక ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా హిందీ వివాదం, నీట్, కరూర్ తొక్కిసలాట ఘటన వంటి పలు అంశాలను ప్రస్తావించిన విజయ్.. విమర్శకులకు గట్టిగా బదులిచ్చారు. ఎన్నో సవాళ్లను దాటి తాము అధికారంలోకి వచ్చామని, నటుడి పార్టీ అని తమను ఎంతోమంది ఎగతాళి చేశారని గుర్తుచేసుకున్నారు.

**యాక్టర్ పార్టీ అన్నారు..**

"మాకు ఈ అధికారం అంత సులువుగా వచ్చింది కాదు. తమిళనాడు ప్రజల హృదయాలను గెలుచుకునేందుకు నేను, నా పార్టీ ఎన్నో కుట్రలు, సవాళ్లను అధిగమించాల్సి వచ్చింది. మాది యాక్టర్ పార్టీ అని, నేను సినిమా షూటింగ్ నుంచి నేరుగా సీఎం కుర్చీలో కూర్చున్నానని చాలా మంది గేలి చేశారు. అలాంటి విమర్శలు నేను పట్టించుకోను. సాధారణంగా చాలా మంది రాజకీయ పార్టీ పెట్టి ప్రజల్లోకి వెళ్తారు. కానీ, నేను ప్రజల్లోకి వెళ్లిన తర్వాత పార్టీ పెట్టి ఎన్నికల్లో పోటీ చేశా. నాపై నమ్మకం ఉంచి ప్రజలు గెలిపించారు" అని విజయ్ అన్నారు.

**రాజకీయాలు ఇంత క్రూరమా..?**

ఈ సందర్భంగా నీట్ వివాదం గురించి విజయ్ సభలో ప్రసంగించారు. నీట్ విధానం విద్యా వ్యవస్థలో అసమానతలను సృష్టిస్తోందని, దీన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తమిళనాడులో ద్విభాషా విధానానికే తాము కట్టుబడి ఉన్నట్లు సీఎం పునరుద్ఘాటించారు. హిందీ భాషను రుద్దేందుకు కేంద్రం చేస్తోన్న ప్రయత్నాలను తాము ఎప్పటికీ అంగీకరించబోమన్నారు. ప్రసంగంలో భాగంగా ఎన్నికల ప్రచార సమయంలో చోటుచేసుకున్న కరూర్ తొక్కిసలాట ఘటనను విజయ్ ప్రస్తావించారు. "41 మంది ప్రాణాలు కోల్పోయిన ఆ విషాద ఘటన నన్ను ఎంత వేదనకు గురిచేసిందో మాటల్లో చెప్పలేను. ఆ బాధ నన్ను ఎన్నటికీ వదలదు. ఆ ఘటన విషయంలోనూ మాపైనే నిందలేశారు. ఇది అత్యంత దారుణం. రాజకీయాలు ఇంత క్రూరంగా ఉంటాయా?" అని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారసత్వ రాజకీయాల గురించి స్పందిస్తూ డీఎంకేపై విజయ్ పరోక్షంగా విమర్శలు గుప్పించారు. "కేవలం ఒక కుటుంబానికే (డీఎంకేను ఉద్దేశిస్తూ) ప్రాధాన్యమివ్వడం మా రాజకీయ విధానం కాదు. తమిళనాడులోని ప్రతి కుటుంబానికి మా సేవలందిస్తాం. అదే మా రాజకీయం. అదే మా పాలనా విధానం" అని విజయ్ పేర్కొన్నారు.

# యుద్ధం ముందున్న స్థితికి హార్ముజ్ ఎప్పటికీ తిరిగిరాదు: ఘాలిబఫ్




టెహ్రాన్, జూన్ 23 : పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గించేందుకు ప్రయత్నాలు జరుగుతోన్న తరుణంలోనూ.. హార్ముజ్ జలసంధిపై అమెరికా, ఇరాన్ తరచూ ఏదో ఒక ప్రకటన చేస్తూనే ఉన్నాయి. హార్ముజ్ నిర్వహణను ఇరానే చూస్తుందని ఆ దేశ పార్లమెంట్ స్పీకర్ ఘాలిబఫ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ జలసంధి.. యుద్ధానికి ముందున్న స్థితికి ఎప్పటికీ తిరిగిరాదన్నారు. "మేం అమెరికన్లను ఎన్నడూ నమ్మలేదు. ఇప్పుడూ నమ్మడం లేదు. భవిష్యత్తులోనూ వారిపట్ల ఆ ధోరణితో ఉండటం సమంజసమే" అని ఘాలిబఫ్ అమెరికా పట్ల ఇరాన్‌కున్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. స్విట్జర్లాండ్‌లో ఇప్పటికే రెండు దేశాల మధ్య చర్చలు జరిగిన సంగతి తెలిసిందే. ఫ్రీజ్ చేసిన 12 బిలియన్ డాలర్ల ఇరాన్ ఆస్తులను విడుదల చేయడానికి తుది ఒప్పందం కుదిరిందని ఆయన పేర్కొన్నారు. కాగా.. తమ నుంచి సోయా, మొక్కజొన్న, గోధుమలు కొనేందుకు ఇరాన్ అంగీకరిస్తే.. ఫ్రీజ్ చేసిన ఆ దేశ ఆస్తులను విడుదల చేసేందుకు అమెరికా సిద్ధంగా ఉన్నట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే.

**హార్ముజ్ పూర్తిగా తెరిచే ఉంది: ట్రంప్**

మరోవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హార్ముజ్‌పై భిన్నమైన వ్యాఖ్యలు చేశారు. హార్ముజ్ పూర్తిగా తెరిచే ఉందని ప్రకటించారు. ఈ జలసంధికి మరోవైపున ఉన్న ఒమన్ దేశం తాజా పరిణామాలపై స్పందించింది. అంతర్జాతీయ చట్టాలకు, టోల్ రహిత ప్రయాణానికి కట్టుబడి ఉన్నామని ప్రకటించింది. ఇరాన్–అమెరికా మధ్య కుదిరిన అవగాహన ఒప్పందంపై నిర్మాణాత్మక చర్చలు జరిగాయని పేర్కొంది.

## 80కి పైగా అజెండా అంశాలకు

# ఏపీ క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్



అమరావతి, జూన్ 23 (పోలీస్ నిఘా) : సీఎం చంద్రబాబు అధ్యక్షతన వెలగపూడి సచివాలయంలో జరిగిన మంత్రివర్గ సమావేశం ముగిసింది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన భేటీలో 80కి పైగా అజెండా అంశాలకు క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ భేటీలో రాష్ట్ర పారిశ్రామిక ప్రగతి, మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యంగా పలు చారిత్రాత్మక నిర్ణయాలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కేబినెట్ భారీ ఊరటనిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. 2004 కంటే ముందు ఉద్యోగాల్లో చేరిన వారికి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. తాజా నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 11 వేల ఉద్యోగులకు నేరుగా ప్రయోజనం చేకూరనుంది. రిటైర్మెంట్ కాలంలో భద్రత కల్పించే ఈ నిర్ణయం ద్వారా ప్రతి ఉద్యోగికి సగటున దాదాపు రూ.3 కోట్ల వరకు లబ్ధి చేకూరుతుందని అంచనా వేస్తున్నారు.

**రూ.34 వేల కోట్ల పెట్టుబడులు..**

**35 వేల కొత్త ఉద్యోగాలు**


రాష్ట్రంలో పెట్టుబడుల స్థాపన, నిరుద్యోగులకు ఉపాధి కల్పనకు పెద్దపీట వేస్తూ మంత్రివర్గం కీలక ప్రతిపాదనలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పరిశ్రమలు, ఐటీ, పర్యాటకం, రాజధాని అభివృద్ధి, డేటా సెంటర్లు, పునరుత్పాదక ఇంధన రంగానికి సంబంధించిన ప్రతిపాదనలకు ఆమోదం ముద్ర వేసింది. రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి ద్వారా ప్రతిపాదించిన దాదాపు రూ.34 వేల కోట్ల భారీ పెట్టుబడుల స్థాపనకు కేబినెట్ అనుమతులు మంజూరు చేసింది. ఈ పరిశ్రమలు, ప్రాజెక్టులు అందుబాటులోకి రావడం ద్వారా రాష్ట్రంలో కొత్తగా 35 వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.

**రాజధాని, మౌలిక వసతుల అభివృద్ధికి నిధులు**

రాజధాని ప్రాంతంతో పాటు న్యాయవ్యవస్థకు సంబంధించిన మౌలిక సదుపాయాల కల్పనపై కేబినెట్ ప్రత్యేక దృష్టి సారించింది. ఉండవల్లి పరిసర ప్రాంతాలలో అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ. 426 కోట్లు కేటాయించేందుకు ఆమోదం తెలిపారు. ఇక రాష్ట్ర జ్యుడీషియల్ అకాడమీ శాశ్వత భవన నిర్మాణ పనుల కోసం రూ.139 కోట్ల వ్యయంతో పనులు చేపట్టేందుకు మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

## క్యాలీఫ్లవర్‌పై ఫంగస్, కిచెన్‌లో బొద్దింకలు..


# రెండు ప్రముఖ రెస్టారెంట్లకు నోటీసులు



హైదరాబాద్, జూన్ 23 (పోలీస్ నిఘా) : సైబరాబాద్ పరిధిలో ఫుడ్‌సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు ప్రముఖ రెస్టారెంట్లలో లోపాలను అధికారులు గుర్తించారు. కిచెన్, స్టోర్ రూమ్‌లో అపరిశుభ్ర వాతావరణం, లేబుల్స్ లేని ఆహారాపదార్థాలను గుర్తించిన అధికారులు.. ఆ రెండు రెస్టారెంట్లకు నోటీసులు జారీ చేశారు. పుప్పాలగూడలోని కంచి కేఫ్‌లో తనిఖీలు నిర్వహించగా.. కిచెన్, స్టోర్ రూమ్ మధ్య ఓపెన్ డస్ట్‌బిన్లు ఉండటంతో దుర్వాసన, ఈగల సమస్య బయటపడింది. స్టోర్ రూమ్ సీలింగ్‌పై దుమ్ము పేరుకుపోవడాన్ని గుర్తించారు. గ్రైండింగ్, కూరగాయలు కట్ చేసే ప్రాంతాల్లో నీటి నిల్వ, క్యాలీఫ్లవర్‌పై ఫంగస్ పెరిగినట్లు తనిఖీల్లో వెలుగు చూసింది. డ్రైయిన్ల వద్ద దుర్వాసన, ఫ్రిజ్‌లలో నిల్వ చేసిన పిండిపై లేబులింగ్ సరిగ్గా లేదని అధికారులు తెలిపారు. అంతేకాకుండా కిచెన్, స్టోర్ రూమ్‌లో తిరుగుతున్న ఈగలు, బొద్దింకలను గుర్తించారు. మెడికల్ ఫిట్‌నెస్, పెస్ట్ కంట్రోల్, వాటర్ టెస్టింగ్, ప్యాకేజింగ్ మెటీరియల్ టెస్టింగ్ రికార్డులు అందుబాటులో లేవని అధికారులు తెలిపారు. దీంతో ఫుడ్ లేబులింగ్, హౌస్ కీపింగ్ మెరుగుపరచాలని ఆదేశిస్తూ.. నోటీసులు జారీ చేశారు. నల్లగండ్లలోని కోడికూర చిట్టిగారెలోనూ అధికారులు తనిఖీలు చేశారు. చికెన్, డెజర్ట్స్‌కు లేబుల్ లేనట్టు బయటపడింది. దీంతో లేబుల్స్ లేని ఆహార పదార్థాలను అధికారులు అక్కడికక్కడే తొలగించారు. గ్రైండింగ్ ఏరియా సీలింగ్‌పై దుమ్ము పేరుకుపోవడంతో పాటు మెడికల్ ఫిట్‌నెస్, ప్యాకేజింగ్ మెటీరియల్ టెస్టింగ్ రికార్డులు లేవని అధికారులు తెలిపారు. జిడ్డుగా మారిన కిచెన్ సీలింగ్‌ను వెంటనే శుభ్రం చేయాలని రెస్టారెంట్ నిర్వాహకులను ఆదేశించారు. కోడికూర చిట్టిగారె రెస్టారెంట్‌కు ఫుడ్‌సేఫ్టీ అధికారులు నోటీసులు కూడా జారీ చేశారు.

## అయోధ్య రామాలయం విరాళాల గోల్‌మాల్..

# ప్రభుత్వానికి 'సిట్' ప్రాథమిక నివేదిక సమర్పణ!



అయోధ్య, జూన్ 23 : దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించబడిన అయోధ్య రామలయం విరాళాల్లో గోల్‌మాల్ జరిగినట్లు అధికారులు గుర్తించారు. ఈ మేరకు యూపీ ప్రభుత్వం పూర్తి స్థాయి విచారణకు సిట్ ను ఏర్పాటు చేయగా.. అన్ని కోణాల్లో పూర్తిగా విచారించారు. అయోధ్య శ్రీరామ జన్మభూమి ఆలయానికి భక్తులు సమర్పించిన విరాళాలు, నగదు, బంగారు, వెండి కానుకల మళ్లింపు (దుర్వినియోగం) ఆరోపణలపై దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం మంగళవారం ఉదయం తన ప్రాథమిక నివేదికను ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి సమర్పించింది. లక్నో డివిజనల్ కమిషనర్ విజయ్ విశ్వాస్ పంత్ నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల సిట్ బృందం, ఈ నివేదికను యూపీ హోంశాఖ అదనపు ప్రధాన కార్యదర్శి సంజయ్ ప్రసాద్‌కు అందజేసింది.

పర్యవేక్షణ లోపం – నిర్లక్ష్యం: ఆలయ హుండీ కానుకల లెక్కింపు, భద్రత, సీసీటీవీ ఫుటేజ్ నిర్వహణ, బ్యాంకుల్లో డిపాజిట్ చేసే ప్రక్రియలో తీవ్రమైన లోపాలు, నిర్లక్ష్యం జరిగినట్లు సిట్ ప్రాథమికంగా గుర్తించింది.

ట్రస్టు సిబ్బంది పాత్ర: విరాళాల లెక్కింపు, నిర్వహణతో సంబంధం ఉన్న దాదాపు 150 మందిని (ట్రస్టు సిబ్బంది, బ్యాంకు అధికారులు, ప్రైవేట్ ఉద్యోగులు) సిట్ ప్రశ్నించింది. బంగారం, వెండి, వజ్రాల వంటి విలువైన కానుకల లెక్కలపై కొందరు ఆఫీస్ బేరర్లు ఇచ్చిన సమాధానాలు ఏమాత్రం సంతృప్తికరంగా లేవని తేలింది.

మహా కుంభమేళా సమయంలోనే అక్రమాలు: జనవరి–ఫిబ్రవరి 2025లో జరిగిన మహా కుంభమేళా సమయంలో రోజుకు దాదాపు 10 లక్షల మంది భక్తులు రావడంతో, భారీగా వచ్చిన నగదు విరాళాలను మళ్లించడంలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఈ కుంభకోణం విలువ రూ. 200 కోట్లకు పైనే ఉండవచ్చని అంచనా.

**సిట్ సిఫార్సులు – తదుపరి చర్యలు**

అక్రమాలకు బాధ్యులైన వారిపై తక్షణమే అధికారికంగా ఎఫ్ఐఆర్ నమోదు చేసి చట్టపరమైన విచారణ జరపాలని, దొంగిలించిన సొమ్మును రికవరీ చేయాలని సిట్ సిఫార్సు చేసింది. ఈ కేసులో ఇప్పటికే ఐదుగురు అనుమానితుల నుంచి రూ. 2 కోట్ల నగదు, ఒక ఎస్‌యూవీ వాహనం, 3 ఐఫోన్లను రికవరీ చేశారు. అలాగే, గతంలో విరాళాల లెక్కింపులో ఉన్న పాత సిబ్బంది అందరినీ విధుల నుంచి తొలగించారు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆదేశాల మేరకు ఈ నివేదిక సమర్పించబడగా.. రాబోయే 10 నుంచి 15 రోజుల్లో పూర్తి స్థాయి తుది నివేదికను అందజేస్తామని సిట్ సభ్యుడు విజయ్ విశ్వాస్ పంత్ తెలిపారు. ఈ నివేదిక ఆధారంగా దోషులపై సీఎం యోగి కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉండటంతో దేశవ్యాప్తంగా ఈ వ్యవహారం సంచలనంగా మారింది.

# కేంద్ర మంత్రి జార్జి కురియన్ రాజీనామా



న్యూఢిల్లీ, జూన్ 23 : కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి జార్జి కురియన్ తన పదవికి రాజీనామా చేశారు. ఆయన రాజ్యసభ పదవీ కాలం ముగియడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సారి భాజపా ఆయన్ను తిరిగి రాజ్యసభకు నామినేట్ చేయలేదు. కురియన్ రాజీనామాను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదించారు. ఈ విషయాన్ని మంగళవారం రాష్ట్రపతి భవన్ ధ్రువీకరించింది. ఇప్పటి వరకు కురియన్ మైనార్టీ వ్యహారాల శాఖతోపాటు.. మత్స్య, పాడి, పశుపోషణ శాఖలను కూడా సహాయ మంత్రి హోదాలో నిర్వహించారు. ప్రస్తుతం కేంద్ర మంత్రి వర్గంలో ఏకైక క్రిస్టియన్ మంత్రి కురియన్ మాత్రమే. ఆయన రాజ్యసభ పదవీకాలం జూన్ 21తో ముగిసింది. మరో మంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టూను కూడా ఈ సారి పార్టీ రాజ్యసభకు నామినేట్ చేయని విషయం తెలిసిందే.

# చుక్కలనంటిన కూరగాయల ధరలు.. సామాన్యుల జేబుకు చిల్లు



హైదరాబాద్, జూన్ 23 (పోలీస్ నిఘా) : తెలంగాణలో కూరగాయల ధరలు భగభగ మండిపోతున్నాయి. నిన్నా మొన్నటి వరకు ఎండలు, తాజాగా వర్షాభావ పరిస్థితులు వల్ల కూరగాయల ధరలకు రెక్కలు వచ్చాయి. జూన్ నెలాఖరు వచ్చినా ఈసారి వానల జాడ లేకపోవడంతో కూరగాయల సాగు భారీగా తగ్గిపోయింది. దీనికి తోడు ఎండలు, పెరిగిన ఇంధన ధరలు, ఎల్‌నినో ప్రభావం వెరిసి కూరగాయల రేట్లు పట్టపగలే సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి. బీన్స్, చిక్కుడు, బీరగాయ, పచ్చి మిర్చి, దొండకాయ, వంకాయ ఇలా అన్ని కూరగాయల రేట్లు రెట్టింపు కాగా పాలకూర, తోటకూర, కొత్తిమీర, మెంతి కూర తదితర ఆకుకూరలు బోరు మోటార్ల నుంచి నీరు అందక ఎండిపోతున్నాయని అంటున్నారు. దీంతో ఆకు కూరలు మార్కెట్ రాక ధరలు పెరిగాయని విక్రయదారులు చెబుతున్నారు.

**భారీగా తగ్గిన ఉత్పత్తి:**

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భూగర్భ జలాలు తగ్గిపోవడం, సాగు నీటి వసతి, ఇతర కారణాల వల్ల కూరగాయలను పండించేందుకు రైతులు ఆసక్తి చూపడం లేదు. దీంతో కూరగాయల సాగుభారీగా పడిపోయింది. రైతు బజార్లలో సరుకు లేకపోవడంతో విక్రయదారులు సైతం మహారాష్ట్ర, తమిళనాడు, మధ్యప్రదేశ్ లాంటి రాష్ట్రాల నుంచి కూరగాయలు దిగుమతి చేసుకుంటున్నారు. జిల్లాల్లోని వ్యాపారులు హైదరాబాద్,కర్నూల్ వంటి ప్రాంతాల నుంచి సరుకు తెప్పించుకుని విక్రయిస్తున్నారు. పెద్ద ఎత్తున ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తుండటంతో దళారులు ధరలు పెంచేశారు. వారి నుంచి కొనుగోలు చేసే చిన్న వ్యాపారులు సైతం ధరలను మరింత పెంచడంతో వినియోగదారులకు పెను భారం పడుతోంది. దీంతో బీన్స్ రైతు బజార్‌లో కేజీ రూ. 100 ఉండగా, రిటైల్ మార్కెట్‌లో రూ.150 నుంచి రూ.180 వరకు పలుకుతుండగా చిక్కుడుకాయ కూడా రైతు బజార్?లో రూ.70 నుంచి రూ.80 ఉండగా, బయట మార్కెట్‌లో రూ.150 వరకూ అమ్ముడవుతోంది. మిర్చి కిలో రూ.80కి చేరింది. దీంతో కూరగాయల భోజనం చేయాలంటే సామాన్యుల బడ్జెట్?కు చిల్లు పడుతోంది.

Printed, Published & Owned by Kemoju Madhuri, Plot No.32, 3rd Floor, R.K.Nagar, Attapur, Rajendra Nagar, R.R.Dist., Telangana State, Pin Code:500043, Printed at S.V.Printers, Plot No.32,Ground Floor, R.K.Nagar, Attapur, Rajendra Nagar, R.R.Dist., Telangana State, Pin Code: 500043, Editor : Kemoju Srinivas, RNI No.TELTEL/2016/68720, e-mail: policenigah@gmail.com. Cell: 9133613813, Off: 040-35668279